www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50
శనివారం | 8-2-2025 | పేజీలు: 14
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 294
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి రా. 8.16 తదుపరి ద్వాదశి. నక్షత్రం: మృగశిర సా. 6.07 తదుపరి ఆర్ద్ర. వర్జ్యం: రా. 2.26 నుంచి 4.01 వరకు. దుర్ముహూర్తం: ఉ. 6.48 నుంచి 8.19 వరకు, అమృతఘడియలు: ఉ. 9.31 నుంచి 11.04 వరకు, రాహుకాలం: ఉ. 9.00 నుంచి 10.30 వరకు, సూర్యోదయం: 6.48, సూర్యాస్తమయం: 6.10
విజయవాడ సిటీ
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అమెరికా నుంచి మరో 487 మంది!

2

భారతీయ అక్రమ వలసదారుల తరలింపుపై సమాచారం: విదేశాంగ కార్యదర్శి మిస్రీ

అమెరికా అధికారులతో సంప్రదింపులు.. దురుసుగా ప్రవర్తించవద్దని విజ్ఞప్తి చేశామని వెల్లడి

ఐసీసీపై అమెరికా ఆంక్షలు

నెతన్యాహు మీద వారెంట్ జారీతో ట్రంప్ ఆగ్రహం

ఆంక్షలు విధిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ

అమెరికా చర్యలను తీవ్రంగా ఖండించిన ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు





క్యారెక్టర్ ఖాళీ.. విలువలు సున్నా!

జగన్‌పై సోదరి షర్మిల మండిపాటు

- ఆస్తుల కోసం తల్లికి, చెల్లికి వెన్నుపోటు పొడిచారు
- సాయిరెడ్డితో బలవంతంగా అబద్ధాలు చెప్పించారు
- ఏం మాట్లాడాలో 40 నిమిషాలు జగన్ డిక్టేట్ చేశారట
- జగన్ నైజాన్ని సాయిరెడ్డి అర్థం చేసుకున్నారు
- ఆయన వద్ద పడ్డ బాధలు నాతో చెప్పుకొన్నారు: షర్మిల

అబద్ధాలు చెప్పడం... నిజాలు అని నమ్మించడం జగన్ నైజం

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 'నాయకుడికి క్యారెక్టర్, క్రెడిబిలిటీ ఉండాలి' అని సుద్దులు చెప్పిన వైఎస్ జగన్‌కే విలువలు, విశ్వసనీయత లేవని ఆయన సోదరి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజమెత్తారు. సొంత తల్లి, చెల్లి, మేనకోడలు, మేనల్లుడికి వెన్నుపోటు పొడిచారని.. నీచుడని మండిపడ్డారు. ఆస్తుల కోసం సొంత

మిగతా 13వ పేజీలో...

క్యారెక్టర్ ఉంది.. భయం లేదు!

అందుకే ఎవరికీ లొంగలేదు: సాయిరెడ్డి

జగన్‌తోపాటు కేసు పెట్టినప్పుడే భయపడలేదు: మోపిదేవి

జగన్ వ్యాఖ్యలకు 'మాజీల' కౌంటర్

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఇక అధికారికం

- లాంఛనంగా కేంద్ర కేబినెట్ ఆమోదం
- వాల్తేరు డివిజన్ ఇక విశాఖ డివిజన్
- తూర్పు కోస్తా జోన్‌లో కొత్తగా రాయగడ డివిజన్

కొత్త ఐటీ బిల్లుకు ఓకే.. 2026 దాకా స్కిల్ ఇండియా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారికంగా ఉనికిలోకి వచ్చినట్లయింది. శుక్రవారం సాయంత్రం ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ జోన్ ఏర్పాటుకు లాంఛనంగా ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని సమాచార ప్రసార, రైల్వే, ఐటీ-ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులకు తెలిపారు. ఈ నిర్ణయంతో పార్లమెంటులో

మిగతా 2వ పేజీలో...

130 కి.మీ. వేగంతో చుక్..చుక్

పట్టాలపై దూసుకుపోనున్న రైళ్లు

విజయవాడ డివిజన్ మెయిన్ లైన్లలో ట్రాక్ అప్‌గ్రేడ్

నిషేధ భూములకు విముక్తి



22(ఏ) నుంచి 38 వేల ఎకరాల ప్రైవేటు భూములకు స్వేచ్ఛ!

జగన్ హయాంలో సామాన్య రైతుల భూములకు చెర

- ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు, రాజకీయ ప్రత్యర్థులే లక్ష్యంగా వికృత క్రీడ
- కూటమి సర్కారు వచ్చాక వేలాది ఫిర్యాదులు
- ఆ జాబితా నుంచి తొలగించాలని సీఎం నిర్ణయం
- ప్రభుత్వ ప్రయోజనాలతో సంబంధం లేని ప్రైవేటు భూములు 22ఏ నుంచి బయటకు
- కసరత్తు మొదలు పెట్టిన రెవెన్యూ శాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నాడు వైసీపీ నేతల దౌర్జన్యం, ఒత్తిళ్లతో అన్యాయంగా నిషేధిత జాబితాలోకి చేర్చిన భూములను విడిపించాలన్న ప్రజల డిమాండ్లపై కూటమి సర్కారు సానుకూలంగా స్పందించింది. ప్రభుత్వ ప్రయోజనాలతో సంబంధం లేని ప్రైవేటు భూములకు విముక్తి కల్పించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ మేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియాను ఆదేశించినట్లు తెలిసింది. అన్యాయంగా నిషేధిత జాబితాలో చేర్చిన దాదాపు 38 వేల

మిగతా 14వ పేజీలో...

ఇంటి లోగుట్టు తేల్చండి

- ప్రతి నవరత్న లబ్ధిదారుడి డేటా తనిఖీ
- పరిశీలనకు ప్రత్యేక యాప్
- 18 ప్రశ్నలతో వెరిఫికేషన్
- అనర్హులను గుర్తించేందుకు చర్యలు.. స్పెషల్ డ్రైవ్‌కు ఆదేశం

9

స్వర్ణాంధ్ర-2047కు సహకరించండి



నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీకి జ్ఞాపికను బహూకరిస్తున్న చంద్రబాబు

- 15% వృద్ధిరేటు సాధనకు అనుకూల సమయం
- ఇంటికొకరిని ఏఐ నిపుణులుగా తీర్చిదిద్దుతాం
- పాలనాపరంగా ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా అభివృద్ధిలో ముందంజ వేసేందుకు శ్రమిస్తున్నాం
- రీజనల్ గ్రోత్ హబ్‌లుగా అమరావతి, తిరుపతి
- అత్యుత్తమ పాలసీల అమలే ప్రభుత్వ విధానం
- నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు బేరీతో భేటీలో సీఎం
- రాష్ట్రంలో అభివృద్ధికి అవకాశాలపై ప్రజెంటేషన్

అమరావతి/మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'వన్ ఫ్యామిలీ.. వన్ ఏఐ ప్రొఫెషనల్.. వన్ ఎంటర్‌ప్రెన్యూర్..' లక్ష్యంతో రూపొందించుకున్న స్వర్ణాంధ్ర-2047కు కేంద్ర ప్రభుత్వ సహాయ, సహకారాలు అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రాష్ట్ర సచివాలయానికి తొలిసారిగా వచ్చిన నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు సుమన్ బేరీకి సీఎం చంద్రబాబు శుక్రవారం ఘనంగా స్వాగతం

మిగతా 13వ పేజీలో...

సాంకేతిక 'సాగు'

ఐదేళ్లలో 30% వృద్ధిరేటు లక్ష్యం

జూన్‌లోనే నారుమళ్లకు జలాలు

- జిల్లాల్లో వ్యవసాయ సదస్సులు
- రైతుల నుంచి అభిప్రాయ సేకరణ
- విదేశాలకు అక్వా, ఉద్యాన పంటలు
- అగ్రి, వెటర్నరీ విద్యార్థులకు స్టైపెండ్ పెంపు
- వర్సిటీలలో రిటైర్మెంట్ 62 ఏళ్లకు పెంపు
- 'వ్యవసాయ' సమీక్షలో సీఎం ఆదేశాలు

13



10

ఆర్బీఐ 'కరుణ' కటాక్షం

- రెపో రేటు 6.5 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గింపు
- ఐదేళ్ల తర్వాత ఇదే తొలిసారి
- తగ్గనున్న గృహ, వాహన, వ్యక్తిగత రుణ వడ్డీ రేట్లు

నేడే ఢిల్లీ ఫలితాలు

50 దాకా స్థానాల్లో గెలుస్తాం: బీజేపీ.. మళ్లీ మేమే: ఆప్

2

సిక్కోలు వ్యథే.. 'తండేల్' కథ!

జిల్లాలో 104 మత్స్యకార గ్రామాలు.. స్థానికంగా ఉపాధి లేక తంటాలు

- ఏటా దూరప్రాంతాలకు వలస
- పొరపాటున గీత దాటినా పొరుగు దేశాల జైలులో మగ్గాల్సిందే!
- 2018లో పాకిస్థాన్ బందీలుగా పలువురు జాలర్లు
- 13 నెలల పాటు జైల్లో నరకయాతన
- అదే ఇతివృత్తంగా సినిమా నిర్మాణం

12



పాకిస్థాన్‌లో బందీలుగా ఉన్న సిక్కోలు మత్స్యకారులు (ఫైల్)



14

హయగ్రీవ కేసులో కదిలిన డొంక!

మాజీ ఎంపీ ఎంవీవీ ఆస్తులు జప్తు చేసిన ఈడీ

- వృద్ధాశ్రమం కోసం కొన్న సర్కారు భూమిని నకిలీ పత్రాలతో లాక్కున్న ఎంవీవీ
- సొంత అవసరాలకు ప్రభుత్వ భూమి వినియోగం
- ఆయనకు, మరో ముగ్గురికి రూ.87.64 కోట్లు లబ్ధి

మార్ఫింగ్‌పై 9 గంటల విచారణ

ఒంగోలు పోలీసుల ముందుకు ఆర్జీవీ

- సోషల్ మీడియాలో మార్ఫింగ్ ఫొటోలపై సుదీర్ఘ విచారణ.. ఫైబర్‌నెట్ సొమ్ముపై మౌనం
- ఆయన సెల్‌ఫోను అడిగిన విచారణాధికారి
- తీసుకురాలేదన్న వర్మ.. కానీ స్థానిక వైసీపీ కార్యాలయాన్ని చూపిన సెల్ లొకేషన్
- పోలీసులు వెళ్లి వెతికినా దొరకని వైనం
- ఈసారి విచారణకు ఫోన్ తేవాలని స్పష్టీకరణ
- వైసీపీ నేతలతో వ్యక్తిగత పరిచయాలేదన్న వర్మ
- మరో కేసులో ఎల్లుండి రావాలని సీఐడీ నోటీసులు

13



ఒంగోలు రూరల్ పోలీసు స్టేషన్‌లోకి వెళుతున్న రామ్‌గోపాల్ వర్మ



పోలీసు విచారణకు వచ్చిన డాక్టర్ ప్రభావతి

నివేదికలు ఎందుకు తారుమారు చేశారు?

2

- అలా చేయమని మీపై ఒత్తిడి చేసిందెవరు?
- జీజీహెచ్ మాజీ అధికారి ప్రభావతిని ప్రశ్నించిన ఎస్పీ
- రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో
- మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకూ విచారణ

అదానీ రూ.10 వేల కోట్ల విరాళం

- విద్య, వైద్య రంగాల్లో సేవా కార్యక్రమాల కోసం..
- చిన్న కుమారుడి పెళ్లిలో ప్రకటించిన వ్యాపారవేత్త
- నిరాడంబరంగా జరిగిన వివాహం

2

విదేశాల్లోని జైళ్లలో 10,152 మంది భారతీయులు

లోక్‌సభకు తెలిపిన కేంద్రం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: విచారణలో ఉన్న వారితో సహా విదేశాల్లోని జైళ్లలో 10,152 మంది భారతీయ ఖైదీలు ఉన్నట్టు విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్దన్ సింగ్ శుక్రవారం లోక్‌సభకు లిఖిత పూర్వకంగా తెలియజేశారు. దేశాల వారీగా జైళ్లలో ఎంత మంది భారతీయ ఖైదీలు ఉన్నారో వెల్లడించారు. సౌదీ అరేబియా, కువైత్, యూఏఈ, ఖతార్, నేపాల్, పాకిస్తాన్, అమెరికా, శ్రీలంక, స్పెయిన్, రష్యా, ఇజ్రాయెల్, చైనా, బంగ్లాదేశ్, అర్జెంటీనా సహా 86 దేశాల్లో వీరు ఉన్నారని తెలిపారు. సౌదీ అరేబియాలో 2,633 మంది, యూఏఈలో 2,518 మంది, నేపాల్‌లో 1,317 మంది, పాకిస్తాన్‌లో 266 మంది, శ్రీలంకలో 98 మంది భారతీయ ఖైదీలున్నారని పేర్కొన్నారు. ఖతార్ జైళ్లలో 611 మంది భారతీయ ఖైదీలున్నట్టు ఆయన తెలిపారు. మరోవైపు, అమెరికా జారీ చేసే హెచ్-1బీ వీసా లబ్ధిదారుల్లో భారతీయులే ఎక్కువని కేంద్రం తెలిపింది. 2022 అక్టోబరు నుంచి 2023 సెప్టెంబరు మధ్య జారీ అయిన వీసాల్లో 72.3 శాతం వీసాలను భారత నిపుణులే దక్కించుకున్నారని కీర్తి వర్ధన్‌సింగ్ వెల్లడించారు. ఇటీవల వీసా తిరస్కరణలు పెరగడంపై ఆయన స్పందిస్తూ, విదేశీ ప్రభుత్వాల సార్వభౌమత్వానికి సంబంధించిన అంశాలపై బహిరంగంగా మాట్లాడబోమని స్పష్టం చేశారు. కాగా, అటవీ భూమిని అటవీయేతరాల కోసం మళ్లించినందుకు వినియోగ ఏజెన్సీల నుంచి పరిహార సుంకాలుగా ఇప్పటి వరకు రూ.94,843 కోట్లు వసూలు చేసినట్టు కీర్తి వర్ధన్ సింగ్ గురువారం రాజ్యసభకు లిఖిత పూర్వకంగా తెలియజేశారు. ఇందులో రూ.26,002.16 కోట్లను ఐదు ఆర్థిక సంవత్సరాల్లో (2019-20 నుంచి 2023-24) అడవుల పెంపకం, సంబంధిత కార్యకలాపాల కోసం వినియోగించినట్టు తెలిపారు.

అమెరికా నుంచి మరో 487 మంది!

- తరలింపుపై వారికి తుది ఉత్తర్వులు జారీ..కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి మిస్రీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: అమెరికా నుంచి మరో 487 మందిని వెనక్కి పంపించనున్నారని, తరలింపుపై వారికి తుది ఉత్తర్వులు జారీ చేశారని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ మేరకు అమెరికా అధికారులు సమాచారం ఇచ్చినట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ శుక్రవారం తెలిపారు. వారిలో 298 మంది వివరాలను తమకు అందజేసినట్లు చెప్పారు. అమెరికా న్యాయ శాఖ నిబంధనల మేరకు అక్కడి అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అక్రమ వలసదారుల సంఖ్యపై తమకు సమాచారం అందించారని తెలిపారు. తొలివిడతలో 104 మంది భారతీయ అక్రమ వలసదారుల కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి సైనిక విమానంలో తరలించడంపై రాజకీయ దుమారం చెలరేగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విదేశాంగ శాఖ కార్యదర్శి ఈ ప్రకటన చేయడం గమనార్హం. అమెరికా ప్రస్తుతం చేపట్టిన వలసదారుల తరలింపు ప్రక్రియ గతంలో కంటే భిన్నమైనదని మిస్రీ పేర్కొన్నారు. ఈ తరలింపును అమెరికా తన 'జాతీయ భద్రతా ఆపరేషన్'గా అభివర్ణించిందని తెలిపారు. అయితే భారతీయుల పట్ల దురుసుగా ప్రవర్తించరాదని అమెరికాకు స్పష్టం చేసినట్లు చెప్పారు. ఈ విషయంలో అమెరికా అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. మరింత మంది అక్రమ వలసదారులతో కూడిన విమానం త్వరలోనే భారత్‌కు రానుందని తెలిపారు.

లోకం తీరు



మే 4న నీట్-యూజీ పరీక్ష

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: దేశంలోని వైద్య విద్య కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-యూజీ పరీక్షను మే 4వ తేదీన నిర్వహించనున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రకటించింది. ఈ పరీక్ష కోసం శుక్రవారం నుంచి దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించింది. మార్చి 7వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుంది.

మార్చి 24 నుంచి సమ్మెకు బ్యాంకు యూనియన్ల పిలుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 : మార్చి 24 నుంచి రెండు రోజులపాటు దేశ వ్యాప్త సమ్మెకు బ్యాంకు యూనియన్లు పిలుపు ఇచ్చాయి. వారానికి ఐదు రోజుల పనిదినాలు, అన్ని కేడర్లలో తగినంత మంది ఉద్యోగుల నియామకం తదితర డిమాండ్ల సాధనకు ఈ నిర్ణయం తీసుకున్నాయి. 9 బ్యాంకు యూనియన్ల ఫోరమ్.. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) ఈమేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేసింది.

నిరాడంబరంగా అదానీ చిన్న కొడుకు పెళ్లి

- సేవా కార్యక్రమాలకు 10వేల కోట్లు విరాళం

అహ్మదాబాద్, ఫిబ్రవరి7: ప్రముఖ వ్యాపారవేత్త గౌతం అదానీ చిన్న కుమారుడు జీత్ అదానీ వివాహం నిరాడంబరంగా జరిగింది. సూరత్‌కు చెందిన ప్రముఖ వజ్రాల వ్యాపారి జైమిన్ షా కుమార్తె దివా షాను జీత్ వివాహమాడారు. అతి కొద్దిమంది బంధువులు, స్నేహితుల సమక్షంలో జైన, గుజరాతీ సంప్రదాయ పద్ధతుల్లో జరిగింది. కుమారుడి వివాహం సందర్భంగా గౌతం అదానీ పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రుల నిర్మాణం కోసం రూ. పది వేల కోట్లను విరాళంగా ప్రకటించారు.

13న ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ప్రధాని మోదీ అమెరికా, ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లనున్నారు. 4రోజుల పర్యటనలో భాగంగా ఈ నెల 10న పారిస్ చేరుకుంటారు. అక్కడ జరిగే కృత్రిమ మేధ సదస్సుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో కలిసి మోదీ అధ్యక్షత వహిస్తారు. అనంతరం కెడరాచీలోని అంతర్జాతీయ థర్మల్ న్యూక్లియర్ ఎక్స్‌పెరిమెంటల్ రియాక్టర్‌ను పరిశీలిస్తారు. 12న వాషింగ్టన్ డీసీకి వెళ్తారు. 13న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అవుతారు.

నివేదికలు ఎందుకు తారుమారు చేశారు?

- జీజీహెచ్ మాజీ అధికారి ప్రభావతిని ప్రశ్నించిన ఎస్పీ
- రఘురామ కేసులో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 వరకూ విచారణ

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు కస్టోడియల్ టార్చర్ కేసులో నివేదికలు ఎందుకు తారుమారు చేశారు? అలా చేయమని ఎవరైనా ఒత్తిడి చేశారా..' అని గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతిని విచారణాధికారి ఎస్పీ ఏఆర్‌దామోదర్ ప్రశ్నించారు. శుక్రవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ కేసులో నిందితురాలిగా ఉన్న ప్రభావతిని మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఏడు గంటల పాటు విచారించారు. రఘురామరాజును ఆస్పత్రికి తీసుకొచ్చినప్పుడు డాక్టర్లు కేర్ షీట్‌లో ఇచ్చిన నివేదికను ఎందుకు మార్చి రాశారని ప్రశ్నించగా 'నేను ఎందుకు మారుస్తాను' అని ఆమె సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. నివేదికల తారుమారు వెనుక మిమ్మల్ని ఎవరు ఒత్తిడి చేశారనే ప్రశ్నకు ఆమె నీళ్లు నమిలినట్లు సమాచారం. జీజీహెచ్‌లో సీనియర్ డాక్టర్లు ఉండగా జూనియర్లతో వైద్య పరీక్షలు ఎందుకు చేయించారన్న ప్రశ్నకు కూడా ఆమె నుంచి సమాధానం లేదని తెలిసింది. ఈ కేసులో ఇంకా సమగ్ర విచారణ చేయాలని, మరొకసారి రావాల్సి ఉంటుందని ఎస్పీ చెప్పినట్టు తెలిసింది. అనంతరం డాక్టర్ ప్రభావతిని పంపేశారు.

42 కోట్ల మంది



- ఇప్పటి వరకు కుంభమేళాలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు
- మహా కుంభ్‌నగర్‌లో మరో అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. దేశ విదేశాల్లోని భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలి వస్తున్నారు. శుక్రవారం నాటికి త్రివేణి సంగమంలో 42 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ సంఖ్య అమెరికా, కెనడా దేశాల్లోని ప్రజల కంటే ఎక్కువ కావడం విశేషం. గతనెల 13న ప్రారంభమై ఈనెల 26తో ముగిసే ఈ మహా ఉత్సవంలో పుణ్యం స్నానం చేసే వారి సంఖ్య 50 కోట్లు దాటుతుందని కేంద్ర సమాచార ప్రసార శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. మకర సంక్రాంతి, మౌని అమావాస్య, వసంత పంచమి వంటి మూడు అమృత స్నానాలు పూర్తయినా భక్తుల తాకిడి తగ్గలేదు. మౌని అమావాస్య రోజున 8 కోట్ల మందికిపైగా, మకర సంక్రాంతి రోజున 3.5 కోట్ల మంది, జనవరి 30, ఫిబ్రవరి 1న 2 కోట్ల మందికి పైగా, పౌష్య పౌర్ణమికి 1.7 కోట్ల మంది, వసంత పంచమి నాడు 2.5 కోట్ల మంది పుణ్య స్నానాలు ఆచరించారు. ఇప్పటి వరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితర ప్రముఖులు ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈనెల 10న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఇక్కడికి రానున్నారు. బిహార్ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ శుక్రవారం సంగమంలో పవిత్ర స్నానాలు చేశారు.

నటనకు ఇషికా గుడ్‌బై

సనాతన ధర్మం పాటించడం కోసం ఇకపై నటనకు గుడ్‌బై చెబుతున్నట్లు బాలీవుడ్ బ్యూటీ ఇషికా తనేజా తెలిపారు. సనాతన ధర్మం పాటించే క్రమంలో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. గతనెల 29న మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో గురు దీక్ష తర్వాత ఆమె మహా కుంభమేళాలో పుణ్య స్నానం ఆచరించారు. ఆధ్యాత్మిక సేవకు తాను అనుసంధానం అయ్యానని, మహా కుంభమేళాలో దివ్యమైన శక్తి ఉందన్నారు. 2017లో వచ్చిన ఇందు సర్కార్ సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ఉమన్ అచీవర్‌గా 2016లో రాష్ట్రపతి అవార్డు అందుకున్నారు. 2018లో మిస్ వరల్డ్ టూరిజం టైటిల్ గెలుచుకున్నారు. విక్రమ్ భట్ వెబ్ సిరీస్ హద్‌లో కీలక పాత్ర పోషించారు. 60 నిమిషాల్లో 60 మంది మోడళ్లకు 60 ఎయిర్‌బ్రష్ మేకప్‌తో గిన్నిస్ బుక్ రికార్డు సాధించారు. నటనకు గుడ్‌బై చెప్పినా.. భవిష్యత్‌లో నిర్మాతగా మారతానని ఇషికా తెలిపారు.

ఇస్కాన్ క్యాంప్‌లో అగ్ని ప్రమాదం

మహా కుంభ్‌నగర్‌లోని ఇస్కాన్ క్యాంప్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదం కలకలం రేపింది. సెక్టార్ 18లోని ఇస్కాన్ క్యాంప్‌లో మొదలైన అగ్నికీలలు పరిసరాల్లోని మరో 12 క్యాంపులకు కూడా వ్యాపించాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. కానీ ఆ క్యాంపులకు పెద్దఎత్తున నష్టం కలిగింది. మంటలు మొదలైన వెంటనే అగ్నిమాపక సిబ్బంది స్పందించి వాటిని ఆపేశారని చీఫ్ ఫైర్ ఆఫీసర్ ప్రమోద్ శర్మ తెలిపారు. మహా కుంభమేళాలో ఇది మూడో అగ్ని ప్రమాదం. గత నెల 19, 25 తేదీల్లో అగ్నిప్రమాదాలు జరిగాయి. అయితే ఆ ప్రమాదాల్లో ఎవరూ గాయపడలేదు.

130 కి.మీ. వేగంతో దూసుకుపోనున్న రైళ్లు

- విజయవాడ డివిజన్ మెయిన్ లైన్లలో ట్రాక్ అప్‌గ్రేడ్

విజయవాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ఇకపై రైళ్లు రయ్..య్.. మంటూ దూసుకుపోనున్నాయి. ఎందుకంటే విజయవాడ రైల్వే డివిజన్ అంతటా గంటకు 130 కిలోమీటర్ల వేగంతో అన్ని రైళ్లు ప్రయాణించేలా ట్రాక్‌ను అప్‌గ్రేడ్ చేశారు. ఈ డివిజన్ పరిధిలో 1,287.76 మేర ట్రాక్ కిలోమీటర్స్ (టీకేఎం)ను ఉన్నతీకరించారు. ఇప్పటి వరకు డివిజన్ పరిధిలో గరిష్ఠంగా 100 కిలోమీటర్లకు అనుమతించారు. వందేభారత్ రైళ్లకు మాత్రమే 130 కి.మీ. వేగంతో ప్రయాణించటానికి అవకాశం ఉంది. తాజాగా ట్రాక్ అప్‌డేట్‌తో అన్ని రైళ్లు.. ప్రధానంగా సూపర్‌ఫాస్ట్ రైళ్లు కూడా గంటకు 130 కిలోమీటర్లతో ప్రయాణించగలిగే సామర్థ్యాన్ని అందిపుచ్చుకోనున్నాయి. ఎక్స్‌ప్రెస్‌లు కూడా ఈ వేగంతో ప్రయాణించే అవకాశం ఉంది.

నేడే ఢిల్లీ ఫలితాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెల్లడికానున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ అధికారాన్ని నిలబెట్టుకోవడం ద్వారా నాలుగోసారి అధికారంలోకి రానుందా? కమలనాథులు 27 ఏళ్ల తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నారా? అనేది ఆసక్తికరంగా మారింది. కౌంటింగ్ కోసం 19 కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ఈనెల 5వ తేదీన పోలింగ్ జరగ్గా 60.54% ఓటింగ్ నమోదైంది. తమ పార్టీ దగ్గర దగ్గరగా 50 సీట్లు కైవసం చేసుకోవడం ద్వారా అధికారంలోకి వస్తుందని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర థీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పుతాయని, కేజ్రీవాల్ ఆధ్వర్యంలో మరోసారి తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆప్ చెబుతోంది. మరోవైపు.. ప్రతి అసెంబ్లీ స్థానంలో పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్ల జాబితాతో కూడిన ఫామ్ 17సీ డాటాను అధికారిక వెబ్‌సైట్లో పెట్టాలని తాము పదే పదే ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసినా తిరస్కరించిందని ఆప్ అధినేత కేజ్రీవాల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే పారదర్శకత కోసం ప్రతి బూత్‌లో పోలైన ఓట్ల వారీగా వివరాలను వెల్లడించేందుకు తమ పార్టీ తరఫున ప్రత్యేకంగా పోర్టల్‌ను ఏర్పాటు చేశామని ఎక్స్‌లో వెల్లడించారు. ఇక.. బీజేపీ నేతలు తమ పార్టీకి చెందిన 16మంది ఎమ్మెల్యేలను కమలదళంలోకి చేరాలని, ప్రలోభపెట్టారని ఇందుకు రూ.15 కోట్లు ఇవ్వజూపారని కేజ్రీవాల్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై బీజేపీ ఫిర్యాదు మేరకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ విచారణకు ఆదేశించారు. ఈమేరకు ఏసీబీ అధికారులు శుక్రవారం కేజ్రీవాల్‌కు నోటీసులు జారీచేశారు.

ఐదు నెలల్లో

39 లక్షల కొత్త ఓటర్లా?

మహారాష్ట్రలో లోక్‌సభ, అసెంబ్లీ ఓటర్ల జాబితాలను బయటపెట్టాలి: రాహుల్



న్యూఢిల్లీ/ముంబై, ఫిబ్రవరి 7: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపించారు. ఆ రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు జరిగిన తర్వాత ఐదు నెలల స్వల్పకాలంలోనే ఏకంగా 39 లక్షల మంది కొత్త ఓటర్లు చేరారని.. ఇదెక్కడి వైపరీత్యమని ప్రశ్నించారు. భారీ సంఖ్యలో నకిలీ ఓటర్లను సృష్టించారని ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల ఓటర్ల జాబితా, అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితాలను కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) బయటపెట్టాలని డిమాండ్ చేశారు. గత ఏడాది మహారాష్ట్ర లోక్‌సభ ఎన్నికల్లో 48 స్థానాలకు గాను కాంగ్రెస్-ఉద్ధవ్ శివసేన-పవార్ ఎన్సీపీలతో కూడిన మహా వికాస్ అఘాడీ 30 స్థానాలు గెలుచుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో 288 స్థానాలకు గాను ఈ మూడు పార్టీలూ 46 సీట్లు మాత్రమే పొంది ఘోరంగా ఓడిపోయాయి. నాడు 17 లోక్‌సభ సీట్లే సాధించిన బీజేపీ-శిందే శివసేన-అజిత్ ఎన్సీపీలతో కూడిన మహాయుతి.. ఐదు నెలలకే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 235 సీట్లు గెలుపొందడం గమనార్హం. శనివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన మహారాష్ట్ర ఎన్నికలపై స్పందించారు. '2019 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల నడుమ ఐదేళ్లలో 32 లక్షల మంది ఓటర్లు అదనంగా ఓటర్లు చేరితే.. ఇప్పుడు ఐదు నెలల్లోనే ఏకంగా 39 లక్షల మంది వచ్చిచేరారు. వీరంతా ఎవరనేది ప్రశ్న. రెండోది.. మహారాష్ట్రలో ఓటింగ్‌కు అర్హత ఉన్న జనాభా కంటే ఎక్కువగా ఓటర్లు ఎలా ఉన్నారు' అని ప్రశ్నించారు. రాహుల్ ఆరోపణలను మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ ఖండించారు. రాహుల్ అబద్ధాల్లో బతుకున్నారని ధ్వజమెత్తారు. ఆయన ప్రశ్నలకు ఈసీ గతంలోనే జవాబులిచ్చిందన్నారు. 'శనివారం ఢిల్లీ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో రాహుల్‌కు తెలుసు. ఫలితాల తర్వాత ఏం మాట్లాడాలో.. ఏం సాకులు వెతుక్కోవాలో ఇప్పుడాయన ప్రాక్టీసు చేస్తున్నారు. అసత్యాలతో తనను తాను ఓదార్చుకుంటే.. కాంగ్రెస్ పునరుజ్జీవం జరగదు' అని ఎద్దేవా చేశారు. ఇంకోవైపు.. రాహుల్ పేరు ప్రస్తావించకుండా.. వచ్చిన ఆరోపణలపై పూర్తి వాస్తవాలతో స్పందిస్తామని ఈసీ ప్రకటించింది.

దక్షిణ కోస్తా రైల్వే జోన్

ఇక అధికారికం


(మొదటి పేజీ తరువాయి)

చేసిన వాగ్దానాన్ని నెరవేర్చినట్లయిందన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పడినందున తూర్పు కోస్తా రైల్వే జోన్‌లో రాయగడ రైల్వే డివిజన్ పేరుతో కొత్త డివిజన్ ఏర్పడుతుందని.. అదేవిధంగా వాల్తేరు డివిజన్‌ను విశాఖపట్నం రైల్వే డివిజన్‌గా పరిగణిస్తారని చెప్పారు. దక్షిణ కోస్తా జోన్‌ను ప్రధాని ఇటీవల విశాఖ పర్యటన సందర్భంగా ప్రకటించారని గుర్తు చేశారు. తదనుగుణంగానే కేబినెట్ ఇప్పుడు లాంఛనంగా ఆమోదించిందన్నారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏర్పాటు చేస్తున్న కొత్త రైల్వే జోన్ వల్ల పెద్దఎత్తున మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. రైల్వే ఆపరేషన్ల సామర్థ్యమూ పెరుగుతుందని మంత్రి చెప్పారు.

- ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఐటీ చట్టం స్థానంలో తేనున్న కొత్త ఇన్‌కం ట్యాక్స్ బిల్లుకు ఆమోదం. ప్రత్యక్ష పన్నుల చట్టాన్ని సరళతరం చేసేందుకే దీన్ని రూపొందించారు. వచ్చేవారంలో ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. అనంతరం దాన్ని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి పంపుతారు.
- 2022-23 నుంచి 2025-26 వరకూ రూ.8,800 కోట్ల వ్యయంతో 'స్కిల్ ఇండియా' కార్యక్రమాన్ని పునర్వ్యవస్థీకరించి 2026 దాకా కొనసాగించాలన్న ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్. కాగా.. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) 4.0, ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్(పీఎం-న్యాప్స్), జనశిక్షణ్ సంస్థాన్ స్కీమ్(జేఎస్ఎస్)లను 'స్కిల్ ఇండియా ప్రోగ్రాం' పరిధిలోకి తీసుకొచ్చినట్టు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.
- జాతీయ పారిశుధ్య కార్మికుల కమిషన్ కాలపరిమితిని 31.03.2025 నుంచి 31.03.2028 వరకూ పొడిగించాలన్న ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

మా జోలికి వస్తే ఊరుకోం..


- ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టుపై అమెరికా ఆంక్షలు
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై వారెంట్ జారీతో ట్రంప్ ఆగ్రహం




వాషింగ్టన్, ఫిబ్రవరి 7: అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెలరేగిపోతున్నారు. తమకు అత్యంత సన్నిహితమైన మిత్రదేశం ఇజ్రాయెల్ విషయంలో ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు(ఐసీసీ)కే షాకిచ్చారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై అరెస్టు వారెంట్ జారీ చేసినందుకు ఐసీసీపై ఆంక్షలు విధిస్తూ గురువారం కార్యనిర్వాహక ఉత్తర్వులు(ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్) జారీ చేశారు. ఐసీసీ హద్దులు మీరీ తమ ఆంక్షలను అతిక్రమిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ట్రంప్ తన ఉత్తర్వుల్లో హెచ్చరించారు. ఐసీసీ ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని, ఐసీసీ అధికారులు, ఉద్యోగులు, వారి బంధువులను అమెరికాలో అడుగుపెట్టనివ్వమని స్పష్టం చేశారు. నెతన్యాహు అమెరికాలో పర్యటిస్తున్న వేళ ఈ ఉత్తర్వులు రావడం గమనార్హం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో వైట్‌హౌస్‌లో మంగళవారం భేటీ అయిన నెతన్యాహు.. క్యాపిటల్ హిల్‌లో గురువారం పలువురు చట్టసభ సభ్యులతో సమావేశమయ్యారు. 2023 అక్టోబరులో ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడికి ప్రతిగా.. పాలస్తీనాలో ఇజ్రాయెల్ చేపట్టిన సైనిక చర్య వల్ల వేల మంది పాలస్తీనా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇందుకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, ఆ దేశ మాజీ రక్షణ మంత్రి యొవ్ గెలంత్‌పై ఐసీసీ గత ఏడాది అరెస్టు వారెంట్లు జారీ చేసింది. నెదర్లాండ్స్‌లోని హేగ్‌లో ఉన్న ఐసీసీలో 125 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ మాత్రం ఐసీసీలో లేవు. దీంతో ఐసీసీ తన పరిధి దాటి అమెరికా, దాని మిత్రదేశమైన ఇజ్రాయెల్‌పై నిరాధార ఆరోపణలతో చర్యలకు ఉపక్రమించిందని ట్రంప్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, అమెరికా తమపై ఆంక్షలు విధించడాన్ని ఐసీసీ శుక్రవారం తీవ్రంగా ఖండించింది. ఇలాంటి ఆంక్షలు ఎన్ని ఎదురైనా ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల రక్షణకు ఐసీసీ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది. మానవహక్కుల పరిరక్షణ కోసం సభ్య దేశాలన్నీ ఐసీసీకి అండగా నిలబడాలని పిలుపునిచ్చింది.

చంద్రుడిపై పది నిమిషాల

విధ్వంసం!





చంద్రుడిపై ఏర్పడిన లోయ

న్యూయార్క్, ఫిబ్రవరి 7: గ్రాండ్ కాన్యన్.. అమెరికాలోని అరిజోనాలో కొలరాడో నది కొన్ని మిలియన్ల సంవత్సరాలపాటు కొండలను రాసుకుంటూ ప్రవహించడం వల్ల సహజసిద్ధంగా ఏర్పడ్డ అతి పెద్ద లోయ! 6093 అడుగుల లోతు.. 446 కిలోమీటర్ల పొడుగు.. 29 కిలోమీటర్ల వెడల్పుతో అచ్చెరువొందించే ఆ ప్రకృతి అద్భుతాన్ని చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచీ ఏటా లక్షలాది మంది పర్యాటకులు అక్కడికి వెళ్తుంటారు! అలాంటి అతిపెద్ద లోయలు చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో రెండున్నాయి. వాటి పేర్లు.. వ్యాలిస్ ష్రోడింగర్, వ్యాలిస్ ప్లాంక్. వీటిలో వ్యాలిస్ ష్రోడింగర్ దాదాపు 2.7 కిలోమీటర్ల లోతుతో.. ఇంచుమించుగా 270 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. వ్యాలిస్ ప్లాంక్ పొడుగు కూడా దాదాపు 270 కిలోమీటర్లేగానీ.. లోతు ఏకంగా 3.5 కిలోమీటర్లు ఉంటుంది. అయితే అవి మన గ్రాండ్ కాన్యన్ లోయలా సహజసిద్ధంగా కొన్ని మిలియన్ సంవత్సరాలపాటు నీటి రాపిడి వల్ల ఏర్పడ్డవి కావని.. 380 కోట్ల సంవత్సరాల క్రితం గ్రహశకలం తాకిడి కారణంగా కేవలం పది నిమిషాల్లో ఏర్పడ్డాయని అంతర్జాతీయ శాస్త్రజ్ఞుల బృందం తాజా అధ్యయనంలో వెల్లడైంది. నాసాకు చెందిన లూనార్ రికన్నైజాన్స్ ఆర్బిటర్ ఆ ప్రాంతంలో తీసిన ఛాయాచిత్రాలు, ఇతరత్రా డేటాను విశ్లేషించి వారు ఈ అంచనాకు వచ్చారు. అప్పట్లో ఆ గ్రహశకలం గంటకు 3600 కిలోమీటర్ల వేగంతో వచ్చి ఢీకొన్నప్పుడు ఉత్పన్నమైన శక్తి.. అమెరికా, సోవియెట్ యూనియన్, చైనా దేశాలు ఇప్పటిదాకా చేపట్టిన అణు పరీక్షలన్నింటివల్ల ఉద్భవించిన శక్తి కన్నా 700 రెట్లు ఎక్కువని.. అందుకే 10 నిమిషాల వ్యవధిలో ఈ లోయలు చందమామపై ఏర్పడ్డాయని శాస్త్రజ్ఞులు వివరించారు.

అట్టహాసంగా 'ఆలపాటి' నామినేషన్

» తరలివచ్చిన కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీల శ్రేణులు

» జనసంద్రంగా మారిన గుంటూరు నగరం

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల శాసనమండలి స్థానానికి ఎన్డీఏ కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ నామినేషన్ ప్రక్రియ శుక్రవారం అట్టహాసంగా జరిగింది. కూటమి పార్టీల తరఫున తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు, బీజేపీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చి భారీ ప్రదర్శనగా ఆలపాటిని గుంటూరు కలెక్టరేట్‌కు ఊరేగింపుగా తోడ్కొని వెళ్లారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, రాష్ట్ర శాసన సభ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, కామినేని శ్రీనివాస రావు, తెనాలి శ్రావణ్‌కుమార్, గల్లా మాధవి, మొహమ్మద్ నసీర్, జూలకంటి బ్రహ్మారెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు, బాష్యం ప్రవీణ్, అరవిందబాబు, ఎమ్మెల్సీలు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు ఆలపాటికి తోడుగా ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ కూటమి పిలుపులో భాగంగా జనసేన ఆలపాటికి అన్ని విధాలా అండగా నిలుస్తుందని చెప్పారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ బీజేపీ శ్రేణులు ఆలపాటి గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తాయన్నారు. ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ధర్మం ప్రకారం తెనాలి సీటును ఆలపాటి త్యాగం చేశారని గుర్తు చేశారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా పట్టభద్రులు ఇచ్చే గెలుపుతో తాను మండలిలో తన గళం వినిపిస్తానని చెప్పారు. ప్రభుత్వానికి- పట్టభద్రులకు మధ్య వారధిగా నిలిచి వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, కామినేని శ్రీనివాస్.

చిన్నారి చిన్నపేగులో పిన్నీస్

ఎండోస్కోపి ద్వారా తొలగించిన వైద్యులు



కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల చిన్నారి పొరపాటున పిన్నీస్ మింగింది. అది చిన్న పేగులో ఇరుక్కుపోయింది. కర్నూలు నగరంలోని మెడికవర్ ఆస్పత్రి గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ పి.అబ్దుల్ సమద్, అనస్థీషియాలజిస్టు డాక్టర్ బాలప్రవీణ్ నేతృత్వంలోని వైద్యబృందం ఎండోస్కోపి విధానం ద్వారా చిన్నారి చిన్నపేగులో ఉన్న పిన్నీస్‌ను విజయవంతంగా బయటకు తీసింది.

శ్రీవారిసేవలో సీఎస్ విజయానంద్



సీఎస్‌కు శ్రీవారి ప్రసాదం అందజేస్తున్న ఈవో

తిరుమల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలో జరిగిన అభిషేక సేవలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. శ్రీవారి చిత్రపటం, లడ్డూప్రసాదాలు, డైరీ, క్యాలెండరును టీటీడీ ఈవో శ్యామలరావు అందజేశారు.

మదనపల్లెకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి, హైకోర్టు సీజే

మదనపల్లె, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకటనారాయణభట్ అన్నమయ్య జిల్లా మదనపల్లెకు శుక్రవారం సాయంత్రం చేరుకున్నారు. అలాగే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌కు చేరుకున్నారు. మదనపల్లెలో శనివారం కోర్టు భవనాల సముదాయంపైన మొదటి అంతస్తులో నిర్మించిన నూతన భవనాన్ని వీరు ప్రారంభించనున్నారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నాలుగు నామినేషన్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి శుక్రవారం నలుగురు నామినేషన్లు దాఖలు చేశారు. పీఆర్‌టీయూ, ఎస్టీయూల మద్దతుతో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు నామినేషన్ సమర్పించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద నుంచి భారీ ఊరేగింపుతో కలెక్టరేట్‌కు చేరుకున్నారు. పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర అధ్యక్షులు బి.కృష్ణయ్య, జి.ఉదయరాజ్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ అధ్యక్షుడు గోపినాథ్‌లు ర్యాలీలో పాల్గొన్నారు. ఇంకా రాయల సత్యనారాయణ, నూకల సూర్యప్రకాష్, పోతల దుర్గారావు తమ మద్దతుదారులతో కలెక్టరేట్‌కు వచ్చి రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి ఎందుకు పారిపోయారు

ప్రజలను రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్న జగన్.. ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ జీవీ రెడ్డి

మాచర్లటౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న శాసన మండలి ఎన్నికల బరి నుంచి వైసీపీ ఎందుకు తప్పుకుందో సమాధానం చెప్పాలని ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ జీవీ రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా గుంటూరు జిల్లా మాచర్ల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం వైసీపీ ఈవీఎంలపై ఆరోపణలు చేసిందని, ఇప్పుడు శాసనసమండలి ఎన్నికలు బ్యాలెట్ పేపర్లో జరుగుతాయని, కనుక వైసీపీ తాను చేసిన ఆరోపణలు నిరూపించుకునేందుకు ఇది చక్కటి అవకాశం కదా అని అన్నారు. కానీ, ఇప్పుడు ఎన్నికల బరి నుంచి తప్పుకోవడంతో వారు చేసిన ఆరోపణలు నిరాధారమైనవిగా రుజువైందని చెప్పారు. రాష్ట్రాన్ని జగన్ ఆర్థికంగా పాతాళానికి తొక్కేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం 9 నెలల కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని ఆర్థిక సమస్యల దృష్ట్యా ఇచ్చిన హామీలు అమలులో కాస్త ఆలస్యం కావొచ్చు గానీ అమలు చేయబోమని చెప్పడం లేదని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని ఏదో తెలియని గందరగోళంలో ప్రజలు బతికారని, నేడు సగర్వంగా రాష్ట్ర నడిబొడ్డున ఉన్న అమరావతి రాజధాని అని ప్రజలు తలెత్తుకు తిరిగేలా చేశామని చెప్పారు. రాష్ట్రంలో ప్రాంతాల వారీగా రెచ్చగొట్టేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని జీవీ రెడ్డి ఆరోపించారు. కూటమి నేతల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకోవాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న జీవీరెడ్డి



మాజీ సీఎం జగన్ ఇంటి సమీపంలో తగలబడిన ప్రాంతం వద్ద ఆధారాలు సేకరిస్తున్న ఫోరెన్సిక్ బృందం

జగన్ ఇంటి వద్ద

క్లూస్ టీమ్ పరిశీలన

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని మాజీ సీఎం జగన్ ఇంటి ఎదుట ఎండిన గ్రీనరీ తగలబడిన ప్రాంతాన్ని శుక్రవారం ఫోరెన్సిక్ ప్రత్యేక బృందం, జిల్లా క్లూస్ టీమ్ సభ్యులు పరిశీలించారు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గ్రీనరీ తగలబడిన విషయం విదితమే. కాగా, వైసీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నారాయణమూర్తి ఫిర్యాదు మేరకు జరిగిన ఘటనపై తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు కేసు నమోదు చేశారు. ఘటనా ప్రాంతాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ రవికుమార్, నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ పరిశీలించారు. ఫోరెన్సిక్, క్లూస్ టీమ్ సిబ్బంది ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించి, ల్యాబ్‌కు పంపించారు.

అమెరికా తీరు అమానుషం: తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అమెరికాలో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నారన్న సాకుతో 104 మంది భారతీయులను తిరిగి భారత్‌కు పంపడంలో అమెరికా అధికారులు వ్యవహరించిన తీరు గర్హనీయం, అమానుషమని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ చేతులకు సంకెళ్లు వేసి, కాళ్లకు గొలుసులు కట్టి సైనిక రవాణా విమానంలో అమృత్‌సర్ విమానాశ్రయంలో 5వ తేదీన వదిలి వెళ్లారన్నారు. మెక్సికో ప్రభుత్వం తమ విమానాలు పంపి తమ వారిని గౌరవప్రదంగా తీసుకొచ్చిందని, కానీ, ఆ విధంగా మన దేశం చేయకపోగా.. కనీసం నిరసన కూడా తెలపకపోవడం ఆక్షేపణీయమని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రంప్ ఎత్తుగడ

ఆ మురికివాడలన్నింటినీ నేలమట్టం చేసి, పేదజనాలను తరిమికొట్టి అక్కడ ఒక మహాద్భుతమైన బీచ్ రిసార్ట్ కడతానంటున్నారు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్. అచ్చంగా ఇవే మాటలు కాకున్నా, గాజా గురించి ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారి అంతిమంగా చెప్పింది ఇదే. గాజా నుంచి పాలస్తీనియన్లను ఖాళీచేయించడం, పొరుగు దేశాల్లో శాశ్వతంగా స్థిరపరచడం, హమాస్–ఇజ్రాయెల్ యుద్ధం వల్ల శరణార్థులుగా మారి పొరుగు దేశాలకు పోయినవారిని ఇక వెనక్కురానివ్వకపోవడం వంటివి అయన మెదడులో పుట్టిన అద్భుతమైన ఆలోచన. పాలస్తీనియన్లను తరమడానికి అవసరమైతే అమెరికా సైన్యాన్ని కూడా వాడతానని ట్రంప్ ముందే చెప్పారు కనుక, గాజాను అలా స్వచ్ఛందంగా ఖాళీచేసిపోయాక, వారి జన్మభూమిని ఏ విధంగా అమెరికా వశం చేయాలో ఇజ్రాయెల్ ప్రధాని చూసుకుంటారు. మందుపాతరలతో, మారణాయుధాలతో, మాంసపు ఖండాలతో నిండివున్న ఆ రుధిరక్షేత్రాన్ని శుభ్రం చేయించి దానిని ఓ అద్భుతమైన బీచ్ రిసార్టుగా అమెరికా తీర్చిదిద్దుతుంది. అది కేవలం విందువినోదాలను మాత్రమే పంచుతుందని సామాన్యజనం భ్రమపడతారని ట్రంప్‌కు తెలుసు. కాబట్టి, ఉపాధి అవకాశాలు పెంచుతుందని కూడా ఆయన గుర్తుచేశారు. ఇతరులతో పాటుగా అక్కడ పాలస్తీనా పేదలు, నిర్భాగ్యులు కూడా పనిచేసుకోవచ్చునని ఆయన దయగల మనసు అనుమతించింది.

అరవైవేల మృతదేహాలమీద అద్భుతమైన రిసార్టు నిర్మిస్తామని, ఊచకోత కోసిన చోట రియల్ ఎస్టేట్, టూరిస్ట్ వ్యాపారం చేసుకుంటామని ఒక దేశాధినేత చెప్పడం ఇదే ప్రథమం కావచ్చు. అందుకే ఇంతటి పాడు ప్రపంచం కూడా అంతగా నివ్వెరపోయింది, ఆగ్రహంగానూ ప్రతిస్పందించింది. అనంతరం శ్వేతసౌధం ట్రంప్ వ్యాఖ్యలకు కొత్తభాష్యాలు చెప్పింది. స్వపక్షం కూడా కస్సుమంటున్నందున ఒక్క అమెరికన్ సైనికుడు కూడా అక్కడ అడుగుపెట్టకుండానే స్వకార్యాన్ని చక్కబెట్టుకోవాలని ట్రంప్ నిర్ణయించుకున్నారు. తన సమక్షంలో ట్రంప్ అంత చక్కగా భవిష్యత్‌ను విప్పిచెప్పిన తరువాత ఇజ్రాయెల్ ప్రధానికి మాత్రం ఆనందం కలగకుండా ఎందుకు ఉంటుంది? హమాస్ ఏలుబడిలో ఉన్న గాజా దుంపనాశనమై, అక్కడో అద్భుతమైన బీచ్‌రిసార్టు వస్తే ఇజ్రాయెల్‌కు అంతకంటే భద్రత ఏముంటుంది? ఆయన వెంటనే సినిమా ఫక్కీలో మంచి ఆఫర్ ఇది అని తేల్చేశారు. అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తరువాత, ఆయనతో భేటీ అయిన తొలివిదేశీ నేత నెతన్యాహూ. పదిహేను నెలల గాజాయుద్ధంలో చావులూ నష్టాలూ కష్టాలూ ఒప్పందాల వరకూ లోతుపాతులన్నీ చర్చించుకోకుండానే వీరిద్దరూ మీడియాముందు ఈ విన్యాసం చేయరన్నది నిజం. ట్రంప్ తన ప్రణాళిక విప్పగానే, చరిత్రగతినే మార్చేటంతటి మహాద్భుతమైన ఆలోచన అని కీర్తించారు నెతన్యాహూ. తక్షణ అమలుకోసం అమెరికా నుంచే తన దేశానికి ఆదేశాలు జారీ చేశారు. అమెరికా తన సైనికులను పంపబోవడం లేదు కనుక, మీరే పాలస్తీనియన్లను గాజానుంచి వెళ్ళగొట్టండి అని ఇజ్రాయెల్ రక్షణమంత్రి తన సైన్యాన్ని ఆదేశించారు.

ట్రంప్ ప్రతిపాదనను చాలా దేశాలు ఖండించాయి. ఈజిప్ట్, జోర్డన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ ఇత్యాది దేశాలు ఆగ్రహంగా స్పందించాయి. అంతర్జాతీయ వేదికలు కఠినమైన మాటల్లో తప్పుబట్టాయి. ధ్వంసమైన గాజాను అందంగా తీర్చిదిద్దుతానని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో, అమెరికా–ఇజ్రాయెల్ తమ మారణాయుధాలతో కలిసికట్టుగా సర్వనాశనం చేయడానికి ముందు అది ఎంత మనోహరంగా ఉండేదో తెలియచెబుతున్న చిత్రాలు తిరిగి ప్రచారంలోకి వచ్చాయి. టూరిజం మక్కా, ఉద్యోగాల మక్కా అంటూ ఆయన విసురుతున్న వలలో పాలస్తీనియన్లు చిక్కరన్నది వాస్తవం. కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉండగా, ఇజ్రాయెలీ బందీలను హమాస్ సవ్యంగా అప్పగిస్తున్న తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసి కొత్త చిచ్చురేపారు. నెతన్యాహూ మళ్ళీ రణనినాదాలు చేస్తున్నారు. అమెరికా రాయబారకార్యాలయాన్ని టెల్ అవీవ్‌నుంచి జెరూసలేంకు మార్చడం, ఆక్రమించుకున్న ప్రాంతాలతో కలిపి ఇజ్రాయెల్ సార్వభౌమత్వాన్ని గుర్తించడం వంటివి ట్రంప్ తన తొలి హయాంలో చేశారు. ఇప్పుడు పాలస్తీనియన్ల భూభాగంలో కొంత తానే ఆక్రమించుకొని, 18లక్షల మందిని ఇతరదేశాలకు తరిమికొట్టి పాలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కారం పేరిట కొత్త కుట్రలకు తెరదీస్తున్నారు.

ఆర్థిక సర్వే అరణ్య రోదన

నాకు గుర్తు ఉన్నంతవరకు, రాజకీయ లక్ష్యాలతో రూపొందిన నిర్మలా సీతారామన్ 8వ బడ్జెట్ లాంటిది మరొకటి మరెన్నడూ లేదు. ఆర్థిక వ్యవస్థను సంస్కరణలతో పునర్వ్యవస్థీకరించేందుకు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ఘోరంగా విఫలమైన బడ్జెట్ మరొకటి లేనేలేదని కచ్చితంగా చెప్పగలను. తదుపరి దశ ఆర్థిక సంస్కరణలకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారు. అయినా ప్రభుత్వం విఫలయింది. ప్రజలకు తీవ్ర ఆశాభంగం కలిగించింది.

2024లో పరిస్థితులు ఎలా ఉన్నాయో ఒకసారి సింహావలోకనం చేసుకోండి. భారతీయ జనతా పార్టీకి ప్రజలు వరుసగా మూడోసారి అధికారమిచ్చారు. అయితే ఒక హెచ్చరిక స్పష్టంగా చేశారు. మీకు తగినంత మంది ఎంపీలు ఉన్నారు. అయితే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన పూర్తి మెజారిటీ మీకు లేదు.



• పి. చిదంబరం

'పళని' పలుకు

రాజ్యాంగాన్ని మార్చివేసేందుకు మీరు ప్రయత్నించ కూడదు. ఏకాభిప్రాయ సాధనతో మీరు పరిపాలన చేయాలి. నిరుద్యోగిత, పేదరికం, అసమానతలు, ద్రవ్యోల్బణం, రైతుల దురవస్థ, మౌలిక సదుపాయాల కొరత మొదలైన సమస్యల పరిష్కారానికి మీరు శ్రద్ధ చూపాలి.

సరిగ్గా ఇటువంటి పరిస్థితులనే కాదూ 1991లో ప్రధాని పీవీ నరసింహారావు, ఆర్థిక మంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎదుర్కొన్నది? కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రధానమంత్రి ఆర్థికమంత్రి ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుని నవ పథనిర్దేశక ఆర్థిక సంస్కరణలు ప్రకటించారు. జూలై 1, 1991న ప్రారంభమైన ఆ సంస్కరణల తొలి దశ ఆగస్టు 15, 1991న ముగిసింది (రూపాయి విలువ తగ్గింపు, వాణిజ్య సంస్కరణలు, ద్రవ్య రంగ సంస్కరణలు, పన్నుల సంస్కరణలు, నూతన పారిశ్రామిక విధానం మొదలైనవి ఆ తొలి దశలో అమలయ్యాయి.

2024 సార్వత్రిక ఎన్నికల తరువాత జూలై 23, 2024న నరేంద్ర మోదీ–సీతారామన్ ప్రథమ బడ్జెట్‌ను ఎవరినీ ఉత్సాహపరచలేకపోయింది. ఆర్థికాభివృద్ధిని వేగిరపరిచే ప్రభావాన్ని చూపడంలో విఫలమయింది. పాలకులు అందుకు ఎన్నో సాకులు చూపారు. ఆ బడ్జెట్ సంవత్సరం ముగిసేలోగా ఆర్థిక వ్యవస్థ పురోగతి మందగించింది. వేతనాలు స్తంభించిపోయాయి. ద్రవ్యోల్బణం పెరిగిపోయింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గిపోయాయి విదేశీ కంపెనీలు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. వ్యాపార సంస్థలు, వ్యాపారవేత్తలు సింగపూర్, దుబాయి, అమెరికాకు వలస వెళ్లారు. 'ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రభుత్వం ఎందుకు పూనుకోవడం లేదు? తక్షణమే పటిష్ఠ చర్యలు చేపట్టాలని పాలకులను గట్టిగా కోరేదెవరు?' అనే ప్రశ్నలను ప్రతి ఒక్కరూ అడిగారు.

అదృష్టవశాత్తు ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) 'ఆర్థిక సర్వే–2024–25' ముసుగులో ఒక అర్థవంతమైన, కార్యసాధక సలహా ఇచ్చారు. 'ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలపై నియంత్రణలు ఎత్తివేయాలి' అన్నది ఆయన సలహా. సముచితమైన సలహా, సందేహం లేదు. ఆర్థిక సర్వేలో 13 అధ్యాయాలు ఉన్నాయి. సీఈఏ సలహాలు, సిఫారసులు ఏమిటి, వాటికి ప్రభుత్వ ప్రతిస్పందన (లేదా స్పందనా రాహిత్యం) ఏమిటో వివరించేందుకు నాలుగు అధ్యాయాల గురించి ప్రస్తావిస్తాను మొదటి అధ్యాయం (ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు)లో ఆర్థికాభివృద్ధి మందగతిలోకి జారిపోవడానికి కారణాలను నొక్కి చెప్పారు. పోటీ తత్వాన్ని మెరుగుపరిచేందుకు నియంత్రణలు ఎత్తివేయాలని, సంస్థాగత సంస్కరణలు అమలుపరచాలని సీఈఏ సిఫారసు చేశారు. ఆర్థికమంత్రి ఆ సిఫారసుకు పూర్తిగా విరుద్ధమైన చర్యలు చేట్టారు. ప్రస్తుతం అమలులో ఉన్న పథకాలకు మరిన్ని నిధులు కేటాయించారు. సరికొత్తగా 7 స్కీమ్‌లు, 8 మిషన్‌లు, 4 ఫండ్స్‌ను ప్రకటించారు! డీరెగ్యులేషన్‌కు నిర్దిష్ట ప్రతిపాదన ఏదీ లేదు. ఏ రంగంలోనూ పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు తోడ్పడే చర్యలు ఏవీ ప్రకటించలేదు.



సమస్యలు, సవాళ్లు ఉన్నాయి. ఒక ప్రభుత్వమూ ఉన్నది. అయితే పాలన లోపించింది!. ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు ఆర్థిక సర్వేలో వివేకవంతమైన సూచనలు చేశారు. తీసుకోవాల్సిన నిర్ణయాలు, చేపట్టవలసిన చర్యలు నిష్కర్షగా చెప్పారు. మరి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తన ఎనిమిదవ వార్షిక బడ్జెట్‌లో వాటికి సమంజసమైన రీతిలో ప్రతిస్పందించారా? లేదు.

ప్రస్తుతం దేశాన్ని పట్టి పీడిస్తున్న విషమ సమస్య నిరుద్యోగిత. ముఖ్యంగా పిల్లలు నిరుద్యోగులుగా ఉండిపోయిన కుటుంబాల వెతలు మాటల్లో చెప్పలేనివి. 12వ అధ్యాయం (ఉద్యోగిత, నైపుణ్యాల అభివృద్ధి)లో నిరుద్యోగిత రేటు 2023–24లో 3.2 శాతానికి తగ్గిపోయిందని పేర్కొన్నారు. ఈ నిర్ధయానికి రావడంలో 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్)పై ఆర్థిక సర్వే ఆధారపడింది. నిరుద్యోగిత రేటు అంత తక్కువగా ఉంటే దాన్ని పూర్తి ఉద్యోగితగా అర్థశాస్త్ర సిద్ధాంతాల్లో పరిగణిస్తారు. ఆ నిర్ధయంతో ఎదురయ్యే ప్రమాదాన్ని గుర్తించి కాబోలు 2030 సంవత్సరం దాకా వ్యవసాయేతర రంగాలలో ఏటా 78.5 లక్షల ఉద్యోగాలు సృష్టించవలసిన అవసరమున్నదని ఆర్థిక సర్వే పేర్కొంది. 2030 నాటికి పనిచేసే వయసులో ఉండే జనాభా 96 కోట్లకు పెరుగుతుందని అంచనా.

మరి పీఎల్ఎఫ్ఎస్, ఆర్థిక సర్వేలు వెల్లడించిన విషయాలతో ఆర్థికమంత్రి ఏకీభవిస్తారా? ఆమె మౌనం వహిస్తున్నారు. అంటే ఆ సర్వేలు వెల్లడించిన వాస్తవాలను ఆమె నిరాకరించడమే కాదూ? 'డి రెగ్యులేషన్ డ్రైవ్స్ గ్రోత్' అనే శీర్షికన ఒక అధ్యాయానికి అధ్యాయమే (5వ అధ్యాయం) ఉన్నది. ప్రస్తుత పెట్టుబడుల రేటు 31 శాతం కంటే తక్కువగా ఉన్నది. వృద్ధిరేటు 6.5 శాతం కంటే తక్కువగా ఉన్నది. ఈ మదుపుల రేటు, వృద్ధి రేటుతో స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి మనం అభివృద్ధి చెందుతున్న దేశంగా ఆవిర్భవించడం అసాధ్యమని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది.

సరే, 'మేక్ ఇన్ ఇండియా' గురించి ప్రభుత్వం నిర్విరామంగా ఘోషిస్తూనే ఉన్నది. అయినప్పటికీ మన తయారీరంగం పురోగతి గొర్రె తోక బెత్తెడేనన్న రీతిలో ఉన్నది. ఈ రంగం ఎంతకూ సుస్థిరంగా, శీఘ్రగతిన పురోగమించడంలేదు. ఏడవ అధ్యాయం 'ఇండస్ట్రీ : ఆల్ ఎబౌట్ బిజినెస్ రిఫార్మ్స్' కొన్ని చేదు వాస్తవాలను వెల్లడించింది. ప్రపంచ వస్తూత్పత్తిలో మన వాటా 2.8 శాతం మాత్రమే. మరి చైనా వాటా 28.8 శాతం. దీన్ని బట్టి తయారీరంగంలో మనం ఎంత వెనుకబడి ఉన్నాయో అర్థమవుతుంది. జీవీఏ (గ్రాస్ వాల్యూ యాడెడ్)లో మన తయారీరంగం వాటా 2011–12లో 17.4 శాతం నుంచి 2023–24లో 14.2 శాతానికి తగ్గిపోయింది. తయారీరంగానికి అవసరమైన సమస్త యంత్రాలనూ మనం దిగుమతి చేసుకుంటున్నాం. పరిశోధన అభివృద్ధి రంగంలో మనం చేస్తున్న వ్యయం స్థూల దేశీయోత్పత్తిలో 1 శాతం కంటే తక్కువ! ఈ అవరోధాలు అన్నిటినీ అధిగమించి ముందుకు పోవడానికి మార్గం నియంత్రణల ఎత్తివేత, పరిశోధన అభివృద్ధికి భారీ మొత్తంలో నిధులు సమకూర్చడం, నవకల్పనలను ఇతోధికంగా ప్రోత్సహించడం, కార్మిక శ్రేణుల నైపుణ్యాలను మెరుగుపరచడమేనని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. మరి ఆర్థిక సర్వేకు బడ్జెట్ ఎలా ప్రతిస్పందించింది? సరికొత్త పథకాలు, కార్యక్రమాలు ప్రారంభించింది! సమస్యలు, సవాళ్లు ఉన్నాయి. ఒక ప్రభుత్వమున్నది. అయితే పాలన లోపించింది! పాలన వర్తమానంలో జరగాల్సిన వ్యవహారం కదా! ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వివేకవంతమైన సూచనలు చేశారు. తీసుకోవాల్సిన నిర్ణయాలు, చేపట్టవలసిన చర్యలను నిష్కర్షగా చెప్పారు. మరి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తన ఎనిమిదవ వార్షిక బడ్జెట్‌లో వాటికి సమంజసమైన రీతిలో ప్రతిస్పందించారా? లేదు. ఆర్థిక సలహాదారు వివేకవాణి మరో అరణ్యరోదనే అయింది!


(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

చారిత్రక చీకటి వెలుగుల్లో లాహోర్

చాలా సంవత్సరాల క్రితం నా పరిశోధనా వ్యాసంగంలో, యాదృచ్ఛికంగా ఒక టెస్ట్ మ్యాచ్‌కు సంబంధించిన వార్తా కథనాలను చూడడం, చదవడం తటస్థించింది. 1955లో లాహోర్‌లో భారత్–పాకిస్థాన్‌ల మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్ అది. ఆ టెస్ట్ మ్యాచ్ జరిగిన సామాజిక సందర్భం చాలా ఆసక్తికరమైనది. తన బహుళ–సంస్కృతీమయ గతాన్ని పునర్దర్శించడానికి, ఆ స్ఫూర్తిదాయక చరిత్రను ఆవాహన చేసుకోవడానికి లాహోర్‌ను 1947 తరువాత ప్రప్రథమంగా అనుమతించిన సందర్భమది. టెస్ట్ మ్యాచ్‌ను చూసేందుకు వాఘా సరిహద్దుకు ఈవల ఉన్న అమృత్‌సర్ నుంచి రోజూ ఉదయం వచ్చి రాత్రికి తిరిగి వెళ్లిపోయే భారతీయ పౌరులకు పదివేల టిక్కెట్లు ప్రత్యేకంగా విక్రయించారు. 'దేశ విభజన అనంతరం భారత్ నుంచి పాకిస్థాన్‌కు జరిగిన అతిపెద్ద సామూహిక వలస' అని భారతీయ క్రికెట్ అభిమానుల వెల్లువను ప్రత్యక్ష సాక్షి ఒకరు అభివర్ణించారు.

29 జనవరి 1955న ఆ టెస్ట్ మ్యాచ్ ప్రారంభమయింది. మరుసటి రోజు 'డాన్'లో వెలువడిన ఒక వార్తా కథనం టిక్కెట్ల కొనుగోలుకు వాఘా ఆవల నుంచి వచ్చినవారు ఎలా బారులు తీరిందీ పేర్కొంది. 'స్టేడియం వద్ద కోలాహలం షాలిమార్ మేలాను జ్ఞప్తికి తెచ్చింది. కాకపోతే ఈ గుంపుల్లో ఉన్న వారందరూ కులీన వర్గాలకు చెందినవారు. భారతీయ సందర్శకులలో ముఖ్యంగా సిక్కులు అందరినీ ఆకర్షించారు. వారు ఎక్కడకు వెళ్లినా సాదర స్వాగతం లభించింది. పాకిస్థానీయులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. కొందరు అనుకోకుండా తమ పాత స్నేహితులను చూసినప్పుడు ఆనంద బాష్పాలు రాల్చారు' అని 'డాన్' వార్తా కథనం పేర్కొంది. ఈ వార్త రాసిన విలేఖరి లాహోర్‌లోని పాకిస్థానీ ముస్లిం అయి ఉంటాడనేది స్పష్టం. సరిగ్గా ఇటువంటి మనోభావాలనే సుదూర మద్రాసులోని హిందూ పాత్రికేయుడు ఒకరు వ్యక్తం చేశారు. 'ఈ టెస్ట్ మ్యాచ్ రోజుల్లో పాకిస్థానీయులు, భారతీయుల మధ్య సౌభ్రాతృత్వం వెల్లివిరిసింది' అని ఆ పాత్రికేయుడు రాశారు.

ఇటీవల ప్రచురితమైన మనాన్ అహ్మద్ అసిఫ్ పుస్తకం 'Disrupted City : Walking the Pathways of Memory and History in Lahore'ను చదువుతున్నప్పుడు ఎనభై ఏళ్లనాటి ఆ క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌కు సంబంధించిన వార్తాకథనాలు జ్ఞప్తికి వచ్చాయి. అసిఫ్ లాహోర్‌లో పెరిగాడు. ముప్పై ఏళ్ల క్రితం ఉన్నత విద్యాభ్యాసానికి విదేశాలకు వెళ్లిపోయాడు. తరచు కన్న ఊరుకు వస్తుంటాడు. లాహోర్ కథను పాకిస్థాన్‌కే పరిమితం చేయకుండా ఆ నగర విశాల చరిత్రను చెప్పడమే తన ధ్యేయమని అసిఫ్ తన పుస్తకంలో పేర్కొన్నాడు. నగరానికి సంబంధించి తన వ్యక్తిగత స్మృతులను పర్షియన్, ఉర్దూ, పంజాబీ, అరబిక్ భాషా గ్రంథాలలో విద్వత్ శోధనలతో మేళవించి ఆ పురాసవ నగర చరిత్రను అసిఫ్ వెలయించాడు. '1947కు పూర్వం లాహోర్ జన జీవనంలోని భిన్నత్వం, బహుళత్వం, హిందూ, సిక్కు మతస్థుల సామూహిక నిష్క్రమణ, ముస్లిం శరణార్థుల రాకతో అంతరించి పోయాయని' అసిఫ్ పేర్కొన్నాడు. 'దేశ విభజనతో సంభవించిన ఆ విచ్ఛిన్నంతో లాహోర్ తన సొంత గతం నుంచి బలవంతంగా బహిష్కృతమయింది' అని అసిఫ్ నిట్టూర్చాడు.



పాకిస్థాన్ చరిత్రకారుడు మనాన్ అహ్మద్ అసిఫ్ కొత్త పుస్తకం 'Disrupted City : Walking the Pathways of Memory and History in Lahore' లాహోర్ కథను పాకిస్థాన్‌కే పరిమితం చేయకుండా దేశ విభజనకు పూర్వం ఆ నగర విశిష్ట చరిత్రను విశాల దృక్పథంతో వివరించింది. వాఘా అవలే కాకుండా, ఈవల ఉన్న వారికి సైతం ఆ పుస్తకంలో విలువైన పాఠాలు ఉన్నాయి.

అసిఫ్ పుస్తకంలో క్రికెట్ గురించి సందర్భవశాత్తు ప్రస్తావనలు మినహా ఏమీలేదు. 1955 టెస్ట్ మ్యాచ్ గురించి అసలు ఏమీ లేదు. అయినప్పటికీ ఆ టెస్ట్ మ్యాచ్ జరిగిన రోజుల్లో క్రికెట్ అభిమానుల కోలాహలం గురించి ఆయన ఒక ఆసక్తికరమైన వ్యాఖ్య చేశారు. వారి సందడి షాలిమార్ మేలాను గుర్తుకు తెచ్చిందని ఆయన అభివర్ణించాడు. షాలిమార్ మేలా (మేలా చిరాఘన్‌గా కూడా సుప్రసిద్ధం) ఒకప్పుడు లాహోర్ నగర ప్రధాన పండుగలలో ముఖ్యమైనది. 16వ శతాబ్ది సూఫీ సాధువు షా హుస్సేన్ జీవితం, వారసత్వానికి సంబంధించిన ఉత్సవమది. అసిఫ్ ఇలా రాశాడు: 'ఆచారాలకు ప్రాధాన్యమిచ్చే వారిని ఆయన తీవ్రంగా విమర్శించేవాడు. మద్యపాన ప్రియుడు. మత్తు పదార్థాలను సేవించేవాడు. ఆనంద తాండవం చేసేవాడు, తరచు నగ్నంగా'. షా హుస్సేన్ సన్నిహితుడు, అంతరంగికుడు ఒక హిందూ యువకుడు. బహుశా అతడి లైంగిక భాగస్వామి కావచ్చు. ఆ ఇరువురిని ఖననం చేసిన స్థలం హిందువులు, ముస్లింలు, సిక్కులకు పుణ్య క్షేత్రం. ఏటా అక్కడ ఉత్సవాన్ని నిర్వహిస్తుంటారు. దేశ విభజన అనంతరం లాహోర్ జన జీవనంలో ఈ బహుళత్వం అంతరించింది. 1955లో టెస్ట్ మ్యాచ్‌ను చూడడానికి వచ్చిన జనసందోహాన్ని చూసి చాలా మంది ఆ సంప్రదాయ ఉత్సవాన్ని గుర్తుచేసుకున్నారు. లాహోర్ బహుళ స్త్రరిత, బహుళ మత, బహుళ భాషా గతాన్ని అర్థం చేసుకునేందుకు అసిఫ్ పుస్తకం మనకు విశేషంగా తోడ్పడుతుంది. షా హుస్సేన్ గురించే కాకుండా నర్తకి అనార్కలి, మార్మిక సాధువు గంజ్ బక్ష్, మహారాజా రంజిత్ సింగ్ మొదలైన నగర ప్రముఖుల చరిత్రనుకూడా క్లుప్తంగానే అయినప్పటికీ ఆసక్తికరంగా వివరించాడు. రుడ్యార్డ్ కిప్లింగ్‌ను సామ్రాజ్యవాది అని ఆక్షేపించాడు. అది నిజమేకాని కిప్లింగ్ తన 'కిమ్' నవలలో లాహోర్ నగర సామాన్యుల జీవితాలను ఎంతో సహానుభూతితో వర్ణించాడు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

లాహోర్ వాస్తుకళా వైభవాన్ని కూడా అసిఫ్ విపులంగా అభివర్ణించాడు సుప్రసిద్ధ చారిత్రక కట్టడాలనే కాకుండా అనామక మసీదుల గురించి కూడా చెప్పాడు. ఇప్పుడు మసీదులతో పాటు శిథిలమైన దేవాలయాలు, గురుద్వారాలు ఎన్నో కనిపిస్తుంటాయి. సుదూర గతంలో లాహోర్ దిగ్మండలంలో హిందూ, సిక్కు పూజా మందిరాలు ప్రముఖంగా కనిపించేవని ఆయన విపులంగా వివరించాడు. 1947కు పూర్వం లాహోర్ నగర ఆర్థిక జీవనంలో హిందువుల, సిక్కుల కీలక పాత్ర గురించి కూడా అసిఫ్ ప్రముఖంగా వర్ణించాడు. 1970లు, 1980లలో లాహోర్‌లో తన బాల్య, కౌమార దశల గురించి గూడా ఆయన రాశారు. రోజూ సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి తిరిగి వెళుతూ ఒక పాత భవనం ద్వార ఫలకంపై దేవనాగరి లిపిలో రాసి ఉన్న పదాలను చూస్తుండేవాడినని పేర్కొన్నాడు. తాను ఆ అక్షరాలను అలా చూసి ఇలా వెళ్లిపోతుండేవాడినని. ఎప్పుడూ ఆ భవనం ముందు అట్టే తచ్చాడలేదని అసిఫ్ గుర్తుచేసుకున్నాడు. ఆ దేవనాగరి లిపిలోని మాటలను చదవలేకపోయేవాడినని, ఆ లిపి నేర్చుకునే ప్రయత్నం కూడా తాను చేయలేదని అసిఫ్ తెలిపాడు. ఇంకా ఇలా వ్యాఖ్యానించాడు: 'దేవనాగరి లిపి హిందూ మతానికి సంబంధించినది అని నాకు తెలుసు. మా సాంఘికశాస్త్ర పాఠ్య పుస్తకాల ప్రకారం హిందువు అంటే ముస్లింను వెన్నుపోటు పొడవడానికి ప్రయత్నించేవాడు మరి'. ఈ వాక్యాలు చదువుతున్నప్పుడు హిందుత్వ వాదుల పాలనలో హిందూ బాలలు వక్రీకరించిన చరిత్రను చదువుతున్న విషయమై ఆలోచనా మగ్నుడినయ్యాను. ఉర్దూ పూర్తిగా ముస్లింల భాష అని దశాబ్దాలుగా తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఎంతో మంది గొప్ప గొప్ప హిందూ, సిక్కు రచయితలు ఉర్దూ భాషకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు సాధించినప్పటికీ ఆ భాష పూర్తిగా ముస్లింలదేనని ప్రచారం చేయడమేమిటి?

ఇండియా ప్రధానంగా 'హిందూ' దేశం అనే వివరణను, బీజేపీ ఆధ్వర్యంలోని ప్రభుత్వాలు నిర్దేశిస్తున్న చరిత్ర, సాంఘిక శాస్త్ర పాఠ్యగ్రంథాలు మరింతగా బలపరుస్తున్నాయి. ఈ మెజారిటీవాద ప్రపంచ దృక్పథాన్ని హిందుత్వ సామాజిక మాధ్యమ శ్రేణులు విపరీకరిస్తున్నాయి. సమస్త హిందువులు, ముస్లింలు అందరినీ ఎటువంటి మినహాయింపు లేకుండా అనుమానించాలని ఆ శ్రేణులు నిత్యం పదే పదే విజ్ఞప్తి చేస్తున్నాయి. ఒకప్పుడు ప్రజలు అందరూ ఎటువంటి తరతమ భేదాలు లేకుండా పాల్గొన్న మేలా చిరాఘన్, బసంత్ మొదలైన పండుగలు లాహోరీల ఉమ్మడి స్మృతిపథం నుంచి ఎలా బహిష్కృతమయిందీ అసిఫ్ పేర్కొన్నారు. సైనిక పాలకుడు జియా ఉల్ హఖ్ ప్రోత్సహించిన వహాబీ ఇస్లాం సిద్ధాంతాలకు ఆ వేడుకలు విరుద్ధమైనవి కావడంతో లాహోర్ నగర జీవితంలో వాటికి స్థానం లేకుండా పోయిందని అసిఫ్ వివరించారు.

1980ల నాటి నుంచీ పాకిస్థాన్‌లో 'సంతోషం, సద్యోజనిత ప్రేరణలు, సాముదాయికతను అనుమానాస్పద కార్యకలాపాలుగా శంకించడం ఆరంభమయింది. అదే సమయంలో న్యాయమైన, ధర్మబద్ధమైన ఆగ్రహం, మనస్తాపం, విద్వేషం సంస్మరణ కార్యకలాపాలకు ఆధారాలుగా మారాయి'. హైందవీకరణ అయిన భారత్ పాకిస్థాన్ పోకడలను అనుసరిస్తున్నట్టుగా కనిపించడం లేదూ? సమష్టి సంతోషాలు, సద్యోజనిత ప్రేరణల స్థానంలో మత విద్వేషాలు, ప్రతీకారాత్మక ఆగ్రహావేశాలు విజృంభిస్తున్నాయి.

లాహోర్ చారిత్రక గతం నుంచి హిందూ, సిక్కు ప్రభావాలు, ఆనవాళ్లను పూర్తిగా చెరిపివేసేందుకు ఇస్లామిక్ పాకిస్థాన్ నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంది. పాకిస్థాన్‌ను ద్వేషించమని బాహాటంగా ప్రకటిస్తున్న హిందుత్వ వాదులు చారిత్రక ఆనవాళ్లను రూపుమాపే తమ ఎడతెగని ప్రయత్నాలలో బద్ధశత్రువులనే అనుకరిస్తున్నారు! గత యుగాలలో ఉత్తర భారతావనిలోని ముస్లిమేతరుల రాజకీయ పరాధీనతనే కాకుండా మత విశ్వాసాల రీత్యా ముస్లింలు అయిన రచయితలు, కళాకారులు, సంగీతవేత్తలు భారతీయ సమాజం, సంస్కృతి సమున్నతికి అందించిన అజరామర సేవలను కూడా మనం మరచిపోవాలని కోరుతున్నారు. అయితే అవి మన ఉమ్మడి, సమ్మిళిత, బహుళత్వ భారతీయ సంస్కృతిలో అపరిహార్యమైన భాగం కదా. హిందుత్వను వ్యతిరేకించే వారందరూ ఆ సమున్నత సమ్మిళిత సంస్కృతిని స్వీకరించి, స్థిరపరచాలి. మనాన్ అహ్మద్ అసిఫ్ పుస్తకాన్ని పాకిస్థాన్‌లో విస్తృతంగా చదువుతారని, ఉర్దూ, పంజాబీ భాషలలో దాని అనువాదాలు వెలువడగలవని ఆశిస్తున్నాను. ఒక గొప్ప, అయితే వ్యాకులతకు గురిచేస్తున్న నగర ప్రశస్త చరిత్ర అది. వాఘాకు అవలే కాదు, ఈవల సైతం ఉన్న వారికి కూడా అసిఫ్ పుస్తకంలో విలువైన పాఠాలు ఉన్నాయి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

అసర్ నివేదిక రట్టు చేసిన 'నాడు–నేడు' గుట్టు!

విద్యా వికాసమే లక్ష్యంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాల్సిన వైసీపీ ప్రభుత్వం, ఐదేళ్ల పాఠశాల విద్యావ్యవస్థతో ఆడుకొన్నది. జగన్ అనాలోచిత వెర్రి, మొర్రి ప్రయోగాలతో విద్యావ్యవస్థ మొత్తంగా పడకేసింది. 117 జీఓతో ఏమి జరిగిందో, ఐదేళ్ల తర్వాత అర్థమైంది. చివరికి ప్రభుత్వ పాఠశాలలు ఖాళీ అయిపోయాయి. జీరో పిల్లల పాఠశాలలుగా, ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయి. నాడు–నేడు పేరుతో లక్షల రూపాయలు ఖర్చు పెట్టిన ప్రాథమిక పాఠశాలలు పిల్లలు లేక వెలవెలపోయాయి. హేతుబద్ధీకరణ పేరిట నాలుగు, అయిదు తరగతులను కిలోమీటర్ల దూరంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు తరలించడంతో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి వందలాది ప్రాథమిక పాఠశాలలు వాటికవే మూతపడ్డాయి. ఉన్న పళాన ఆంగ్ల మాధ్యమాన్ని రుద్దటం, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకపోవటం వంటి చర్యలన్నీ డ్రాపౌట్లకు కారణమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో 2021–22లో 45 లక్షల మంది విద్యార్థులు ఉంటే, ఆ సంఖ్య 2023 విద్యా సంవత్సరంలో 38 లక్షలకు పడిపోయింది. రాష్ట్ర పాఠశాలల్లో సగటున రోజువారీ గైర్హాజరు 24.3 శాతానికి పెరిగింది. నాలుగోవంతు విద్యార్థులు రోజూ బడికి రాలేని పరిస్థితి వచ్చిందంటే, రాష్ట్రంలో విద్యాప్రమాణాలు ఏ స్థాయికి దిగజారాయో అర్థం చేసుకోవచ్చు. దశాబ్దాలుగా విద్యాదానంలో తరిస్తున్న ఎయిడెడ్ పాఠశాలల విలువైన భూములపై కన్నేసి, ఎయిడెడ్ పాఠశాలలను వెంటాడి వేధించి భ్రష్టుపట్టించింది.



తేలిక పదాలతో కూడిన రెండో తరగతి తెలుగు పాఠాన్ని కూడా ప్రభుత్వ పాఠశాలల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో 47 శాతం మంది తప్పుల్లేకుండా చదవలేకపోయారు. 2014లో ఇలాంటి స్థితిలో 20.5 శాతం మంది విద్యార్థులుండగా, ఇప్పుడది రెండింతలకు పైగా పెరిగింది. వైసీపీ పాలనలో సంస్కరణల పేరిట పాఠశాల విద్యలో సృష్టించిన విధ్వంస విధానం విద్యార్థుల చదువుల సామర్థ్యాన్ని దారుణంగా దెబ్బతీసిందని ప్రథమ్ సంస్థ వెల్లడించిన వార్షిక విద్యా స్థితిగతుల 2024–(అసర్) నివేదిక బయటపెట్టింది. అలాగే రెండో తరగతి తెలుగు పాఠాన్ని ఐదో తరగతి విద్యార్థులలో 62.5శాతం మంది చదవలేకపోయారని, మూడో తరగతిలో 85.3శాతం మందికి చదవడమే రావడం లేదని నివేదిక తేల్చింది. రాష్ట్రంలో ఉమ్మడి 13 జిల్లాల ప్రాతిపదికన 390 గ్రామాల్లో 7,721 కుటుంబాలు, 3–16 ఏళ్ల వయస్సున్న 12,697 మంది పిల్లలను సర్వే చేశారు. 352 ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 3, 5, 8 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను విడివిడిగా విడుదల చేసింది అసర్ కమిటీ. మాతృభాషలో అక్షరాలు, పదాలు, ఒకటి, రెండో తరగతి స్థాయి పాఠాలు, గణిత అంకెలు, తీసివేతలు, భాగహారాలు ఇచ్చి విద్యార్థుల సామర్థ్యాలను గణించారు. 14–16 ఏళ్ల వయసు పిల్లల్లో డిజిటల్ అక్షరాస్యతపైనా సర్వే చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కలిపి చూస్తే, అబ్బాయిల కంటే అమ్మాయిలు మెరుగ్గా ఉన్నట్లు అసర్ నివేదిక తేల్చింది.

ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. 70.6శాతం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 60 మంది లోపే విద్యార్థులున్నారని, మధ్యాహ్న భోజనం తయారీకి 22.9శాతం బడుల్లో వంట గదులు లేవని, వైసీపీ ప్రభుత్వం నాడు–నేడు పేరుతో ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించామని ఉత్తుత్తి ప్రకటనలు చేసిందే తప్ప, పనులు చేయలేదని అసర్ నివేదిక వాస్తవాలు వెల్లడించింది. 55.9శాతం బడుల్లోనే తాగునీటి సదుపాయం ఉండగా, 26.2శాతం బడుల్లో సదుపాయం ఉన్నా, తాగునీరు లేదని పేర్కొంది. అలాగే 78.4శాతం బడుల్లోనే మరుగుదొడ్లు వాడకంలో ఉన్నాయని, 77.2శాతం బడుల్లో బాలికలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఉండగా, 9.8శాతం స్కూళ్లలో ప్రత్యేక మరుగుదొడ్లు ఉన్నా వాడకంలో లేవని కూడా అసర్ నివేదిక నాడు–నేడు గుట్టు రట్టు చేసింది. వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను రాజకీయ ప్రయోగశాలగా మార్చింది. విద్యకు రూ.70వేల కోట్లు ఖర్చు చేసామంటున్న వైసీపీ ప్రభుత్వం అంత ప్రజాధనాన్నే కాదు, అంతకుమించి ఒక తరం విద్యార్థుల భవిష్యత్తును కూడా బలిపీఠం పైకి నెట్టింది.

విద్యారంగానికి గొడ్డలి పెట్టుగా మారిన జీవో 117కు స్వస్తి పలికేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. తెలుగుదేశం హయాంలో ఆంధ్రప్రదేశ్ నాణ్యమైన విద్య అందించడంలో 3వ స్థానంలో ఉండగా, జగన్ హయాంలో 19వ స్థానానికి దిగజారిందని అసర్ నివేదిక నిగ్గుతేల్చింది.

• నీరుకొండ ప్రసాద్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్ editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

అమెరికా చర్య అనాగరికం

అమెరికా అధ్యక్షుడి ఆలోచనలు, నిర్ణయాలు, చర్యలు అనాగరికంగా తయారవుతున్నాయి. అవి ఆ దేశాన్ని గొప్పగా మారుస్తాయో లేదో గానీ ఇతర దేశాలకు తలనొప్పిని తెస్తున్నాయి. రాజకీయ, ఆర్థిక, భౌగోళిక స్థితుల్ని తలక్రిందులు చేసేవిగా ఉన్నాయి. ఆ దేశం ఎదుర్కొంటున్న సమస్యపై అధ్యక్షుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపడం. అంతవరకూ అభినందనీయమే. ఒకప్పుడు వలసల్ని ప్రోత్సహించడం ద్వారా ప్రపంచ ఆర్థిక శక్తిగా మారిన దేశం అది. నేడు వలసల్ని అరికట్టాలని అనుకోవడం కేవలం వారి అవసరం. అందునా అక్రమంగా వచ్చిన వాళ్ళని ఆపడం, వెనక్కి పంపించడంలో ఎవరికీ ఆక్షేపణ, అభ్యంతరం ఉండనక్కర లేదు. కానీ వారిని గొలుసులతో బంధించి, అమానవీయంగా సైనిక విమానాల్లో తరలించడం ఒకింత అతి. దొంగతనం నేరమే కావొచ్చు కానీ రూపాయి దొంగిలించినవాడిని గుండుకొట్టి ఊరేగించడం చేస్తే అతి అంటారు. అది అన్యాయం కూడా. తాము కఠినంగా ఉన్నాం అని చెప్పుకోడానికి ఇంత తీవ్రంగా వ్యవహరించనక్కరలేదు. మన దేశం ఈ విషయమై అభ్యంతరం వెలిబుచ్చి, వారిని ఉన్నంతలో మర్యాదగా తీసుకురావడానికి కృషి చెయ్యాల్సింది. మానవ గౌరవం కాపాడడం కనీసపు హక్కు, నాగరిక చర్య కాబట్టి.

ఇక రెండోది గాజా భూభాగాన్ని ఖాళీ చేసి అక్కడ నివాసముంటున్న పాలస్తీనీయుల్ని వేరే చోటకు తరలిస్తాడట అమెరికా అధ్యక్షుడు. అలా చెయ్యడానికి ఆదేమైనా అమెరికా స్వంతమా? ఒక సార్వభౌమిక దేశం. ఇజ్రాయెల్ దాడిలో నష్టపోతూ, లక్షలాది మంది అన్యాయంగా నిరాశ్రయులైన దేశం. వీలైతే యుద్ధాన్ని ఆపి, అక్కడి ప్రజలకు సాంత్వన కలిగించాలి. క్షతగాత్రులకు, అమాయక ప్రజలకు మానవతా దృక్పథంతో అందుతున్న సాయాన్ని కూడా అందనివ్వకుండా చేస్తున్న ఇజ్రాయెల్‌కు బుద్ధి చెప్పాలి. అలా చేయకుండా, అక్కడున్న స్థానిక ప్రజలందరినీ కట్టగట్టి ఎక్కడికో పంపించేస్తాననడం దురహంకారం. ఇలాంటి చర్యల వల్ల, ఆలోచనల వల్లనే తీవ్రవాదం, ఫాసిజం లాంటివి పెరిగి ప్రపంచం నష్టపోతుంది. అన్ని దేశాలూ ముక్తకంఠంతో ఖండించాల్సిన వ్యాఖ్యలివి. ఒక దేశపు అధినేత అహంకారం, ఆ దేశంతో పాటు, మిగతా దేశాల్ని కూడా ప్రమాదంలోకి నెట్టేస్తున్నప్పుడు, ఇది తప్పు అని గట్టిగా చెప్పగలగాలి. చూడాలి, ఎన్ని దేశాలు స్పందిస్తాయో?

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

నెలకు పదిరోజులు అసెంబ్లీ జరగాలి

ఉద్యోగులు ఆదివారం తప్ప మిగిలిన రోజులు ఉదయం పదిన్నరకు వచ్చి సాయంత్రం ఐదు దాకా తమ డ్యూటీ చెయ్యాలి. అలాగే పాఠశాలలు కూడా ఇన్ని రోజులు నడవాలి అని రూల్ ఉంది. కార్మికులు కూడా ఎనిమిది గంటలు పనిచెయ్యాలన్న రూలు ఉంది. ప్రజా సమస్యల్ని చర్చించి, పరిష్కరించాల్సిన శాసనసభ మాత్రం చాలా తక్కువ కాలం పనిచేస్తున్నది. నెలలో కనీసం పదిరోజులు అయినా శాసనసభ్యులు సమావేశమై, ప్రజల సమస్యల గురించి ఆలోచించేందుకు కృషిచేయాలి. ఒక్కొక్క శాసనసభ్యుడికి నెలకు అన్ని అలవెన్సులూ కలిపి లక్షల్లో జీతాలు ఉంటున్నాయి. అన్నీ ఉచితం. మాజీలు అయిన తరువాత పెన్షన్. ప్రోటోకాల్ ప్రకారం అన్ని కార్యక్రమాలలో ముందు సీటు కేటాయించాలి. ఇంత ప్రాముఖ్యత కలిగిన శాసనసభ్యులు ఖచ్చితంగా పనిదినాలు పెంచుకోవాలి. మిగిలిన రోజుల్లో తమ నియోజకవర్గం పరిధిలో గల గ్రామాల్లో పర్యటించి, సమస్యలు తెలుసుకోవచ్చు. కాబట్టి ఈ సమావేశాల్లోనే నెలకు పది రోజులు అసెంబ్లీ సమావేశాలు అన్న తీర్మానం చేయాలి.

– నార్నె వెంకటసుబ్బయ్య



సీఆర్డీఏ భవనానికి జగన్ తెచ్చిన చిక్కులు

- 2019లోనే తుది దశకు ఏడంతస్తుల బిల్డింగ్
- అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు ఆపేసిన జగన్
- మాస్టర్ ప్లాన్ మార్చి అడ్డదిడ్డంగా నిర్మాణాలు
- ఇప్పుడు తలనొప్పిగా మారిన నాటి చర్యలు
- అస్తవ్యస్త నిర్మాణాలను సరిదిద్దడమే సవాల్
- ఇప్పటికే 5 కోట్ల ఖర్చు, సమయం వృథా
- భవన నిర్మాణం పూర్తికి మరో నాలుగు నెలలు

8



శవ పంచాయితీ

అక్టోబరులో ప్రభుత్వాసుపత్రికి అనాథ శవం

వైద్య కళాశాలకు ఇచ్చిన అధికారులు

మేమున్నామంటూ ఆలస్యంగా ఆసుపత్రికి కుటుంబ సభ్యులు

నష్టపరిహారం చెల్లించాలంటూ శుక్రవారం హడావిడి

సాధారణంగా ఎవరైనా ప్రమాదంలో చనిపోయినా, అనుమానాస్పదంగా మరణించినా శవపంచనామా జరుగుతుంది. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం మాత్రం శవ పంచాయితీ జరిగింది. అనాథ శవంగా నిర్ధారించుకుని దాన్ని పొరుగు రాష్ట్రంలోని వైద్య కళాశాలకు ఇచ్చేసిన తర్వాత కుటుంబ సభ్యులు ఇప్పుడు ఆసుపత్రికి చేరుకున్నారు. తమ కుటుంబ సభ్యుడి మృతదేహాన్ని ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో ఆసుపత్రి అధికారులు తలలు పట్టుకున్నారు.

విజయవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని దేవీనగర్‌కు చెందిన గోన శ్యాంసన్ (45) పెయింటర్‌గా పనిచేసేవాడు. ఆయనకు మద్యం అలవాటు ఉంది. కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. గత అక్టోబరు 27వ తేదీన మద్యం తాగి పటమటలోని సెల్లా కళాశాల ముందున్న సర్వీసు రోడ్డుపై పడిపోయాడు. అతడితో పాటు పనిచేసే కార్మికుడు శ్యాంసన్‌ను ప్రభుత్వాసుపత్రి క్యాజువాలిటీలో చేర్పించాడు. తర్వాత అక్కడి నుంచి ఆ కార్మికుడు వెళ్లిపోయాడు. ఆసుపత్రిలో చేరిన 40 నిమిషాలకు శ్యాంసన్ ప్రాణాలు కోల్పోయాడు. ఆయనకు సంబంధించి బంధువులు ఎవరూ లేకపోవడంతో శ్యాంసన్‌ను అనాథశవంగా గుర్తించారు. ఆసుపత్రి సిబ్బంది మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

నిబంధనల ప్రకారం..

మార్చురీలో ఉన్న అనాథ శవాల గురించి ఆసుపత్రి అధికారులు అవుట్‌పోస్టులో ఉన్న పోలీసులకు సమాచారం ఇస్తారు. వారం రోజుల వరకు వాటిని భద్రపరిచాక ఎవరూ రాకపోతే పోలీసులు వాటిని మున్సిపాలిటీకి సిబ్బందికి అప్పగించి, దహన సంస్కారాలు చేయించుకోవచ్చని నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం ఇస్తారు. శ్యాంసన్ 27వ తేదీన బయటకు వచ్చిన తర్వాత ఇంటి ముఖం చూడలేదు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వాళ్లెవరూ శ్యాంసన్ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఆయన మృతదేహాన్ని మార్చురీలో నవంబరు ఏడో తేదీ వరకు భద్రపరిచారు. శ్యాంసన్‌కు సంబంధించిన వారెవరూ

మిగతా 6లో..

ఎనికేపాడు గోడౌన్‌లో పోలీసుల తనిఖీలు, చోరీ జరగ్గా మిగిలిన సరుకు





యూపీ నుంచి ఏపీ

ఎనికేపాడు గోడౌన్‌లో చోరీ కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులు

- సీసీ కెమెరాల ద్వారా ఆరుగురు నిందితుల గుర్తింపు
- వారం కిందట రాష్ట్రంలో అడుగుపెట్టిన గ్యాంగ్
- పలాస నుంచి బెజవాడ వరకు పక్కా రెక్కీ
- ఎనికేపాడులో రూ.2.51 కోట్ల విలువైన ఫోన్ల చోరీ
- బిహార్ పారిపోతుండగా పట్టుకున్న పోలీసులు
- అంతర్రాష్ట్ర పోలీసుల సహకారంతో పట్టివేత..!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చారు.. కోస్తాతీరాన్ని జల్లెడ పట్టారు.. దొంగతనానికి ఏ ఊరు అనువుగా ఉంటుందో చూసుకున్నారు.. టార్గెట్ ప్రకారం స్కెచ్‌ను అమలు చేశారు.. చివరకు పొరుగు రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులకు దొరికిపోయారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో ఇన్‌గ్రాం మైక్రో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ గోడౌన్‌లో జరిగిన చోరీ కేసును విజయవాడ పోలీసులు 24 గంటల వ్యవధిలోనే ఛేదించారు. ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చి, గోడౌన్‌లో చోరీ చేసి బిహార్‌కు పారిపోతున్న గ్యాంగ్‌కు అంతర్రాష్ట్ర పోలీసుల సహకారంతో సంకెళ్లు వేశారు. చైన్ లింక్ మాదిరిగా 100కి పైగా సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి రాత్రికిరాత్రి గ్యాంగ్ ఆచూకీ కొనుగొన్నారు. ఈ వివరాలను త్వరలో పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు అధికారికంగా వెల్లడించే అవకాశాలున్నాయి.

అలా వచ్చారు.. : ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ గ్యాంగ్ ఈనెల ఒకటో తేదీన రాష్ట్రంలోకి అడుగుపెట్టింది. మధ్యప్రదేశ్ రిజిస్ట్రేషన్ నెంబరుతో ఉన్న కారులో ఆరుగురు యువకులు ఇక్కడికి వచ్చారు. విజయవాడ నుంచి శ్రీకాకుళం జిల్లా పలాస వరకు పలు ప్రాంతాల్లో రెక్కీలు నిర్వహించారు. విజయవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం, తుని, అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం, పలాస వరకు పలుమార్లు తిరిగారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఇన్‌గ్రాం మైక్రో ఇండియా గోడౌన్ వద్ద మూడు రోజులపాటు

మిగతా 6లో..

దిశ మార్చేశారు

గోడౌన్‌కు బయట బుల్లెట్ సీసీ కెమెరాలు ఉండటాన్ని నిందితులు గమనించారు. ఆరుగురిలో ముగ్గురు గోడౌన్ లోపలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. మరో ముగ్గురు బయట ఉంటూ సరుకును బ్యాగ్‌ల్లో సర్దేలా ప్రణాళికలు వేసుకున్నారు. గోడౌన్‌లోకి దిగిన ముగ్గురు ముందుగా ఎత్తయిన గోడ ఎక్కి అక్కడున్న సీసీ కెమెరాల దిశలను మార్చేశారు. సీసీ కెమెరాలు రహదారిపైకి వెళ్లేవారిని, గోడౌన్‌లోకి వచ్చే వారిని గుర్తించేలా ఏర్పాటు చేశారు. నిందితులు ఈ కెమెరాలను ఆకాశం వైపునకు మార్చేశారు. ఆ సమయంలో వారి ముఖాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. మాస్కులు ధరించకపోవడంతో ఛాయాచిత్రాలు స్పష్టంగా కనిపించాయి. నిందితులు ఉపయోగించిన వాహనంపై ఉన్న స్వస్తిక్ రేడియం స్టిక్కర్ పోలీసులకు ప్రధాన ఆధారంగా ఉపయోగపడింది. వీరిపై ఎక్కడెక్కడ కేసులున్నాయో బయటకు తీసే పనిలో పోలీసులు ఉన్నారు.

గుండెల్లో పేలుళ్లు





గడ్డమణుగులోయ గంగరాయి గుట్టలో అక్రమ క్వారియింగ్‌తో అన్నదాతల అవస్థలు

- ఎగిసిపడుతున్న బండరాళ్లు.. పాడైపోతున్న పంటపొలాలు
- 2 కిలోమీటర్ల మేర నాశనమవుతున్న వ్యవసాయ భూములు
- రైతన్నల ఆందోళన.. ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ఆవేదన
- చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు వేడుకోలు
- కలెక్టర్ జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి

అక్రమార్కుల ధనార్జనలో రైతుల గుండెలు బద్దలవుతున్నాయి. రాతి క్వారీల్లో రిగ్ బ్లాస్టింగ్‌ల కారణంగా బండరాళ్లు ఎగసి వందల మీటర్ల దూరంలో ఉన్న పచ్చటి పంటపొలాల్లో పడుతున్నాయి. కిలోమీటర్లకొద్దీ దుమ్మూధూళి వ్యాపిస్తోంది. ఫలితంగా ఆరుగాలం రైతన్నలు శ్రమించిన పంటలు బూడిదవుతున్నాయి. ఏమిటీ అన్యాయమంటూ ప్రశ్నించిన వారిపై క్వారీ యజమానులు దౌర్జన్యాలకు దిగుతున్నారు. కేసులు పెడుతూ రైతులను వేధిస్తున్నారు. ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న జి.కొండూరు మండలం గడ్డమణుగులోయ, గంగరాయిగుట్టలోని రాతి క్వారీల సమీపంలోని రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు.

జి.కొండూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అక్రమ క్వారియింగ్‌లో పేలుళ్ల, దుమ్మూధూళి నుంచి తమ పంటలను కాపాడాలంటూ జి.కొండూరు మండలం గడ్డమణుగు లోయ గ్రామ రైతులు అధికారులను వేడుకుంటున్నారు. లోయ ప్రాంతంలో పొలాలు సాగుచేసే అన్నదాతలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండపల్లి రిజర్వు ఫారెస్టు సమీపంలో లోయలోని గంగరాయిగుట్ట ప్రాంతంలో 25 రాతి, గ్రావెల్ క్వారీలు ఉన్నాయని, ఇక్కడ రిగ్ బ్లాస్టింగ్ చేస్తున్నారని, ఒక్కో రిగ్ బ్లాస్టింగ్‌కు 7 వేల అడుగుల లోతు తీస్తున్నారని చెబుతున్నారు. దీంతో 2 కిలోమీటర్ల మేర దుమ్మూధూళి గాల్లో లేస్తూ పరిసర ప్రాంతాలను కమ్మేస్తోందని చెప్పారు.

100 కిలోల రాళ్లు కూడా..

పేలుళ్ల ధాటికి 50 కిలోల నుంచి 100 కిలోల వరకు బండలు పొలాల్లో పడి పంటలు ధ్వంసమవుతున్నాయి. దుమ్మూధూళితో పాటు బండలు పడుతున్నందున.. చుట్టూ ఉన్న పొలాల్లోని పంట ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. కష్టపడి పండించినా నాణ్యత లేక ఎవరూ కొనుగోలు చేయడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పొలాల్లో పనిచేసేందుకు సైతం కూలీలు దొరకని పరిస్థితి ఏర్పడింది. పైగా బ్లాస్టింగ్ ధాటికి సాగునీటి బోర్లు సైతం కదిలిపోయి పూడిపోతున్నాయని, డ్రిప్ పరికరాలు పాడవ్వడంతో వాటిని పక్కన పెట్టేశామని, విద్యుత్ లైన్లపై పడి అవి తెగిపడిపోతున్నాయని, విద్యుత్ స్తంభాలు విరిగిపోతున్నాయని ఆవేదనతో చెప్పారు. సోలార్ పలకలు కూడా నాశనం అవుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణం అక్రమ క్వారియింగ్ జరగకుండా చూడాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

ఇళ్లకు బీటలు

క్వారియింగ్, బ్లాస్టింగ్ వల్ల గడ్డమణుగు, చెర్వుమాధవరం, కట్టుబడిపాలెం, విద్యానగరం, మునగపాడు, జి.కొండూరు గ్రామాల్లో చాలామంది ఇళ్లు బీటలు వారాయి. బ్లాస్టింగ్ సమయంలో వచ్చే శబ్దంతో కిటికీలు, తలుపులు అదురుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇలానే ఉంటే తాము ఇక ఇళ్లల్లో ఉండే పరిస్థితి ఉండదని, రిగ్ బ్లాస్టింగ్ కంట్రోల్ చేయాలని వారంతా వేడుకుంటున్నారు.

మిగతా 6లో..



మాజీ ఎంపీ నందిగాం సురేష్ మనుషులే..

స్థానిక యజమాని నుంచి మాజీ ఎంపీ నందిగాం సురేష్ మనుషులు లీజుకు తీసుకుని ఏడేళ్లుగా మా 10.74 ఎకరాల భూమిలోకి మమ్మల్ని రానివ్వలేదు. మేం ఇంతే.. బ్లాస్టింగ్ చేస్తాం.. ఏం చేస్తారో చేసుకోండి.. అని బెదిరిస్తున్నారు. మొత్తం బీడుగా మారింది. ఒక్క క్వారీకి అనుమతి తీసుకుని చాలా క్వారీలు నడుపుతున్నారు. గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఏం చలనం లేదు. మాకు న్యాయం చేయండి.

\- గద్దె గాంధీ, రైతు

అలసత్వాన్ని వీడి పరీక్షలకు సన్నద్ధం కండి

- పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ లక్ష్మీశ

నందిగామ చైర్‌పర్సన్‌గా మండవ కృష్ణకుమారి ప్రమాణస్వీకారం

6లో

అది మహానాడు రోడ్డే

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వంలో దేవినేని రాజశేఖర్ రోడ్డుగా పేరు మార్పు

నాటి కౌన్సిల్ తీర్మానాన్ని రద్దు చేసిన కూటమి ప్రభుత్వం



బెజవాడలో చరిత్ర కలిగిన మహానాడు రోడ్డు వివాదానికి రాష్ట్ర ప్రభుత్వం బ్రేక్ వేసింది. మహానాడు రోడ్డు పేరును మారుస్తూ వైసీపీ ప్రభుత్వంలో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) కౌన్సిల్ చేసిన తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఇకపై మహానాడు రోడ్డుగానే పిలవాలని శుక్రవారం అధికారిక ఉత్తర్వులు ఇవ్వడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

8లో

మెట్రోకు మౌఖిక అనుమతులివ్వండి

కేంద్ర ప్రభుత్వానికి ఏపీఎంఆర్‌సీ విజ్ఞప్తి

విజయవాడ ఎయిర్‌పోర్టులో అండర్ గ్రౌండ్ మెట్రో రూట్‌కు ఓకే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు మౌఖిక అనుమతులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) విజ్ఞప్తి చేసింది. మౌఖిక ఆదేశాలు ఇవ్వగానే టెండర్ల ప్రక్రియకు వెళ్లేందుకు సిద్ధం కావాలని భావిస్తోంది. ఈసారి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టులన్నింటికీ నిధులు కేటాయించింది. విజయవాడ మెట్రో ప్రాజెక్టు నిర్మాణానికి నూరుశాతం కేంద్ర ప్రభుత్వమే భరించాల్సిందిగా ఏపీఎంఆర్‌సీ నుంచి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదన వెళ్లింది. ఈ ప్రతిపాదనకు కేంద్రం ఏం చెబుతుందో ఆసక్తికరంగా మారింది. మౌఖిక అనుమతులు ఇస్తే ఐదారు నెలల్లోనే టెండర్లకు వెళ్లాలని అధికారులు భావిస్తున్నారు.

భూసేకరణలో కదలిక

ఇప్పటికే 100 ఎకరాల భూ సేకరణలో కదలిక వచ్చింది. ఈ అంశాలపై ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం దృష్టిపెట్టింది. ముఖ్యంగా కేసరపల్లిలో కోచ్ డిపోకు 70 ఎకరాలు కావాల్సి ఉండగా, మిగిలిన 30 ఎకరాలు మెట్రో స్టేషన్లకు అవసరమవుతుంది. ఎక్కడెక్కడ భూములు అవసరమన్నది గతంలోనే నిర్ణయించారు. ప్రస్తుతం భూసేకరణ జరపాల్సిన ప్రాంతాల్లో పరిస్థితులపై యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

ఎయిర్‌పోర్టులో అండర్‌గ్రౌండ్ మెట్రోకు అనుమతి

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో అండర్ గ్రౌండ్ మెట్రోకు సంబంధించి ఎయిర్‌పోర్టు అథారిటీ నుంచి అనుమతి వచ్చింది. గన్నవరం నుంచి విజయవాడ వచ్చే కారిడార్-1 అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గర ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ అవుతుంది. అండర్ గ్రౌండ్‌లో కారిడార్ వెళ్తుంది. ఎయిర్‌పోర్టులో రెండు కారిడార్స్ వెళ్తుంటాయి. గన్నవరం నుంచి ఎయిర్‌పోర్టుకు, ఎయిర్‌పోర్టు నుంచి యోగాశ్రమం వరకు భూగర్భ విధానంలోనే వెళ్తుంది. దీనికి సంబంధించి త్వరలోనే ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌తో ఏపీఎంఆర్‌సీ అధికారులు సమావేశమయ్యే అవకాశాలున్నాయి.



శిథిల వంతెనలు

2018లో కూలిన కట్టలేరుపై వినగడప వద్ద బ్రిడ్జి

- ఇటీవల వరదలకు కుంగిన ఎంఎన్‌కే రోడ్డులో కుమ్మరికుంట్ల వద్ద ఏడు ఖానాల బ్రిడ్జి
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- కొత్త బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్

6లో

నేటి నుంచి వీరమ్మ తిరునాళ్ల

ఉయ్యూరులో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

15 రోజుల పాటు జరగనున్న ఉత్సవాలు

8లో



బాధ్యతలు స్వీకరించిన మండవ కృష్ణకుమారికి అభినందనలు తెలుపుతున్న విప్ తంగిరాల సౌమ్య

నందిగామ చైర్‌పర్సన్‌గా మండవ కృష్ణకుమారి ప్రమాణస్వీకారం

నందిగామ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'ప్రజాస్వామ్యబద్ధంగా నందిగామ మునిసిపాలిటీని టీడీపీ కైవశం చేసుకుంది. నిబద్ధత, నిజాయితీ గల మండవ కృష్ణకుమారి నాయకత్వంలో పట్టణం మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రణాళికాబద్ధంగా పనిచేసి నందిగామ మునిసిపాలిటీని రాష్ట్రంలో ఆదర్శంగా నిలుపుతాం.' అని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. నందిగామ మునిసిపల్ చైర్‌పర్సన్‌గా మండవ కృష్ణకుమారి శుక్రవారం పదవీ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని విప్ తంగిరాల సౌమ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన కృష్ణకుమారిని సౌమ్య సత్కరించారు. పట్టణ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేస్తానని కృష్ణకుమారి తెలిపారు. ఎన్ఎస్ఎల్‌బీఎస్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, కోగంటిబాబు, కౌన్సిలర్లు, కమిషనర్ రమణబాబు పాల్గొన్నారు

అలసత్వాన్ని వీడి పరీక్షలకు సన్నద్ధం కండి

- పదో తరగతి విద్యార్థులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు అలసత్వాన్ని వీడాలని, ఇది ఎంతో కీలకమైన సమయమని, పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠాలు చెప్పారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి నూరుశాతం ఫలితా లు సాధించాలని, అత్యవసరమైతే తప్ప సెలవులు పెట్టొద్దని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను ఆయన పరిశీలించారు. గణితం, సోషల్ సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఏడుగురు ఉపాధ్యాయులు సెలవు పెట్టడంపై ఆయన అసహ నం వ్యక్తం చేశారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న సమయంలో సెలవులు పెట్టడం సరికాదన్నారు. హెచ్‌ఎం టి.డేవిడ్ రాక్‌ఫెల్లర్, ఆర్‌ఐ జి.వరప్రసాద్, వీఆర్వో సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆప్కాస్ కంటే మెరుగైన విధానం తీసుకురండి

- ప్రభుత్వాన్ని కోరిన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం

వన్‌టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తున్న ప్రభుత్వం దానికంటే మెరుగైన విధానాన్ని తీసుకురావాలి. కూటమి ప్రభుత్వంపై మేము పెట్టుకున్న ఆశలను పాలనాదక్షుడైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వమ్ముచేయరని నమ్ముతున్నాం. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తారని భావిస్తున్నాం. మమ్మల్ని ఆయా శాఖలకు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.' అని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో ఆప్కాస్‌ను ఎత్తివేయడానికి నిర్ణయం తీసుకోవడంతో గవర్నర్‌పేటలోని రెవెన్యూభవన్‌లో శుక్రవారం అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం అత్యవసరంగా సమావేశమైంది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.సుమ న్, ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు, అసోసియేట్ అధ్యక్షుడు జి.సంపత్ కుమార్, కోశాధికారి రమణమూర్తి తదితరులు మంత్రివర్గ నిర్ణయాలపై చర్చించారు. సెర్ప్, మెప్మా ఉద్యోగులకు కల్పిస్తున్నట్టుగానే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకూ హెచ్‌ఆర్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని వారు కోరారు.

గ్రూప్-2 రాత పరీక్షపై స్పష్టత ఇవ్వాలి

- ఏపీపీఎస్సీని కోరిన నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్‌కుమార్

వన్‌టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 అభ్యర్థులకు ఈ నెల 23న జరగాల్సిన రాత పరీక్ష ఉంటుందా..వాయిదా పడుతుందా అ నేది స్పష్టత ఇవ్వాలని ఏపీపీఎస్సీ చైర్మన్‌ను ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 899 గ్రూప్ -2 ఉద్యోగాలకు కిందటేడాది ఫిబ్రవరి 25న ప్రాథమిక పరీక్ష జరిగిందని, ప్రధాన పరీక్షకు 92,259 మంది ఎంపికయ్యారని, ఈనెల 23న ప్రధాన పరీక్ష జరుగుతుందని తెలిపారని పేర్కొన్నారు. కోర్టు కేసులు, తదితర సమస్యల కారణంగా పరీక్షలు షెడ్యూలు మేరకు జరగవని, పరీక్ష రద్దవుతుందని ప్రచారం జరుగుతోందని, దీనిపై ఏపీపీఎస్సీ చైర్మన్ స్పష్టత ఇచ్చి సందేహాలను నివృత్తి చేయాలని ఆయన కోరారు. ఈ పోస్టుల ప్రకటన కోసం గత ప్రభుత్వ హయాంలో పడిన ఇబ్బందులను లేఖలో ప్రస్తావించారు.

డాక్టర్ మారుకు అంతిమ వీడ్కోలు

పటమట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మరణించిన నాస్తిక ఉద్యమ నేత గోరా కుమార్తె ప్రముఖ వైద్యురాలు జి.మారు అంత్యక్రియలు శుక్రవారం కొత్త బస్టాండ్ సమీపంలోని శ్మశాన వాటికలో నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో డాక్టర్లు, నాస్తికులు, అభిమానులు, నగర ప్రముఖులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. గోరా కుటుంబానికి నాస్తిక ఉద్యమానికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మారు భర్త హరి సుబ్రహ్మణ్యం, కుమారుడు ఓలాస్ గోరా, డాక్టర్ సమరాన్ని పరామర్శించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఎం నేతలు చిగురుపాటి బాబురావు, డి.రమాదేవి, ప్రముఖులు చంద్రరావు, మోతుకూరి వెంకటేశ్వరరావు, అరుణ్‌కుమార్, డాక్టర్ రమేష్, లక్ష్మణరెడ్డి నివాళులర్పించారు.



మారుకు నివాళులర్పిస్తున్న ప్రముఖులు

గుండెల్లో పేలుళ్లు

(5వ పేజీ తరువాయి)

బూతులు తిడుతున్నారు : నూతక్కి అపర్ణ, గడ్డమణుగు ఎంపీటీసీ

రైతుల పంటలకు నష్టపరిహారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తే క్వారీ యజమాని కోటేశ్వరరావు నోటి కొచ్చినట్టు బూతులు తిట్టాడని గడ్డమణుగు ఎంపీటీసీ నూతక్కి అపర్ణ పేర్కొన్నారు. 'నా భర్తను ఇష్టానుసారంగా తిట్టాడు. అతనిపై కేసు పెట్టేందుకు సిద్ధమయ్యాం. ఇప్పటికే అతనిపై చాలా కేసులున్నాయి. రైతుల్ని కానీ, స్థానిక ప్రజాప్రతినిధుల్ని కానీ లెక్కచేసే పరిస్థితి లేదు.' అని ఆమె తెలిపారు.

అంతా అక్రమమే..

ఇక్కడున్న అనేక క్వారీలకు పర్యావరణ అనుమతులు లేవు. రెండు హెక్టార్లు దాటితే అనుమతులుండాలి. కానీ ఎవరూ ఆ నిబంధనలు పాటించట్లేదు. డీప్ హోల్ బ్లాక్ బ్లాస్టింగ్ చేస్తున్నారు. లారీలు తిరిగినంత వరకు రహదారి పూర్తిగా పాడైంది. కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేశాను. ఒక ట్రిప్‌కు మైనింగ్ బిల్లులు ఇవ్వరు. వేమెంట్ బిల్లును మైనింగ్ బిల్లుగా ఇస్తున్నారు. రైతులకు జరుగుతున్న అన్యాయంపై అధికారులు స్పందించాలి. - **నూతక్కి నాగేశ్వరరావు, రైతు**

ప్రశ్నిస్తే కేసు పెట్టారు

నాకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించినందుకు నాపై క్వారీ యజమాని కేసు పెట్టాడు. ఎవరికి మా గోడు చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. పంటలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. కూలీలు సైతం పనికి రావట్లేదు. పంటలు నాణ్యత ఉండట్లేదు. మార్కెటింగ్ చేసుకునేందుకు నానా ఇబ్బంది పడుతున్నాం. రైతులంటే చులకనగా చూస్తున్నారు.

- గంపా పుల్లారావు, రైతు



ఎన్ఎంకే రోడ్డులో కుమ్మరికుంట్ల వద్ద కుంగిన ఏడుఖానాల బ్రిడ్జి

తిరువూరు నియోజకవర్గంలో బ్రిడ్జిలు, పలు రహదారులు మరమ్మతులు, నిర్మాణాలకు నోచుకోకపోవడంతో రాకపోకలకు ప్రజలు నానా ఇబ్బంది పడుతున్నారు. 2018లో కట్టలేరుపై వినగడప వద్ద బ్రిడ్జి కూలిపోయింది. ఇప్పటి వరకు దాని నిర్మాణం జరగలేదు. ఇటీవల వరదలకు ఎంఎన్‌కే రోడ్డులో కుమ్మరికుంట్ల వద్ద ఏడు ఖానాల బ్రిడ్జి కుంగిపోయింది. ఈ రెండు బ్రిడ్జిల వద్ద అప్రోచ్ రోడ్లపై ప్రజలు రాకపోకలు సాగిస్తూ ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం బ్రిడ్జిలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిల వంతెనలు

2018లో కట్టలేరుపై వినగడప వద్ద కూలిన బ్రిడ్జి

- ఇటీవల వరదలకు ఎంఎన్‌కే రోడ్డులో కుమ్మరికుంట్ల వద్ద కుంగిన ఏడు ఖానాల బ్రిడ్జి
- రాకపోకలకు ప్రజల ఇబ్బందులు
- కొత్త బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి-తిరువూరు): నియోజకవర్గంలో పలు రహదారులు, బ్రిడ్జిలు మరమ్మతులు, నిర్మాణాలకు నోచుకోకపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎంఎన్‌కే(మచిలీపట్నం, నూజివీడు, కల్లూరు) రోడ్డులో విస్సన్నపేట నుంచి ఎ.కొండూరు అడ్డరోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారిలో కుమ్మరికుంట్ల వద్ద వరదనీరు, ఎ.కొండూరు చెరువు అలుగునీరు ప్రవహించే కాల్వపై చాన్నాళ్ల క్రితం రాతి తూములతో నిర్మించిన ఏడుఖానాల చిన్నబ్రిడ్జి ఇటీవల వచ్చిన వరదలకు దెబ్బతింది. ఈ బ్రిడ్జిపై వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా ఉంది. దీంతో ఈ బ్రిడ్జి వద్ద తాత్కాలికంగా అప్రోచ్‌రోడ్డు నిర్మించి రాకపోకలు సాగిస్తున్నారు. అప్రోచ్ రోడ్డు కూడా సరిగా లేదు. దీంతో ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. తిరువూరు నుంచి మధిర ప్రధాన రహదారి, ఎ.కొండూరు అడ్డరోడ్డు నుంచి విస్సన్నపేట రహదారి, అక్కపాలెం, కోకిలంపాడు, వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ధ్వంసమైన బ్రిడ్జిల స్థానంలో నూతన బ్రిడ్జిలు నిర్మించాలని, రహదారులు అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కట్టలేరు..ఆ కథ వేరు!

తిరువూరు ప్రాంతం నుంచి ప్రవహించే కట్టలేరు, విప్లవవాగు, వెదుళ్లవాగు, పడమటివాగు, గుర్రపువాగులు గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరులో కలుస్తాయి. 2018 ఆగస్టు 28న తుఫానుకు వినగడపవద్ద కట్టలేరుపై గతంలో నిర్మించిన బ్రిడ్జి ధ్వంసమయింది. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రూ.13 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. టెండర్ల దశలో 2019 సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో బ్రిడ్జి నిర్మాణం జరగలేదు. గత ఏడాది మార్చి 19న తిరువూరు వచ్చిన సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వినగడప వద్ద కట్టలేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.25 కోట్లు ప్రకటించారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీ నాయకులు అప్పటి ఎంపీ కేశినేని నాని, నలగట్ల స్వామిదాసుతో కలిసి వినగడప వద్ద కట్టలేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలవకుండా స్టేట్ ప్లాన్‌గ్రాంటు రూ.25.60 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అప్పటి ఎమ్మెల్యే కె.రక్షణనిధి కార్యక్రమానికి హాజరుకాలేదు.



ఎన్నికలకు ముందు టెండర్ పిలవకుండానే వైసీపీ నాయకులు హడావుడిగా వేసిన శిలాఫలకం

తాత్కాలిక రోడ్డుపై తిప్పలు

వినగడప వద్ద కట్టలేరుపై బ్రిడ్జి కూలడంతో గంపలగూడెం మండలం తోటమూల నుంచి విజయవాడ, నూజివీడు, కనుమూరు, అనుముల్లంక, కొత్తపల్లి, తెలంగాణ ప్రాంతంలోని పుణ్యక్షేత్రమైన జమలాపురంతోపాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం కూలిన బ్రిడ్జి ప్రాంతంలో తాత్కాలిక రోడ్డు ఏర్పాటుచేశారు. అది కొద్దిపాటి వరదలకే కొట్టుకుపోతోంది. తిరిగి రోడ్డు నిర్మించడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డుపై వివిధ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

ముగిసిన సుబ్బారాయుడి కల్యాణ మహోత్సవాలు

మోపిదేవి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు స్వామి పవళింపు సేవతో ముగిశాయి. మాఘ శుద్ధ చవితి ఆదివారం స్వామిని పెండ్లి కుమారుడిని చేయడంతో కల్యాణ మహోత్సవాలు ప్రారంభమై మాఘశుద్ధ నవమి గురువారం రాత్రి పవళింపు సేవతో ముగిశాయి. మహోత్సవాల్లో భాగంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ద్వాదశ ప్రదక్షిణల కార్యక్రమాన్ని అర్చక బృందం శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించింది. ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు బుద్ధు పవన్ కుమార్‌శర్మ, వేద పండితులు శాస్త్రోక్తంగా పవళింపు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. విశేష అలంకరణ చేసిన స్వామి, అమ్మవార్లకు కల్యాణ మండపంలో పవళింపు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

టీడీపీ నాయకుడిపై హత్యాయత్నం

నందిగామరూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాలపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పసుపులేటి సూర్యప్రకాష్‌పై హత్యాయత్నం జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం లింగాలపాడు గ్రామం నుంచి బైక్‌పై నందిగామ వస్తుండగా మధ్యలో గ్రామస్థులు కనిపించారు. వారితో మాట్లాడుతుండగా మరో బైక్‌పై వచ్చిన అదే గ్రామానికి చెందిన కొంగర రామకృష్ణ ఢీకొట్టాడు. సూర్యప్రకాష్ కిందపడిపోయాడు. వెంటనే రామకృష్ణ కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో సూర్యప్రకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నందిగామ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న పసుపులేటి సూర్యప్రకాష్

ప్రజాప్రతినిధి నోటి దురుసుతనం

- సెలవుపై వెళ్లిన ఇన్‌స్పెక్టర్

విజయవాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఓ ప్రజాప్రతినిధి నోటి దురుసుతనంతో మనస్తాపానికి గురైన నగరంలోని కొత్తపేట ఇన్‌స్పెక్టర్ చిన్న కొండలరావు సెలవులో వెళ్లిపోయారు. ఇన్‌స్పెక్టర్ కొండలరావు ఒక ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును కొద్దిరోజుల క్రితం నమోదు చేశారు. ఇందులో ఒక పార్టీ కృష్ణాజిల్లాకు చెందిన కూటమి ఎమ్మెల్యే వద్దకు వెళ్లారు. ఆయన ఫోన్ చేసి ఇన్‌స్పెక్టర్‌ను ఇష్టానుసారంగా దూషించారు. ఇన్‌స్పెక్టర్ కేసు వివరాలు చెబుతున్నా వినకుండా తన స్టైల్‌లో మాటలు తూలారు. దీనికి మనస్తాపం చెందిన కొండలరావు శుక్రవారం ఉదయం తన వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌లో ఉంచేసి ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశారు. అనంతరం సెలవులో వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ విషయం కమిషనరేట్‌లో చర్చనీయాంశంగా మారింది. ఆ విధంగా మాట్లాడిన ఎమ్మెల్యే ఎవరన్న దానిపై చర్చ నడుస్తోంది.

ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోండి

- ఆయన నన్ను ఇబ్బంది పెడుతున్నారు
- నాపై తప్పుడు కేసు పెట్టించారు
- అందుకే ఆత్మహత్యకు యత్నించా
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు సెల్ఫీ వీడియోలో డేవిడ్ విజ్ఞప్తి

తిరువూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తిరువూరు నియోజకవర్గంలో టీడీపీని కాపాడుకునేందుకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని, తనలాంటి కార్యకర్తల్ని ఆదుకోవాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మండలంలోని పెద్దవరం గ్రామానికి చెందిన పల్లికంటి డేవిడ్ విజ్ఞప్తి చేశాడు. గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన డేవిడ్ ప్రస్తుతం విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన సెల్ఫీవీడియో శుక్రవారం విడుదలైంది. 'పేద కుటుంబానికి చెందిన నేను టీడీపీ కోసం పనిచేశా. కొన్ని రోజులుగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు నన్ను ఇబ్బంది పెడుతున్నారు. పార్టీకి చెందిన కొందరు పెద్దలపై తప్పుడు పోస్టింగులు పెట్టాలని, ఆ నాయకులపై భౌతికదాడులు చేయాలని నాపై ఒత్తిడి తెస్తున్నారు. ఎమ్మెల్యే ప్రోద్బలంతో నాపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు ఏదైనా చేస్తారనే భయంతో ఆత్మహత్యకు యత్నించా.' అని డేవిడ్ పేర్కొన్నాడు. తనది పేదకుటుంబమని అయినా పార్టీకోసం పనిచేస్తున్నామని, ఎమ్మెల్యే మాత్రం తమ గ్రామంలో వైసీపీ వారితో కలిసి తనను ఇబ్బంది పెడుతున్నాడని, తనపై తప్పుడు కేసులు పెట్టించారని సెల్ఫీ వీడియోలో వాపోయాడు.



సెల్ఫీ వీడియో ద్వారా తన ఆత్మహత్యాయత్నానికి కారణాలు వివరిస్తున్న డేవిడ్

చిన్నారులపై కర్కశం

ఆశోక్‌నగర్‌లోని ఓ స్కూల్‌లో తమ పిల్లలను చిత్రహింసలు పెడుతున్నారని తల్లిదండ్రుల ఆందోళన



ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పటమట పోలీసులు

ఆటోనగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని వయసు వారిది. ఆకలేస్తే ఏడవడమే తప్ప ఆకలేస్తుందని అడగాలని తెలియదు వారికి..అలాంటి పసిపిల్లల్ని 12వ డివిజన్ ఆశోక్‌నగర్‌లోని శ్రీ ఆచార్య ప్రీ ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ స్వాతి, ఇతర సిబ్బంది చిత్రహింసలు పెడుతున్నారంటూ శుక్రవారం తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. తమ పిల్లల్ని చిత్రహింసలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పాఠశాల ముందు బైఠాయించారు. సమాచారం అందుకున్న పటమట పోలీసులు పాఠశాల వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. పోలీసులు రావడంతో పాఠశాలలోని సిబ్బంది అక్కడి నుంచి పరారయ్యారు. ప్రిన్సిపాల్ స్వాతి స్పృహ తప్పినట్టు పడిపోయి దగ్గరలోని ఆస్పత్రిలో చేరారు. పాఠశాల యజమాని కార్తీక్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తల్లిదండ్రులు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇవ్వాలని ఎస్సై సూచించి వెళ్లిపోయారు. తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు.

ఓ విద్యార్థి తల్లి ఆవేదన..

'వారం క్రితం నా కుమారుడి తొడ భాగంలో ఎర్రగా కందిపోయి ఉండడాన్ని గమనించాను. సూదులతో గుచ్చినట్టు కనిపించడంతో ఆ చిన్నారిని అడిగాను. ఎంత అడిగినా ఏం జరిగిందో చెప్పకపోవడంతో మందులు వాడాను. రెండు రోజుల తర్వాత మరో తొడ కాలికి గాయాలు కనిపించాయి. అప్పుడు అడిగితే స్కూల్లో గిచ్చినట్టు చెప్పాడు. దీంతో పాఠశాలకు వెళ్లి సీసీ కెమెరాలు చూపించాలని గట్టిగా అడిగాను. ప్రిన్సిపాల్ స్వాతి, ఇతర సిబ్బంది కలిసి చిన్నారులను రోజూ చిత్రహింసలు పెడుతున్నట్టు తెలిసింది. ఆ వీడియోలను ఇతర తల్లిదండ్రులకు పంపాను.' అని విద్యార్థి తల్లి తెలిపారు.


సీసీ ఫుటేజీ డిలీట్ చేశారు

తామంతా కలిసి పాఠశాల యజమాని కార్తీక్‌ను ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానం చెబుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. సీసీ ఫుటేజీని కార్తీక్ డిలీట్ చేసినట్లు వారు గుర్తించారు. తన భార్యను(ప్రిన్సిపాల్ స్వాతిని) కాపాడుకోవాలనే కాపాడుకోవాలనే ఈ పనిచేశారని ఆరోపిస్తున్నారు.

విద్యార్థికి ఉపాధ్యాయుడి దండన

- వాటర్ పైపుతో కొట్టడంతో వీపుపై తేలిన వాతలు

నాగాయలంక, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్రచివర పంచాయతీ శివారు పెదగౌడపాలెం మండల పరిషత్ యూపీ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న పరిశే రూపేష్‌ను ఉపాధ్యాయుడు బండ్రెడ్డి హనుమాన్ శుక్రవారం దండించాడు. రూపేష్‌కు పాఠం రాకపోవడంతో ఆగ్రహించిన ఉపాధ్యాయుడు వాటర్ పైపుతో విద్యార్థి వీపు భాగంలో కొట్టారు. దీంతో వీపుపై ఉబ్బి, వాతలు తేలాయి. ఈ ఉదంతం సోషల్ మీడియాలో వైరల్ అవడంతో ఎంఈవో టి.వి.ఎం.రామదాసు పెదగౌడపాలెం పాఠశాలకు వెళ్లారు. విద్యార్థిని, తల్లిదండ్రులను, ఉపాధ్యాయుడిని విచారించానని, జిల్లా అధికారులకు నివేదిక పంపుతానని ఎంఈవో తెలిపారు.



విద్యార్థి వీపుపై తేలిన వాతలు

నేటి నుంచి సిద్ధేంద్ర యోగి జయంత్యుత్సవాలు

కూచిపూడి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అఖిల భారత కూచిపూడి నాట్య కళామండలి ఆధ్వర్యంలో కూచిపూడి సిద్ధేంద్ర యోగి నాట్య కళావేదికపై శనివారం నుంచి రెండు రోజులపాటు సిద్ధేంద్ర యోగి జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళామండలి కార్యదర్శి పసుమర్తి మృత్యుంజయశర్మ తెలిపారు. శని, ఆదివారాల్లో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలిరోజైన శనివారం అఖిలభారత కూచిపూడి నాట్య కళామండలి విద్యార్థులతో కూచిపూడి నాట్య ప్రదర్శన, అనంతరం విశాఖపట్నానికి చెందిన నాట్య సన్నిధాలయం విద్యార్థులతో కూచిపూడి నాట్యం, కూచిపూడి సంప్రదాయ భామాకలాప నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముగింపు రోజైన ఆదివారం నాద పద్మ, నందిపల్లి సాహితీల సోలో అభినయం, అనంతరం గోనుగుంట శైలశ్రీ బృందం, శ్రీ లలితా స్కూల్ ఆఫ్ డ్యాన్స్ విద్యార్థులతో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు మృత్యుంజయశర్మ తెలిపారు.

యూపీ నుంచి ఏపీ

(5వ పేజీ తరువాయి)

రెక్కీ నిర్వహించారు. ఇక్కడ చోరీకి స్కెచ్ వేసుకుని తిరిగి విజయవాడ నుంచి ఏలూరు వైపునకు వెళ్లిపోయారు.

ఇలా దొంగతనం చేశారు.. : ఈనెల ఐదో తేదీన ఏలూరు వైపు నుంచి నగరంలోకి ప్రవేశించారు. అర్ధరాత్రి 1-2 గంటల మధ్య గోడౌన్‌లో ఐఫోన్లు, ట్యాబ్‌లు, యూఎస్‌బీ కేబుల్, యాక్సరీస్, ఐప్యాడ్‌లు, లెనోవో ట్యాబ్‌లు కాజేశారు. ఆ తర్వాత వచ్చిన మార్గంలోనే వెళ్లిపోయారు.

పోలీసులు దొరికిపోయారు..: గోడౌన్ ఇన్‌చార్జి ఫరూక్ అహ్మద్ ఫిర్యాదును తీసుకున్న తర్వాత క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. క్రైమ్స్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి, డీసీపీ గౌతమీషాలి, ఏడీసీపీ ఎం.రాజారావు, ఇన్‌స్పెక్టర్లు వి.పవన్‌కిషోర్, రామ్‌కుమార్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గోడౌన్ నుంచి జాతీయ రహదారి వరకు ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను గురువారం తెల్లవారుజాము వరకు పరిశీలించారు. ఒక బృందం ప్రైవేట్ సీసీ కెమెరాల ఫుటేజీలను, ఒక బృందం ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్‌లో నుంచి ఫుటేజీలను పరిశీలించింది. టోల్‌ప్లాజాల వద్ద మరో బృందం సీసీ కెమెరాలను పరిశీలించింది. సుమారు 100కు పైగా సీసీ కెమెరాలను పరిశీలించి పోలీసులు నిందితులను గుర్తించారు. రాష్ట్రంలోకి ఏ మార్గంలో ప్రవేశించారో అదే మార్గంలో దాటేస్తున్నట్టు పోలీసులు భావించారు. పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు ఈ సమాచారాన్ని డీజీపీకి చేరవేశారు. నిందితులు బీహార్ వైపునకు పారిపోతున్నట్టుగా గుర్తించి సీపీ ఆ రాష్ట్ర పోలీసులతో సంప్రదించారు. నిందితులు ఉపయోగించిన కారు, వారి ఫొటోలను అక్కడి పోలీసులకు పంపారు. బీహార్ రాష్ట్రంలోకి ప్రవేశించే మార్గంలో ఉన్న జాతీయ రహదారిపై అక్కడి పోలీసులు యూపీ గ్యాంగ్‌ను పట్టుకున్నట్టు తెలిసింది.

శవ పంచాయితీ

(5వ పేజీ తరువాయి)

రాకపోవడంతో మృతదేహాన్ని మున్సిపాలిటీకి అప్పగించవచ్చని మాచవరం పోలీసులు నిరభ్యంతర ధ్రువీకరణపత్రం ఇచ్చారు. ఆసుపత్రి అధికారులు అనాథ శవాల్లో కొన్నింటిని మున్సిపాలిటీ సిబ్బందికి అప్పగిస్తారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న వైద్య కళాశాలలు వైద్య విద్యార్థులకు శరీరంలో భాగాలను చూపించి బోధన చేయడానికి ఇవ్వాలని ప్రభుత్వాసుపత్రులకు లేఖలు రాస్తాయి. వాటిని ఆసుపత్రి అధికారులు ప్రాధాన్యక్రమంలో పరిష్కరిస్తుంటారు. ఈవిధంగా శ్యామ్‌సన్ మృతదేహాన్ని తమిళనాడులోని ధనలక్ష్మి వైద్య కళాశాలకు విజయవాడ ప్రభుత్వాసుపత్రి అధికారులు నవంబరు 10వ తేదీన అప్పగించారు.

జనవరిలో డెత్ సర్టిఫికెట్

శ్యాంసన్‌ను ఆసుపత్రిలో చేర్పించిన కార్మికుడు జనవరిలో ఆయన కుటుంబ సభ్యులకు కనిపించాడు. ఆ సమయంలో ఆయన ఆచూకీ గురించి అడిగారు. రోడ్డుపై పడిపోయి ఉంటే ఆసుపత్రిలో చేర్పించానని చెప్పాడు. దీంతో వారు జనవరి 18వ తేదీన ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి సిబ్బంది ఫొటో చూపించి విచారించారు. దాన్ని చూసిన సిబ్బంది శ్యామ్‌సన్ చనిపోయాడని చెప్పారు. తర్వాత వారు ఆసుపత్రి అధికారులను ఆయన మరణ ధ్రువీకరణపత్రం ఇవ్వాలని అడిగారు. అధికారులు రికార్డులను పరిశీలించి శ్యామ్‌సన్ మరణ ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చారు. దాన్ని తీసుకుని వెళ్లిపోయిన కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. శ్యాంసన్ మృతదేహాన్ని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నష్టపరిహారం చెల్లించాలని పట్టుబట్టారు. తాము నిబంధనల ప్రకారమే మృతదేహాన్ని వైద్య కళాశాలకు ఇచ్చామని ఆసుపత్రి అధికారులు వారికి వివరించారు. కాసేపు ఆసుపత్రిలో నానా హడావిడి చేశారు. పోలీసులు, ఆసుపత్రి అధికారులు పరిస్థితిని వివరించడంతో శాంతించి ఇంటికి వెళ్లిపోయారు. కాగా, శ్యాంసన్ డెడ్‌బాడీని అప్పగించినప్పుడు సదరు వైద్య కళాశాల వారు రూ.లక్ష చెక్కు ఇవ్వగా, దానిని సిబ్బంది ఆసుపత్రి డెవలప్‌మెంట్ ఫండ్‌లో జమ చేశారు.



ఖురాన్ కంఠస్థ పోటీలు రేపు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశ నుంచే చిన్నారుల్లో నైతిక విలువలు పెంచేందుకు ఖురాన్ కంఠస్థ పోటీలను గత పదేళ్ల నుంచి ప్రతీ ఏడాది నిర్వహిస్తున్నామని యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ మొహమ్మద్ దావూద్ పేర్కొన్నారు. ఈ నెల 9న ఆటోనగర్‌లోని ఆటోమొబైల్ అసోసియేషన్ హాల్‌లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల పోస్టర్‌ను గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. షేక్ హస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక ఓటింగ్ జరిగేలా చూడాలి

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ



పటమట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థులకు అత్యధికంగా ఓటింగ్ చేయించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరి నియోజకవర్గ ఎమ్మెల్సీ పర్యవేక్షకుడు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళి ప్రత్యేకంగా ఉంటుందని ఓటర్లకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. తొలి ప్రాధాన్యత ఓటు సాధారణ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికల గల వ్యత్యాసాలు, పోలింగ్ అవలంబించే విషయాలను వివరించారు. పట్టభద్రులతో, ఉద్యోగులతో, మేధావులతో కలిసి చర్చించి కూటమి అభ్యర్థుల విజయానికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.

రోడ్డు వేశారు... స్పీడ్ బ్రేకర్ మరిచారు

ఈఎస్ఐ ఆసుపత్రి వద్ద మలుపుతో ప్రమాదాలు

ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గుణదల ఈఎస్ఐ ఆసుపత్రి వద్ద రోడ్డు వేశారు కానీ స్పీడ్ బ్రేకర్ మరిచారు. రహదారి దెబ్బతిందంటూ ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి ఎట్టకేలకు రోడ్డు వేశారు. అయితే ఇక్కడ స్పీడ్ బ్రేకర్ వేయడం మరిచిపోయారు. అసలే మలుపు కావడం అక్కడ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాక ఆసుపత్రికి వెళ్లి వచ్చే రోగులు అతివేగంగా వెళ్లే వాహనాలతో ప్రమాదాల బారిన పడే అవకాశాలు లేకపోలేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



స్పీడ్ బ్రేకర్ వేయాల్సిన ప్రదేశం

మౌలిక సదుపాయాల కల్పనలో శ్రద్ధ తీసుకోండి

అధికారులకు నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

వన్‌టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా మౌలిక సదుపాయాల కల్పన విషయంలో శ్రద్ధ తీసుకోవాలని విజయవాడ నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. 28వ డివిజన్ ఎన్‌టీఆర్ కాంప్లెక్స్ వద్ద యూరినల్స్‌ను తొలగించి మరుగుదొడ్లను నిర్మించాలని గతంలో తాను చేసిన ఆదేశాలను అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దసరా ఉత్సవాలు, భవానీదీక్షల విరమణల సమయంలో తరలి వచ్చే భక్తుల వినియోగం కోసం శాశ్వత మరుగుదొడ్లను నిర్మాణం చేయాలన్నారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను పంపాలన్నారు. నగరంలోని అన్ని బ్రిడ్జిలకు కంచెలు ఏర్పాటు చేయడంతో పాటు పెయింటింగ్‌లు వేయాలని సూచించారు. కృష్ణా- గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు, నాయకులకు చెందిన బ్యానర్లను, ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. సర్కిల్ -3 పరిధిలోని అమరజీవి పొట్టిశ్రీరాములు మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్ వద్ద ఉన్న అన్నక్యాంటీన్‌ను పరిశీలించారు. చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌ఛార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ సురేష్‌బాబు, ఎస్ఈలు పి.సత్యనారాయణ, పి.రత్నకుమారి, డిప్యూటీ సిటీప్లానర్ చంద్రబోస్, ఈఈ శ్రీనివాసరెడ్డి, సామ్రాజ్యం తదితరులు కమిషనర్ వెంట పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

దక్షిణ భారత జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్

విజేతలకు కలెక్టర్ అభినందన

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ భారత జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో జిల్లా తరఫున పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులను శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ అభినందించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోజరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను అభినందించారు. పుదుచ్చేరిలో జనవరి 20 నుంచి 25 వరకు జరిగిన దక్షిణ భారత జాతీయ స్థాయి సైన్స్ విజ్ఞాన ప్రదర్శనలో రెండు ప్రాజెక్టులు పాల్గొనగా రెండింటికీ అవార్డు రావడం పట్ల కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. మోడల్ స్కూల్ తరఫున (గంపలగూడెం మోడల్ స్కూల్ విద్యార్థి)రోలింగ్ రోబోతో సుదక్ష విజేతగా నిలవగా, జగ్గయ్యపేట జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ తరఫున పాల్గొన్న భార్గవ్, చైతన్య గ్రూపు వరదలలో వంతెనలు ఏ విధంగా నిర్మించుకోవాలి, వాహనాలను, ప్రజలను ఏ విధంగా రక్షించుకోవాలనే ప్రాజెక్టుతో విజేతలుగా నిలిచారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యూవీ సుబ్బారావు, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ షైనం హుస్సేన్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్ఎస్ఎంలో కిండర్ గార్డెన్ వార్షికోత్సవం

పటమట,ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్ఎస్ఎం స్కూల్ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం కిండర్ గార్డెన్ వార్షికోత్సవం జరిగింది. ముఖ్య అతిథి జాషువా (ఐపీఎస్) మాట్లాడుతూ పాఠశాలలు ఎల్లప్పుడు విద్యతో పాటు విద్యార్థుల అభివృద్ధికి తగిన బోధన ఉండాలన్నారు. ఏ అంశం పై విద్యార్థికి అభిరుచి కలిగి ఉందో దానికి అనుగుణంగా బోధిస్తే విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటు నందించిన వారవుతారన్నారు. అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ హారిక మాట్లాడుతూ ఉత్తమమైన సద్గుణాలను అలవర్చుకునేందుకు పాఠశాలలు సరైన వేదికలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మోంటీ, ప్రిన్సిపాల్ బ్రదర్ రాయప్ప రెడ్డి, బ్రదర్ బాలారెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ వేడుకల్లో హారిక, జాషువా

వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలను అందించండి

నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ

పటమట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పటమట రైతుబజారును శుక్రవారం నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ తన సతీమణి మైత్రేయి బేరీతో కలిసి సందర్శించారు. వినియోగదార్లకు నాణ్యమైన కూరగాయలను, ఆకుకూరలు అందించాలని కోరారు. మెరుగైన సేవలదించాలని రైతు బజారు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీవో శ్రీలత, డాట్నో మార్కెటింగ్ మంగమ్మ, ఏడీహెచ్ బాలాజీ, ఏడీఏ బి.వెంకటేశ్వరరావు, హెచ్‌వో బి.నీలిమా, ఎస్టేట్ అధికారి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మునక్కాయలు పరిశీలిస్తున్న నీతి ఆయోగ్ వైస్‌చైర్మన్ సుమన్ బేరీ

నగరంలో చిల్లపల్లీస్ వీవర్లీ ప్రారంభం

కృష్ణలంక, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : చేనేత పరిశ్రమలో ఐదు దశాబ్దాల అనుభవం, వారసత్వం ఉన్న సీఎంఆర్ హ్యాండ్లూమ్స్ వారి చిల్లపల్లీస్ వీవర్లీ విజయవాడ బృందావన్ కాలనీలోని ఏ కన్వెన్షన్ ఎదురుగా శుక్రవారం ప్రారంభమైంది. హైదరాబాద్ బ్రాంచితో కస్టమర్ల ఆదరణను అభిమానాన్ని సంపాదించిన చిల్లపల్లీస్ వీవర్లీ ఇప్పుడు విజయవాడకు తన ఉనికిని విస్తరించింది. షోరూంను ప్రఖ్యాత వాణిజ్యవేత్త పల్లూరు అశోక్‌బాబు ప్రారంభించగా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మొదటి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఎండీ చిల్లపల్లి నిరంజన్ మాట్లాడుతూ 50 ఏళ్ల మనవారసత్వం, అనుభవంతో ప్రజల ఆదరాభిమానాలను పొందిన విధంగా విజయవాడలోని వినియోగదారులకు కూడా చేరువ అవ్వాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నారు.



మేయర్ భాగ్యలక్ష్మికి మొదటి కొనుగోలును అందిస్తున్న ఎండీ చిల్లపల్లి నిరంజన్

మోసాలు చేయడంలో జగన్ బ్రాండ్ అంబాసిడర్

- పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కార్యదర్శి కొట్టేటి విమర్శ

వన్‌టౌన్,ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వైఎస్ జగన్మోహనరెడ్డి మోసాలు చేయడంలో, అబద్ధాలు చెప్పడంలో బ్రాండ్ అంబాసిడర్ అని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కార్యదర్శి కొట్టేటి హనుమంతరావు విమర్శించారు. గురునానక్ నగర్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రజలు జగన్ చేసే గోబెల్స్ ప్రచారాలను ఎవరూ నమ్మరన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై జగన్ ఆ పార్టీ నాయకులు విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబును విమర్శించే హక్కు ఏమాత్రం జగన్‌కు లేదన్నారు. మరో నాలుగున్నర సంవత్సరాల తరువాత జరిగే ఎన్నికలలో తాను గెలుస్తానని, మళ్లీ సీఎం అవుతాననే జగన పగటి కలలు ఏనాటికీ నిజం కావన్నారు. ఆయన వాస్తవాలు గ్రహించాలని సూచించారు. 2029 ఎన్నికల్లో రెండు సీట్లన్నా వస్తాయో రావోనని తెలిపారు.

చంద్రబాబు బీసీల పక్షమే

- అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్

వన్‌టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు నామినేటెడ్ పదవులలో 34 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి చేసిన నిర్ణయించడం చారిత్రాత్మకం, హర్షణీయమని ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ అన్నారు. గురునానక్ కాలనీలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు బీసీల పక్షపాతి అని, ఆయన తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. దీంతో బీసీలు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కాబోతున్నారని తెలిపారు. గతంలో చేసిన కులగణన వివరాలను చంద్రబాబు వెల్లడించాలన్నారు. బీసీలు తమకు కల్పిస్తున్న రుణ సౌకర్యాలను వినియోగించుకుంటూ అభివృద్ధి చెందాలని సూచించారు. త్వరలోనే ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో 140 కుల సంఘాల నాయకులందరూ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను కలవబోతున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా సీఎంఏ స్టూడెంట్స్ కన్వెన్షన్ - మయూఖ-2కే25

కృష్ణలంక, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా- విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో విజయవాడలోని శేషసాయి వేదికలో స్టేట్ లెవల్ సీఎంఏ స్టూడెంట్స్ కన్వెన్షన్ - మయూఖ-2కే25 శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రముఖ పాఠశాలలు, కళాశాలల నుంచి 2450కు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సీఎంఏ స్టూడెంట్స్ కన్వెన్షన్ ద్వారా విద్యార్థులు అందరు కామర్స్‌లో తమకు ఉన్న పట్టు, ప్రతిభ నిరూపించుకొన్నారు. క్విజ్, వ్యాసరచన, బాలన్స్ షీట్ ఎనాలిసిస్, స్టాక్ మార్కెటింగ్, డ్రాయింగ్, డాన్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ బిభూతి భూషణ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ టీసీఏ శ్రీనివాస ప్రసాద్, ముంబై, కోలకత్తా, చెన్నై, పూణే, బెంగళూరు, హైదరాబాద్ నుంచి కౌన్సిల్-రీజనల్ కౌన్సిల్ మెంబర్స్ హాజరయ్యారు. ఎక్స్ కౌన్సిల్ మెంబర్ సుంకర పాపారావు , సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ పి.వినయ రంజన్, విజయవాడ చాప్టర్ చైర్మన్ వి.సీతారామ స్వామి, సెక్రటరీ సుంకర నాగ పూర్ణిమ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ , డైరెక్టర్

ఎగ్జిబిట్ 2కే25లో పీబీ సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నలందా డిగ్రీ కళాశాలలో జరిగిన ఎగ్జిబిట్ 2కే25లో బహుమతులు సాధించిన విద్యార్థులను శుక్రవారం పీబీ సిద్ధార్థ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత ఆధారంగా నిర్వహించిన ఈ పోటీల్లో క్విజ్, పీపీటీలో మొదటి బహుమతి, ట్రెజర్ హంట్, ఐ ఆన్ ది బాటిల్, అంత్యాక్షరిలో రెండో బహుమతి సాధించారని చెప్పారు. డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యానికి ఇలాంటి పోటీలు వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు. గణితశాస్త్ర విభాగాధిపతి బీవీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపీలోనూ వర్గీకరణ చేపట్టాలి : పేరుపోగు


ధర్నాచౌక్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదింపజేసినందుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మార్పీఎస్ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఏపీలో కూడా వర్గీకరణ చేపట్టాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రలో ఎస్సీ వర్గీకరణ చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని కొనియాడారు. మంద కృష్ణమాదిగ ఎజెండా వర్గీకరణ కాదని ఆ విషయాన్ని మాదిగలు ఇప్పటికైనా గ్రహించి ఎమ్మార్పీఎస్ నుంచి అతన్ని బహిష్కరించాలన్నారు. గత 30 ఏళ్లగా వర్గీకరణ జరగకుండా రాజకీయ పార్టీలకు అమ్ముడు పోయాడని ధ్వజమెత్తారు. వర్గీకరణ జరగకుండా అడ్డుకోవడానికే రేవంత్‌రెడ్డిని విమర్శిస్తున్నారని ఆరోపించారు.

45శాతం రాయితీపై సీఎంకు ధన్యవాదాలు

లబ్బీపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇండస్ట్రీ పెట్టుబడి, రవాణా, లాజిస్టిక్స్ రాయితీని 45శాతం చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏపీ దళిత ఇండియన్ చాంబర్‌ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.రాజమణి అన్నారు. బందర్‌రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యుత్ రాయితీ 1.50పైసలు, జీఎస్టీ రాయితీ 5ఏళ్లు, ఇండస్ట్రీ పార్క్‌లో భూమి రాయితీ 75శాతం చేశారని ఇందుకు ముఖ్యమంత్రితో పాటు మంత్రులు టీజీ.భరత్, కొండపల్లి శ్రీనివాస్‌లకు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. రాయితీలు రావడానికి కృషి చేసిన దళిత ఎమ్మెల్యేలు కేంద్రు మురళీ మోహన్, తెనాలి శ్రావణ్‌కుమార్, బూర్ల ఆంజనేయులు, వర్ల కుమార్‌రాజా, విజయచంద్ర, కొలికిపూడి శ్రీనివాస్‌లకు ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. దళిత పారిశ్రామికవేత్తలకు విడిగా నిధులు విడుదల చేసినట్లైతే వారు ఇబ్బందుల నుంచి బయట పడతారని ప్రభుత్వం ఈ విధంగా చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ప్రసాద్, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

● ప్రేమ చిలుకలు





దొండ పండు లాంటి ముక్కుతో పచ్చని చిలుకలు రెండు గూట్లో గుసగుసలాడాయి. ఒకదానిపై మరొకటి ప్రేమను ఒలకపోస్తూ వయ్యారాలు పోయాయి. ఈ దృశ్యాలు విజయవాడ-అవనిగడ్డ కరకట్ట రోడ్డులో కనిపించాయి.
- ఆంధ్రజ్యోతి, విజయవాడ

జగన్ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదు

» కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. మచిలీపట్నం అప్సర హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడానికి ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మహిళలు ఉచిత బస్సు కోసం, విద్యార్థులు తల్లికి వందనం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఉద్యోగాల్లో, రాజకీయ పదవుల్లో ఎస్సీలకు రిజర్వేషన్‌లు ఎలా కల్పిస్తున్నారో అదే విధంగా బ్యాంకు రుణాల్లో కూడా అధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రుణాలు ఇవ్వాలన్నారు.

వీరమ్మ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు

» జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు



తిరునాళ్ల నిర్వహణపై మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గంగాధరరావు

ఉయ్యూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరులో వీరమ్మ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. శనివారం నుంచి 15 రోజులపాటు జరుగనున్న వీరమ్మ తిరునాళ్ల నేపథ్యంలో శుక్రవారం ఆయన ఉయ్యూరులో పర్యటించి ఏర్పాట్లు పరిశీలించారు. రావిచెట్టు సమీపంలోని ఆలయం వద్ద నుంచి తిరునాళ్లకు అమ్మవారు బయలుదేరే విధానం, ఆ సమయంలో భక్తులు ఎంతమంది వస్తారని ఆలయ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకుని పలుసూచనలు చేశారు. ఆలయం వద్ద బారికేడ్లు, బందోబస్తు ఏర్పాట్లపై సీఐ రామారావుకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గన్నవరం డీఎస్పీ సీహెచ్.శ్రీనివాసరావు, పట్టణ ఎస్సై విశ్వనాథ్, రూరల్ ఎస్సై సురేశ్‌బాబు పాల్గొన్నారు.

తుపాకీ పేలి వ్యక్తి గాయపడిన కేసు కొట్టివేత

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బస్టాండ్‌లోని మరుగుదొడ్డిలో తుపాకీ పేలి వ్యక్తి గాయపడిన కేసును కృష్ణాజిల్లా ఎనిమిదవ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.లక్ష్మి శుక్రవారం కొట్టివేశారు. వివరాల్లోకి వెళితే.. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన సుదర్శనం రవిదత్త అనే వ్యక్తి అదే ప్రాంతానికి చెందిన అపర్ణ అనే యువతిని ప్రేమించాడు. ఈ విషయం ఆమెకు చెప్పలేదు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు అనే వ్యక్తిని అపర్ణ వివాహం చేసుకుంది. తాను ప్రేమించిన యువతిని మరో వ్యక్తి వివాహం చేసుకోవడం తట్టుకోలేకపోయిన రవిదత్త ఇబ్రహీంపట్నానికి చెందిన చింతా సతీష్‌బాబు, డొక్కు పరమేష్, పీతా వెంకటేశ్వరరావుతో కలసి అపర్ణ భర్త శ్రీనివాసరావును చంపాలనుకున్నాడు. ఇందుకోసం తుపాకీ కొనుగోలు చేశాడు. 2014 మార్చి 11న తెల్లవారుజామున విజయవాడ బస్టాండులో టాయిలెట్‌కు వెళ్లిన సుదర్శనం రవిదత్త తన తుపాకీని కూడా వెంట తీసుకెళ్లాడు. అది అక్కడ మిస్‌ఫైర్ కావడంతో పక్క టాయిలెట్‌లో ఉన్న తూర్పు గోదావరి జిల్లా ఏలేశ్వరం మండలం ఎర్రవరం గ్రామానికి చెందిన నిమ్మల వీర వెంకట రమణకు బుల్లెట్ తగిలి రక్తస్రావం కావడంతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఆయన కోలుకున్నాడు. అక్రమంగా ఆయుధం కలిగి ఉండటం, అది మిస్‌ఫైర్ అయ్యి ఒకరు గాయపడటంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో 11 మంది సాక్షులను విచారించిన కృష్ణాజిల్లా ఎనిమిదవ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.లక్ష్మి తగిన సాక్ష్యాలు లేక పోవడంతో కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. నిందితుల పక్షాన న్యాయవాదులు లంకిశెట్టి బాలాజీ, పేర్ని నాగపవన్‌కుమార్ వాదించారు.

పదవులు కాపాడుకోవటానికే జగన్‌తో భేటీ

» 13వ డివిజన్ కార్పొరేటర్ ముమ్మనేని

కార్పొరేషన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్‌లు తమ పదవులు కాపాడుకోవడానికే జగన్ నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారని 13వ డివిజన్ కార్పొరేటర్ ముమ్మనేని వెంకట ప్రసాద్ విమర్శించారు. ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఒక గంట కూడా విజయవాడ అభివృద్ధిపై మేయర్, డిప్యూటీ మేయర్‌తో చర్చించలేదని, జగన్‌ను కలిసేందుకు కూడా కనీసం అవకాశం కల్పించలేదని పేర్కొన్నారు. నేడు రాష్ట్రంలో ఒక్కొక్క మున్సిపాలిటీ చేజారిపోవడంతో విజయవాడ పీఠం కాపాడుకోవడానికే జగన్ ఈ సమావేశం నిర్వహించారని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు చేపడుతున్న అభివృద్ధి చూసి వైసీపీ ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్‌లు క్యూ కడుతున్నారని పేర్కొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

కశింకోట (అనకాపల్లి జిల్లా), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కశింకోట పూసర్ల వీధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ రమణమ్మ కథనం ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన వేముల దుర్గాప్రసాద్ (25) అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మా సిటీలోని లారస్ ల్యాబ్స్‌లో రోజువారీ కార్మికునిగా పని చేస్తున్నాడు. మూడేళ్ల క్రితం కశింకోటకు చెందిన యమున దుర్గా మహేశ్వరిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ప్రస్తుతం రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. కాగా, సొంతూరులో సోదరుడితో కలిసి ఉమ్మడిగా ఇంటిని నిర్మించుకున్నాడు. ఈ క్రమంలో అప్పులు చేయాల్సి వచ్చింది. అప్పులు తీర్చలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న దుర్గాప్రసాద్ గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకుముందు సెల్ఫీ వీడియో తీసి కుటుంబ సభ్యులకు పంపాడు. మృతుని తల్లి వేముల అలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఆర్డీఏ భవనానికి జగన్ తెచ్చిన చిక్కులు

అమరావతిలో 2019లోనే తుది దశకు ఏడంతస్తుల బిల్డింగ్



సీఆర్డీఏ కార్యాలయం ముందు గుంతలు పూడ్చేందుకు తోలిన మట్టి

- అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు ఆపేసిన జగన్
- మాస్టర్ ప్లాన్ మార్చి 2023లో అడ్డదిడ్డంగా నిర్మాణాలు
- ఇప్పుడు తలనొప్పిగా మారిన ఆనాటి చర్యలు
- అస్తవ్యస్త నిర్మాణాలను సరిదిద్దడమే పెద్ద సవాల్
- ఇప్పటికే 5 కోట్ల ఖర్చు, నాలుగు నెలల సమయం వృథా
- భవనం నిర్మాణం పూర్తికి మరో నాలుగు నెలలు పట్టే అవకాశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విధ్వంసాలు అన్నీఇన్నీ కావు. అమరావతిపై ఆయన సాగించిన కక్షాపూరిత రాజకీయాలు నీడలా వెంటాడుతూనే ఉన్నాయి. రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్డీఏ) కార్యాలయం నిర్మాణంలో జాప్యానికి అధికారంలో ఉన్నప్పుడు ఆయన చేసిన చేష్టలే కారణం. రాజధాని నిర్మాణంలో సీఆర్డీఏది కీలకపాత్ర. నవ్యాంధ్ర రాజధాని నిర్మాణానికి సంబంధించిన విధి, విధానాలన్నీ అక్కడే ప్రాణం పోసుకుంటాయి. అలాంటి సంస్థకు రాజధాని అమరావతిలో ఇప్పటికీ కార్యాలయం లేదు. 2014-19 కాలంలోనే సీఆర్డీఏ కార్యాలయాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని భావించినా ఇప్పటి వరకూ ఆ కార్యాలయం అందుబాటులోకి రాలేదు. నాడు జగన్ చేసిన విధ్వంసం కారణంగానే సీఆర్డీఏ కార్యాలయ భవన నిర్మాణం అంతకంతకూ జాప్యమవుతోంది.

భవన నిర్మాణ ప్లాన్‌కు తూట్లు

సీఆర్డీఏను 2014 డిసెంబరు 30న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన రాయపూడిలో 3.62 ఎకరాల్లో ఏడు అంతస్తులు, 2.42 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ భవనాన్ని నిర్మించడానికి శ్రీకారం చుట్టారు. కార్యాలయం చుట్టూ 2.5 ఎకరాల్లో ఉద్యానవనం ఏర్పాటు చేయాలని భావించారు. 2017లో రూ. 160 కోట్ల అంచనాలతో పనులను నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చే నాటికి భవనం ఏడంతస్తులు స్లాబ్ వరకూ పూర్తయ్యాయి. ఫినిషింగ్, ఇంటీరియర్, విద్యుత్ పనులు మాత్రమే పెండింగులో ఉన్నాయి. మొత్తంగా 80 శాతం పూర్తయిన ఆ పనులను జగన్ సీఎంగా ప్రమాణం చేసిన వెంటనే ఆపేశారు. ఆ తరువాత కొన్నాళ్లకు ఆర్బీఐ కార్యాలయం ఏర్పాటుకు ఈ భవనాన్ని సూచించగా, ఆర్బీఐ దానికి ఓకే చెప్పలేదు. అయినా జగన్ కుట్రలు ఆగలేదు. బీసీ కార్పొరేషన్లకు కావాల్సిన కార్యాలయాలను ఏర్పాటు చేయడానికి ఈ భవనాన్ని వాడుకోవాలని భావించారు. సీఆర్డీఏ కార్యాలయ భవన నమూనాను మార్చి 2023 కొత్త నిర్మాణాలు చేపట్టారు. ఇప్పుడు ఆ నిర్మాణాలే తలనొప్పిగా మారాయి.

ప్లాన్‌ను సరిదిద్దలేక పాట్లు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు భవనాల పరిస్థితిని తెలుసుకోవడానికి రాజధానిలో పర్యటించారు. గతేడాది అక్టోబరు 20న ఆయన సీఆర్డీఏ భవన నిర్మాణాల పనులను తిరిగి ప్రారంభించి రెండు నెలల్లో అందుబాటులోకి వస్తుందని చెప్పారు. అయితే ఆ పనులు ముందుకు సాగకపోవడానికి జగన్ పాలనలో నిర్మించిన అస్తవ్యస్త నిర్మాణాలే కారణం. ఇప్పుడు ఆ నిర్మాణాలను తొలగించి, మాస్టర్ ప్లాన్ ప్రకారం రూపొందించిన నమూనాను తీసుకురావడమే సవాలుగా మారింది. కార్యాలయం చుట్టూ ఉన్న ప్రాంగణాన్ని శుభ్రం చేసి, అస్తవ్యస్త నిర్మాణాలను తొలగించడానికే నాలుగు నెలల సమయం పట్టింది.



నిర్మాణ సామగ్రి చేరవేస్తున్న కూలీలు

మరో నాలుగు నెలలు ఆగాల్సిందేనా?

రాజధానిలో సీఆర్డీఏ కార్యాలయం అందుబాటులోకి వస్తే నిర్మాణ పనులు మరింత వేగం పుంజుకుంటాయని భావించారు. ప్రస్తుతం విజయవాడ నుంచి పనులను పర్యవేక్షించాల్సి వస్తోంది. దీంతో నిర్ణయాలు, వాటి అమలులో తెలియకుండానే జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తక్షణం కార్యాలయం అందుబాటులోకి తీసుకురావాలని పనులు ప్రారంభించినా.. అనుకున్నంత వేగంగా జరగడం లేదు. ముందుగా వేసిన అంచనాలను మించి అదనంగా వ్యయం చేయాల్సి వస్తోంది. అస్తవ్యస్త నిర్మాణాల తొలగింపు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికే రూ. 5 కోట్లకు పైగా ఖర్చు అయిందని, ఇంకా ఖర్చు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు నిర్విరామంగా పనిచేసినా మరో నాలుగు నెలల వరకూ కార్యాలయం అందుబాటులోకి వచ్చే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు.

వినూత్న ఆలోచనలతో స్వచ్ఛమైన గాలినందిద్దాం

- సత్ఫలితాలనిస్తున్న పీసీబీ, వీఎంసీల విస్తృత కార్యక్రమాలు
- ఎలక్ట్రిక్, సోలార్ రిక్షాల వినియోగం దిశగా ప్రజలను ప్రోత్సహించాలి
- ఎన్‌సీఏపీ సమావేశంలో ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యాన చంద్ర, అసిస్టెంట్ కలెక్టర్ శుభంనోఖ్వాల్ తదితరులు


ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వినూత్న ఆలోచనలతో విజయవాడ నగర వాసులకు స్వచ్ఛమైన గాలినందిద్దామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జాతీయ శుద్ధ వాయు కార్యక్రమం (ఎన్‌సీఏపీ) అమలుపై సమీక్షించేందుకు విజయవాడ నగర ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్‌తో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. నగరంలో వాయు నాణ్యతను పెంచేందుకు చేపట్టిన కార్యక్రమాల అమలు, అవి ఇచ్చిన ఫలితాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణకు మార్గనిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ 2021-22 నుంచి 2025-26 మధ్య కాలంలో గాలిలో పీఎం 10 సూక్ష్మ ధూళికణాలను 20 నుంచి 30 శాతం మేర తగ్గించే లక్ష్యంతో ఎన్‌సీఏపీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కీలక భాగస్వామ్యంతో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన కార్యక్రమాలతో పీఎం 10 స్థాయి 61.8కి తగ్గిందన్నారు. ఇది 2021-22లో 67గా ఉండేదని తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ జంక్షన్ల వద్ద వాయు కాలుష్యాన్ని బాగా తగ్గించేందుకు చొరవ చూపాలన్నారు. బ్యాటరీ వాహనాలతో పాటు విద్యుత్, సోలార్ ఈ-రిక్షాలను ప్రోత్సహించాలని, ఇందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం కింద చేపట్టిన పనులను కూడా త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. హాట్‌స్పాట్‌లను గుర్తించి గాలి నాణ్యతను పెంచేలా విస్ట్ స్ప్రింక్లింగ్‌కు డ్రోన్‌లను ఉపయోగించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ లక్ష్మీశ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, విజయవాడ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, డీఎస్‌వో ఎ.పాపారావు, డీఏవో డీఎంఎఫ్ వి జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పెంచండి : కలెక్టర్

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అంతరాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పెంచాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్ఏ) సమావేశం జరిగింది. ప్రస్తుతం జిల్లాలోని రీచ్‌ల్లో తవ్వకాలకు అందుబాటులో ఉన్న ఇసుక, ఇప్పటి వరకు సరఫరా చేసిన ఇసుక, భవిష్యత్ కార్యకలాపాలు తదితరాలపై చర్చించారు. జిల్లాలోని 15 రీచ్‌ల్లో 11,06,400 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు సిద్ధంగా ఉందని మైన్స్ అండ్ జియాలజీ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో పర్యావరణ, ఇతర అనుమతుల ఆధారంగా తవ్వకాలు జరిగేలా, సరఫరాలో ఆటంకం లేకుండా చూడాలన్నారు. చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాల సంఖ్యను పెంచాలని, రెవెన్యూ, పోలీసు, మైన్స్ అండ్ జియాలజీ తదితర శాఖల అధికారులతో జాయింట్ టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. లోడింగ్ విషయంలో పరిమితి మించకుండా చూడాలని ఆదేశించారు. స్టాక్ పాయింట్ల వద్ద కార్యకలాపాలు పగటి సమయంలో మాత్రమే జరిగేలా చూడాలని వివరించారు.

అది మహానాడు రోడ్డే

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- వైసీపీ ప్రభుత్వంలో దేవినేని రాజశేఖర్ రోడ్డుగా పేరు మార్పు
- నాటి కౌన్సిల్ తీర్మానాన్ని రద్దు చేసిన కూటమి ప్రభుత్వం



మహానాడు రోడ్డు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బెజవాడలో చరిత్ర కలిగిన మహానాడు రోడ్డు వివాదానికి రాష్ట్ర ప్రభుత్వం బ్రేక్ వేసింది. మహానాడు రోడ్డు పేరును మార్చుతూ వైసీపీ ప్రభుత్వంలో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) కౌన్సిల్ చేసిన తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఇకపై మహానాడు రోడ్డుగానే పిలవాలని శుక్రవారం అధికారిక ఉత్తర్వులు ఇచ్చింది. గత మూడున్నరేళ్లుగా తలెత్తుతున్న వివాదానికి చెక్ పెట్టినట్లు అయింది. వివరాల్లోకి వెళితే.. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రాగానే ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి పేరు మార్చింది. ఆ వెంటనే వైసీపీ నాయకులు చరిత్ర కలిగిన మహానాడు రోడ్డు పేరును మార్చివేశారు. వైసీపీ నేత దేవినేని అవినాష్ ప్రోద్బలంతో ఆయన తండ్రి దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) రోడ్డుగా మార్చించారు. 2021, సెప్టెంబరు 30న కౌన్సిల్ సమావేశంలో మహానాడు రోడ్డును కాస్తా దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) రోడ్డుగా పేరు మార్చుతూ కౌన్సిల్ తీర్మానం చేశారు. దీనిపై కౌన్సిల్‌లో అప్పటి టీడీపీ కార్పొరేటర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ విజ్ఞప్తిని వినలేదు.

కమిషనర్‌కు గద్దె లేఖ

ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ వీఎంసీ కమిషనర్‌కు లేఖ రాశారు. ఎమ్మెల్యే లేఖపై స్పందించిన కమిషనర్ రికార్డులను పరిశీలించి పేరు మార్పుకు ఆదేశించారు. మహానాడు రోడ్డుగా మళ్లీ పేరు మార్చగానే.. వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ సూచనల మేరకు ముసునూరి సుబ్బారావు దీనిపై కోర్టులో కేసు వేశారు. దీనిపై న్యాయస్థానంలో విచారణ జరిగింది. కార్పొరేషన్ అధికారులకు పూర్తి సమాచారాన్ని తెలియజేయాల్సిందిగా ఆదేశించింది. ఆ తర్వాత పరిణామాలు వేగంగా జరిగిపోయాయి. మహానాడు రోడ్డు పేరుపై వైసీపీకి చెందిన వారు దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) రోడ్డుగా స్టిక్కర్ అంటించారు.

ప్రభుత్వానికి సమగ్ర నివేదిక

ఈ వివాదంపై ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మళ్లీ మునిసిపల్ కమిషనర్‌కు ఈ రోడ్డు చరిత్ర వివరిస్తూ లేఖ రాశారు. ఈ లేఖపై స్పందించిన కమిషనర్ పాత రికార్డులను పరిశీలించి, స్థానికుల అభిప్రాయాలను తెలుసుకుని సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. ఈ నివేదికను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం కౌన్సిల్ తీర్మానాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. కౌన్సిల్ తీర్మానాలు వివాదాస్పదంగా ఉన్నప్పుడు ఏపీ మునిసిపల్ కార్పొరేషన్ యాక్ట్ - 1955 ప్రకారం ఆ తీర్మానాన్ని రద్దు చేసే అధికారం ఉంటుంది. ఆ అధికారాన్ని ఉపయోగించి కౌన్సిల్ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది.

దుర్గమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ



దుర్గమ్మకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి జనార్దనరెడ్డి దంపతులు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి దంపతులు శుక్రవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయానికి విచ్చేసిన వీరికి ఆలయ డిప్యూటీ ఈవో రత్నరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను ఆలయ లాంఛనాలతో సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆశీర్వచన మండపంలో మంత్రి దంపతులకు వేద ఆశీస్సులు, శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

ముగిసిన శ్యామలా నవరాత్రులు

దేవస్థానంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న శ్యామల నవరాత్రి పూజలు ముగిశాయి. యాగశాలలో శాస్త్రోక్తంగా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. వేద స్వస్తి, శాంతి మంత్రాలను పఠించి పీఠానికి హారతులు సమర్పించారు. శ్యామలాదేవి అనుగ్రహం కోరుతూ పూజా సమర్పణ చేశారు. ఆలయ స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు. కాగా, ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. లక్ష కుంకుమార్చన, చండీ హోమం, నవావరణార్చనల్లో భక్తులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

విజయవాడ బకింగ్ హాంపేటకు చెందిన గోలి శ్రీనివాసరావు ఆలయంలో అన్నదానం నిమిత్తం లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. తొలుత అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు.

కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించండి

● ప్రభుత్వానికి కమర్షియల్ ట్యాక్స్ మాజీ జాయింట్ కమిషనర్ పుల్లా జకరయ్య విజ్ఞప్తి



ధర్నాచౌక్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): తన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న అంబాపురం సర్పంచ్, ఆయన అనుచరుల నుంచి తనకు రక్షణ కల్పించాలని కమర్షియల్ ట్యాక్స్ మాజీ జాయింట్ కమిషనర్ పుల్లా జకరయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. తన స్నేహితుడి భార్య వలసల సదనం నీరజతో కలిసి విశాఖపట్నం సీతమ్మధారకు చెందిన దాట్ల ఝాన్సీరాణి అనే ఆమె దగ్గర విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో 2,597.44 చ.గలు ఖాళీ నివేశనా స్థలాన్ని కొనుగోలు చేసి 2024న ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో గతేడాది ఆగస్టులో అంబాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ గండికోట సీతయ్య మా స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి ఫెన్సింగ్ వేసేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. దీనిపై 2024, ఆగస్టు 2న హైకోర్టులో కేసు వేయగా 2025, జనవరి 7న మాకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. మా స్థలం పక్కనే గ్రామ పంచాయతీకి చెందిన 2000 చదరపు గజాల ఖాళీ స్థలం ఉందని, ఆ స్థలంలో మా స్థలాన్ని కలుపుకునేందుకు సర్పంచ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు చూస్తున్నారని ఆరోపించారు. ఈ స్థలాన్ని పేదలకు ఇళ్ల స్థలాల కింద పంపిణీ చేస్తామని తప్పుడు వాగ్దానాలు చేసి రెచ్చగొడుతున్నారన్నారు. ఈ నెల 3న మా స్థలాన్ని శుభ్రం చేసుకుంటుండగా, సర్పంచ్ ప్రోద్బలంతో అతని అనుచరులు యడ్లపల్లి వసంత్ కుమార్, గండికోట గురవయ్య అనే వ్యక్తులు వచ్చి మాపై భౌతికదాడికి ప్రయత్నించారని ఆరోపించారు. ఈ స్థలం వదిలి వెళ్లిపోవాలని, లేదంటే మీ అంతు చూస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఈ నెల 4న రాత్రి సమయంలో సుమారు 20 మంది మద్యం తాగి వచ్చి మారణాయుధాలతో మా వాచ్‌మెన్ దొండపాటి దాసుపై దాడి చేశారని తెలిపారు. తనకు న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు విజ్ఞప్తి చేశారు.

వైఎస్ షర్మిలకు విమానాశ్రయంలో ఘనస్వాగతం

గన్నవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. బెంగళూరు నుంచి ఇండిగో విమానంలో గన్నవరం విమానాశ్రయానికి శుక్రవారం రాత్రి విచ్చేశారు. షర్మిలకు పలువురు కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన ఆమె నివాసానికి వెళ్లారు.

ఆవుల ఆకలి కేకలు

ఒంగోలు జాతికి శాపంగా వైసీపీ పాలన

- ప్రకాశం జిల్లా చదలవాడ పశుక్షేత్రంపై తీవ్ర నిర్లక్ష్యం
- పోషకాహారానికి నిధులు ఇవ్వని వైనం
- డొక్కలు ఎండి ఉసూరుమంటున్న పశువులు
- కూటమి ప్రభుత్వం దృష్టిసారిస్తే అత్యున్నత జాతి రక్షణ

(ఒంగోలు, ఆంధ్రజ్యోతి)

ఒంగోలు జాతి పశువుల అభివృద్ధి కోసం తొలుత ప్రకాశం జిల్లా చీమకుర్తి సమీపంలోని రామతీర్థం వద్ద పశుగణాభివృద్ధి క్షేత్రాన్ని రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. గెలాక్సీ గ్రానైట్ తవ్వకాలతో 1994-99 మధ్య అక్కడి పశు క్షేత్రం నెల్లూరు జిల్లా చింతలదీవికి తరలించే ప్రయత్నాలు జరిగాయి. దీన్ని అప్పటి జిల్లా టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఒంగోలు సమీపంలోని నాగులుప్పలపాడు మండలం చదలవాడ వద్ద 200 ఎకరాల దేవదాయ భూమిని కొనుగోలు చేసి 2000లో పశుక్షేత్రం ఏర్పాటు చేశారు. 18 ఎకరాల్లో షెడ్లు, నీటికుంటలు, వర్షాధార యూనిట్లు ఇతర భవనాలు నిర్మాణం చేయగా మిగతాది పశుగ్రాసానికి వాడుతున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం ఒంగోలు జాతి పశు సంపదకు శాపంగా మారింది. పశుక్షేత్రంలో సరైన పోషకాహారం లేక ఆవులు, కోడెలు ఆకలికేకలు పెడుతున్నాయి. కాస్తంత వయసు పైబడిన పశువులు అయితే ఎముకల గూళ్లుగా మారిపోయాయి. తక్షణం కూటమి ప్రభుత్వం పశుక్షేత్రంపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.



కోసిన జొన్న పంటను ముక్కలు చేసి వేసవిలో పశువులకు గడ్డివేసేలా స్థానికంగా నిల్వ చేస్తున్న దృశ్యం



చదలవాడ పశుక్షేత్రంలో డొక్కలు పీక్కుపోయి కనిపిస్తున్న ఆవులు

వేలం ద్వారా అమ్మకాలు

తొలినాళ్లలో ఇక్కడ పుట్టిన దూడలను ప్రతి ఏటా వేలం ద్వారా అమ్మేవారు. 2009-14 మధ్య అధికారుల నిర్లక్ష్యం, గుండ్లకమ్మ లిఫ్టు మరమ్మతులకు గురికావడం, ప్రాజెక్టు నిర్మాణం తర్వాత నదిలో నీటి ప్రవాహం తగ్గి గడ్డి దొరక్క పోవడం, వర్షాలు లేక పశుగ్రాస పంటలు పండక పోవడం.. వంటి ప్రతికూల పరిస్థితులతో పశువులు గడ్డు కాలం ఎదుర్కొన్నాయి. గత టీడీపీ ప్రభుత్వం పశుక్షేత్రంపై దృష్టిసారించింది. ఆనాటి కలెక్టర్ సుజాత శర్మ ఆ ప్రాంతంలో నీటి కుంటలు, పొలంలోకి వెళ్లే రోడ్లు ఇతర పనులు చేయించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద అప్పటి ప్రభుత్వం రూ.6 కోట్లు విడుదల చేయగా పశుక్షేత్రంలో షెడ్లు, రహదారులు ఇతర భవనాల నిర్మించారు.

గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం

వైసీపీ అధికారంలోకి వచ్చాక పశుక్షేత్రాన్ని గాలికి వదిలేసింది. ఏడాదికి కనీసం రూ.50 లక్షలు ఇచ్చిన పాపాన పోలేదు. తొలి ఏడాది రూ.31 లక్షలు ఇచ్చి తర్వాత ఏటా రూ.20 లక్షలు మాత్రమే కేటాయించింది. దీంతో సమీకృత దాణా కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు పశుక్షేత్రంలో దూడల కొనుగోలుకు డిమాండ్ తగ్గింది. అమ్ముడైన వాటికి కూడా సరైన ధర రాలేదు. గతంలో రూ.70 వేల నుంచి రూ.75 వేలు పలికిన కోడె దూడలు ఇప్పుడు అందులో నగం కూడా పలకడం లేదు. పెయ్య దూడలది అదే పరిస్థితి. దీంతో క్షేత్రంలో పశువుల సంఖ్య పెరిగిపోయింది. 200 పశువుల పోషణకు సౌకర్యాలు ఏర్పాటు చేయగా ప్రస్తుతం 345 ఉన్నాయి. పాలిచ్చే ఆవులు 77, ఏడాది నిండిన కోడెలు 57 ఉన్నాయి. ఇక ప్రతి పది పశువులకు సిబ్బంది ఒకరు ఉండాలి. ఆ ప్రకారం 35 మంది ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 11 మంది దీర్ఘకాలంగా టైం స్కేలుతో, 18 మంది ఆప్కాస్ ద్వారా తాత్కాలికంగా పనిచేసేవారు ఉన్నారు. ప్రస్తుతం పశుక్షేత్రంలో ఏడాదికి పశువుల అమ్మకం ద్వారా రూ. 10 లక్షలు, పాల విక్రయాల ద్వారా రూ. 10 లక్షల నుంచి రూ. 12 లక్షలు రాబడి ఉంటోంది. అయితే ప్రస్తుతం పశుక్షేత్రం అభివృద్ధి, మేతకు ఏడాదికి రూ. కోటి అవసరం అవుతోంది.



ఉన్న వనరులతో వీలైనంత మెరుగ్గా పశుక్షేత్రం ఉండేలా ప్రయత్నిస్తున్నాం. పశుపోషణలో సమీకృత దాణా అత్యంత ప్రధానమైనది. కనీసం రూ. 50 లక్షలు ఏడాదికి అవసరమవుతాయి. ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఖర్చులు తగ్గించుకునే కార్యక్రమాలు చేస్తున్నాం. మొత్తం పశుక్షేత్రం అభివృద్ధి, సౌకర్యాల పెంపునకు రూ. 84 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించాం. ఆవుల ఉత్పత్తిని మరింత పెంచి జిల్లాలో పాడిపై ఆధారపడిన కుటుంబాల్లోని స్వయం సహాయక మహిళలకు ఇస్తాం. తద్వారా వారికి ఉపాధి, పాల ఉత్పత్తి పెంపునకు అవకాశం ఉంటుంది.

84 కోట్లతో ప్రతిపాదనలు

- బి. రవి, పశుసంవర్ధకశాఖ డీడీ, క్షేత్ర పర్యవేక్షకులు

ఇంటిలో గుట్టు తేల్చండి

- ప్రతి నవరత్న లబ్ధిదారుడి డేటా తనిఖీ
- పరిశీలనకు ప్రత్యేకంగా మొబైల్ యాప్
- కలెక్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణ
- స్పెషల్ డ్రైవ్‌కు రెవెన్యూ శాఖ ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల (ఎన్‌పీఐ) పథకం కింద లబ్ధిపొందిన వారెవరు? వారంతా నిజమైన పేదలేనా? లేక వైసీపీ కార్యకర్తలు ఇళ్ల పట్టాలు పొందారా? నిజమైన పేదలకే ఇళ్ల స్థలాలు మంజూరయితే ఇప్పటిదాకా 9 లక్షల మంది ఎందుకు పట్టాలు తీసుకోలేదు? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికేందుకు కూటమి సర్కారు సిద్ధమైంది. జగన్ సర్కారు 32 లక్షల మంది పేదలకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చామని గొప్పలు చెప్పగా, అందులో 9 లక్షల మంది పట్టాలే తీసుకోలేదు. ఈ నేపథ్యంలో ఆ 9 లక్షల మంది ఎవరు? పట్టాలు తీసుకున్న వారిలో అర్హులు ఎవరు? అనర్హులు ఎవరు? అన్నది నిగ్గు తేల్చేందుకు రెవెన్యూ శాఖ ప్రత్యేక డ్రైవ్ కింద పునఃపరిశీలన ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేసింది. 18 రకాల ప్రశ్నలు, వాటి అనుబంధ సమాచారంతో అసలైన లబ్ధిదారులు ఎవరో నిర్ధారించేందుకు మొబైల్ యాప్‌ను తయారు చేసింది. సోమవారం నుంచి ఆ యాప్‌తో లబ్ధిదారుల పునఃపరిశీలన కార్యక్రమం చేపట్టనుంది. జిల్లా కలెక్టర్‌లు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మి ఆదేశించారు.

జగన్ సర్కారు నవరత్నాలు కింద పేదలందరికీ ఇళ్లు పథకం కోసం రూ.18 వేల కోట్లు వ్యయం చేసింది. ప్రైవేటు భూమి 28 వేల ఎకరాలు సేకరించింది. తొండలు గుడ్లు పెట్టని భూములను కూడా అధిక ధరకు కొని పేదలకు ఇళ్ల స్థలాలుగా మార్చేసింది. భూసేకరణే పెద్ద కుంభకోణం అయితే.. ఇళ్ల స్థలాల లబ్ధిదారుల ఎంపిక మరో దారుణం. వైసీపీ నేతలు, కార్యకర్తలు, వారి అనుచరుల పేరిట భారీగా ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు ఆధారాలు వెలుగుచూశాయి. అధికారికంగా 9 లక్షల మంది పేదలు లబ్ధిదారులుగా ఎంపికయినా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి పట్టాలు తీసుకోలేదు. కానీ జగన్ సర్కారు మాత్రం 32 లక్షల మందికి పట్టాలు ఇచ్చామని, కాలనీలు కాదు ఏకంగా ఊర్లే నిర్మిస్తున్నామని గొప్పలు చెప్పింది. క్షేత్రస్థాయి పరిస్థితులు జగన్ చెప్పిన దానికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ఇప్పటికీ పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలు ఎక్కడున్నాయో తెలియదు. పట్టాలున్నవారు తీసుకోవడం లేదు. దీంతో ఈ పథకంలో భారీ గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలు వస్తున్నాయి.

తహసీల్దార్లతో విచారణ బృందాలు

గ్రామం, వార్డుల వారీగా లబ్ధిదారుల జాబితాను పునఃపరిశీలన చేయనున్నారు. రెవెన్యూ శాఖ తయారు చేసిన మొబైల్ యాప్ ద్వారా.. ఇళ్ల స్థలాలు పొందినవారు నిజమైన లబ్ధిదారులా? లేక రాజకీయ కార్యకర్తలా? వారికి ఇంతకుముందే ఇళ్ల స్థలాలు ఇచ్చారా? సొంత ఇల్లు ఉన్నా ప్రభుత్వం స్థలం తీసుకున్నారా? వంటి కీలకమైన సమాచారం రాబట్టబోతున్నారు. ఇందుకోసం తహసీల్దార్ల నేతృత్వంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని సీసీఎల్‌ఏ జయలక్ష్మి జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. విచారణ బృందంలో తహసీల్దార్, ఆర్‌ఐ, వీఆర్‌ఓ, సర్వేయర్‌లు సభ్యులుగా ఉండాలని సూచించారు. విచారణ అనంతరం డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు పక్షం రోజుల్లో లబ్ధిదారుల పునఃపరిశీలన ప్రక్రియను పూర్తిచేయాలని సీసీఎల్‌ఏ ఆదేశించారు.

అన్ని బిల్లుల్నీ ఆమోదించాల్సిన అవసరం లేదు

- సుప్రీంకోర్టులో తమిళనాడు గవర్నర్ వివరణ
- మూడేళ్ల నుంచి బిల్లుల్నీ ఆమోదించరా?
- గవర్నర్‌పై సుప్రీంకోర్టు అసహనం

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ రూపొందించే అన్ని బిల్లుల్ని ఆమోదించాల్సిన అవసరం లేదని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి సుప్రీంకోర్టుకు వివరించారు. తమిళనాడు అసెంబ్లీ రూపొందించిన బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలుపకుండా బుట్టదాఖలు చేస్తున్నారని, తమిళనాడులోని మూడు విశ్వవిద్యాలయాలకు ఉప కులపతుల నియామకంలో గవర్నర్ జోక్యం అధికమైందంటూ సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్లను న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గత మంగళ, గురువారాల్లో విచారణ చేపట్టడంతో పాటు ప్రభుత్వ ఆరోపణలపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని గవర్నర్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం మళ్లీ ధర్మాసనం ముందు ఈ పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అసెంబ్లీ రూపొందించే అన్ని బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపాల్సిన అవసరం లేదన్నారు. గవర్నర్‌కు నాలుగు ముఖ్యమైన అధికారాలున్నాయని.., బిల్లులకు ఆమోదం, నిలిపివేయడం, తిరిగి పంపించడం, అసంతృప్తి తెలియజేయవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వ బిల్లుల్లో ఇరుపక్షాలకు అనుకూలమైన ప్రతిపాదనలు చేర్చడంపై గవర్నర్ పరిశీలన జరుపుతున్నారని, బిల్లులు ఆమోదం పొందకపోతే, ప్రభుత్వం- గవర్నర్ కలసి నిర్ణయం తీసుకొనేందుకు అనువుగా రాష్ట్రపతి పరిశీలనకు పంపవచ్చని వివరించారు. అంతేగాక ఆ బిల్లులపై నిర్ణయం కోసం రాష్ట్రపతికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వమే గవర్నర్‌ను కోరవచ్చని, ఈ వ్యవహారాన్ని రాష్ట్ర హక్కులను హరించినట్టు భావించకూడదన్నారు.

ప్రభుత్వ పాలనకు అడ్డంకి కారాదు: సుప్రీంకోర్టు

విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. ఎలాంటి వివరణ ఇవ్వకుండా బిల్లును తిప్పి పంపితే, ఆయన మనసులో ఏముందో ప్రభుత్వానికి ఎలా తెలుస్తుందని నిలదీసింది. 2023లో బిల్లులు రాష్ట్రపతి పరిశీలనకు పంపినప్పటి నుంచి ఇప్పటివరకు గవర్నర్ ఏమేం చర్యలు తీసుకున్నారో చెప్పాలని, మూడేళ్లుగా బిల్లుల్ని ఎలా పెండింగ్‌లో ఉంచుతారని ప్రశ్నించింది. బిల్లులు కేంద్ర చట్టాలకు వ్యతిరేకంగా ఉంటే, తదుపరి చేపట్టాల్సిన చర్యలేంటో చెప్పాలని కేంద్రాన్ని ఆదేశించింది. గవర్నర్ ప్రభుత్వ పాలనకు అడ్డంకి కారాదని స్పష్టం చేస్తూ.. విచారణను 10కి వాయిదా వేసింది.

స్పేస్ డిజైన్ కాంటెస్ట్‌లో నారాయణ విద్యార్థుల సత్తా

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'లివ్ ఇన్ ఏ హెల్తీ స్పేస్ డిజైన్ కాంటెస్ట్-2024'లో తమ విద్యార్థులు సత్తా చాటారని నారాయణ గ్రూప్ తెలిపింది. వరల్డ్ నెంబర్-1 స్థానంలో 4, వరల్డ్ నెంబర్-2 స్థానంలో 13, వరల్డ్ నెంబర్-3 స్థానంలో 9 సెలక్షన్స్‌తో పాటు మొత్తం 32 బహుమతులను గెలుపొందారని నారాయణ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, శరణి నారాయణ శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. నేషనల్ స్పేస్ సొసైటీ నిర్వహించిన ఈ పోటీలో వివిధ దేశాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారని వారు చెప్పారు. పోటీ పరీక్షల కోసం తాము ప్రత్యేక ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేస్తున్నామని, దీంతో విద్యార్థులు అన్ని రంగాల్లో సత్తా చాటుతున్నారని పేర్కొన్నారు. ప్రాథమిక దశ నుంచే శాస్త్ర, సాంకేతిక అంశాలపై పరిజ్ఞానంతో పాటు నూతన ఆవిష్కరణలు కనుగొనే దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

పశువ్యాధి నిర్ధారణ పరికరాలకు టెండర్లు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి పశువైద్య సంస్థలకు వ్యాధి నిర్ధారణ పరికరాలను సరఫరా చేసే ఏజెన్సీని ఎంపిక చేయడానికి ఈ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా టెండర్లను ఆహ్వానించడానికి పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రివర్స్ టెండరింగ్ వ్యవస్థ లేకుండా కొత్త మార్గదర్శకాల ప్రకారం నిబంధనలు, షరతులు, పరికరాల నిర్దిష్టతలతో కూడిన టెండర్ పత్రాన్ని విడుదల చేసింది. పశువుల టీకా ఉపకరణాల సేకరణలో భాగంగా 60% కేంద్రం వాటా, 40% రాష్ట్రవాటాతో వ్యాధి నిర్ధారణ పరికరాల కొనుగోలుకు 2024-25 బడ్జెట్‌లో కేటాయించిన నిధులను కేటాయించారు.

చిత్రజ్యోతి

SINCE 1965



ప్రధాని మోదీతో అక్కినేని కుటుంబ సభ్యులు సుశీల, నాగార్జున సతీమణి అమల, కుమారుడు నాగచైతన్య, శోభిత తదితరులు

అక్కినేని తరతరాలకు గుర్తుండిపోయే నటుడు

- ప్రధాని నరేంద్ర మోదీ

ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు జీవితం కొన్ని తరాల పాటు ప్రజలు, సినీ కళాకారులు, నిర్మాతలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. శుక్రవారం అక్కినేని నాగార్జున తన తండ్రిపై మాజీ పార్లమెంట్ సభ్యుడు, ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రచించిన పుస్తకాన్ని మోదీకి బహూకరించారు. అక్కినేని జయంతి సందర్భంగా 'మహాన్ అభినేత అక్కినేని కా విరాట్ వ్యక్తిత్వ' అనే పుస్తకాన్ని లక్ష్మీప్రసాద్ రచించారు. ఈ సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు కుటుంబ సభ్యులందరినీ మోదీ కలుసుకున్నారు. ఆయన కుమార్తె సుశీల, నాగార్జున సతీమణి అమల, కుమారుడు నాగచైతన్య, శోభిత దంపతులు మోదీని కలిసిన వారిలో ఉన్నారు. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అక్కినేనిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్టాంపు ముద్రిస్తుందని మోదీ ప్రకటించారు. తన మన్ కీ బాత్ 117వ ఎపిసోడ్ లో అక్కినేని సేవలను స్మరించిన విషయాన్ని మోదీ గుర్తు చేశారు. సినిమా రంగంతోపాటు విద్య, సాహిత్యం, సామాజికసేవా రంగాల్లో అక్కినేని కృషి ఎనలేనిదని ఆయన ఒక నటుడి కంటే ఒక సంస్థ లాంటి వాడని మోదీ కొనియాడారు. త్వరలో ఢిల్లీలో నిర్వహించే ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్ టైన్ మెంట్ సమ్మిట్‌లో పాల్గొనవలసిందిగా నాగార్జునను ఆహ్వానించారు. నాగ చైతన్య మోదీతో మాట్లాడుతూ.. శుక్రవారం విడుదలైన తండేల్ సినిమాలో పాకిస్థాన్‌లో చిక్కుకున్న శ్రీకాకుళం మత్స్యకారులను అప్పటి విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ విడిపించేందుకు నిర్వహించిన పాత్రను దృశ్యీకరించామని చెప్పినప్పుడు తాను ఈ సినిమా తప్పకుండా చూస్తానని మోదీ ఆయనకు తెలిపారు.

న్యూఢిల్లీ, (ఆంధ్రజ్యోతి)

ప్రేక్షకులకు కృతజ్ఞతలు

నాగ చైతన్య

నాగ చైతన్య, సాయి పల్లవి నటించిన చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మించారు. శుక్రవారం విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకాదరణతో విజయవంతంగా రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హీరో నాగ చైతన్య మాట్లాడుతూ 'గొప్ప విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. వారి ఆదరణ చాలా ఆనందాన్ని ఇచ్చింది' అని అన్నారు. నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ 'ఈ రోజు నుంచి పండగ మొదలవుతుంది. ఆదరించిన వారందరికీ కృతజ్ఞతలు. చిత్రాన్ని మరో లెవలికి తీసుకెళ్లిన మీడియాకు ధన్యవాదాలు' అని అన్నారు. నిర్మాత బన్నీవాసు మాట్లాడుతూ ' ఈ కథ వెనుక చాలా మంది ఉన్నారు. వారందరికీ ఒక సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేస్తాం' అని చెప్పారు. సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ మాట్లాడుతూ 'మంచి చిత్రానికి సంగీతం అందించినందుకు చాలా ఆనందంగా ఉంది. సాయి పల్లవి అద్భుతంగా నటించారు' అని ప్రశంసించారు.





నా బాధ్యతను మరింత పెంచింది

నందమూరి బాలకృష్ణ

'పద్మభూషణ్ పురస్కారం లభించడం నా బాధ్యతను మరింత పెంచిది. నాకూ, మా కుటుంబానికి మాత్రమే కాదు యావత్ తెలుగు సినీ పరిశ్రమకు దక్కిన గౌరవమిది' అని టాలీవుడ్ కథానాయకుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయనకు భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం ప్రకటించిన నేపథ్యంలో పలువురు తెలుగు సినీ ప్రముఖులు శుక్రవారం నందమూరి బాలకృష్ణను ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. టీఎఫ్‌సీసీ (తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్) అధ్యక్షుడు పి. భరత్‌భూషణ్, కోశాధికారి తుమ్మల ప్రసన్నకుమార్, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షుడు కేఎల్ దామోదర్ ప్రసాద్ సహా ఇండస్ట్రీకి చెందిన పలు అసోషియేషన్లు, సంఘాల ప్రతినిధులు బాలకృష్ణకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. 'సినీ, సేవారంగంలో నందమూరి బాలకృష్ణ చేసిన కృషికి గుర్తింపుగా పద్మభూషణ్ పురస్కారం దక్కడం గర్వించదగిన విషయం, త్వరలో చిత్ర పరిశ్రమ తరఫున నందమూరి బాలకృష్ణను ఘనంగా సన్మానించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాం' అని వారు తెలిపారు.



శివరాత్రికి మజాకా

సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మజాకా'. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. మన్మథుడు ఫేమ్ అన్షు, రావు రమేశ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. శుక్రవారం చిత్రబృందం విడుదల తేదీని ఖరారు చేసింది. శివరాత్రి సందర్భంగా ఈనెల 26న విడుదల చేస్తున్నట్టు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో సందీప్ కిషన్, రీతూవర్మ స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ప్రసన్నకుమార్ కథ, సంభాషణలు అందిస్తున్న ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీత సారథ్యం వహిస్తున్నారు.

ఇద్దరమ్మాయిలతో ప్రేమకథ

తనదైన నటనతో ఇంటిల్లిపాదిని ఆకట్టుకుని ప్రేక్షక హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నాడు యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ. శుక్రవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా సిద్ధు కథానాయకుడిగా నటిస్తున్న 'తెలుసుకదా' చిత్రం నుంచి యూనిట్ కొత్త పోస్టర్స్‌ను



విడుదల చేసింది. ఇద్దరు అమ్మాయిలతో హీరో ప్రేమకథ నేపథ్యంలో సాగే చిత్రమిది. రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. ఒక పోస్టర్‌లో సిద్ధు, కథానాయిక శ్రీనిధి శెట్టి మంచి రొమాంటిక్ మూడ్‌లో కనిపించగా, మరో పోస్టర్‌లో రాశీ ఖన్నా నుదుటిపై సిద్ధు ముద్దాడుతూ కనిపించారు. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. వైవా హర్ష కీలక పాత్ర పోషిస్తున్నారు. థమన్ ఎస్. సంగీతం అందిస్తున్నాడు. సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్ బాబా, ఎడిటర్: నవీన్ నూలి

దర్శకుడిగా ఎన్. శంకర్ తనయుడు



శ్రీరాములయ్య, ఎన్‌కౌంటర్ లాంటి పలు హిట్ చిత్రాలను అందించి ప్రేక్షకులను మెప్పించారు దర్శకుడు ఎన్ శంకర్. ఇప్పుడు ఆయన తనయుడు దినేష్ మహేంద్ర కూడా తండ్రిబాటలోనే నడుస్తూ దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. తొలిసారి ఆయన దర్శకత్వంలో ఓ రొమాంటిక్ ఫీల్ గుడ్ మూవీ రూపుదిద్దుకోనుంది. పూర్తిగా కొత్త నటులు, సాంకేతిక నిపుణులతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు నిర్మాణ సంస్థ ఆరెక్స్ క్రియేషన్స్ తెలిపింది. ఏప్రిల్‌లో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. ప్రస్తుతం పాటల రికార్డింగ్ జరుగుతోంది. మరిన్ని వివరాలు త్వరలోతెలియజేస్తామని నిర్మాణ సంస్థ తెలిపింది.

మరోసారి 'జురాసిక్ పార్క్'

వేల సంవత్సరాల క్రితం అంతరించిపోయిన డైనోసార్స్ తిరిగి భూమ్మీదకు వస్తే ఎలా ఉంటుందనే కాన్సెప్ట్‌తో తెరకెక్కిన సైన్స్ ఫిక్షన్ ఫాంటసీ చిత్రం 'జురాసిక్ పార్క్'. 1993లో స్పీల్ బర్గ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. ప్రపంచ వ్యాప్తంగా వసూళ్ల సునామీని సృష్టించింది. ఆ తరవాత 'జురాసిక్ పార్క్' ఫ్రాంచైజీలో వచ్చిన సినిమాలు పెద్దగా ఆకట్టుకోలేదు. అయితే చివరి సారిగా 2022లో వచ్చిన 'జురాసిక్ వరల్డ్ డొమినియన్' పర్వాలేదనిపించింది. ఇప్పుడు ఈ మూవీకి సీక్వెల్‌గా వస్తున్న సినిమానే 'జురాసిక్ వరల్డ్ రీ బర్త్'. 'జురాసిక్ పార్క్' ఫ్రాంచైజీలో గరేత్ ఎడ్వర్డ్స్ దర్శకత్వంలో 7వ సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఒక పరిశోధన బృందం తమ అన్వేషణలో భాగంగా జురాసిక్ పార్క్ ఉన్న ఐలాండ్‌కు వెళ్తుంది. డైనోసార్స్ నుంచి డీఎన్‌ఏను సేకరించే క్రమంలో ఎలాంటి ప్రమాదాలు ఎదురయ్యాయి, వాటి బారినుంచి పరిశోధన బృందం తప్పించుకుందా లేదా అనేదాన్ని ట్రైలర్‌లో చూపించారు. ఈ చిత్రం జూలై 2న ఇంగ్లీష్, తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ విడుదల కానుంది.



అందుకే హ్యాపీగా ఉన్నా

శివ కార్తికేయన్



'అమరన్' సినిమాతో ఘన విజయాన్ని అందుకొన్నారు కోలీవుడ్ హీరో శివకార్తికేయన్. ఈ చిత్రం మూడు వందల కోట్ల రూపాయలు వసూళ్లు చేసి శివకార్తికేయన్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచింది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సాయిపల్లవి కథానాయికగా నటించారు. కమల్ హాసన్ నిర్మించారు. ఈ చిత్రం తెలుగులో కూడా విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. అయితే తాజాగా శివకార్తికేయన్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్, అనవసరమైన విషయాలు పట్టించుకొని బాధపడటం నాకిష్టం లేదు. అందుకే రెండేళ్లుగా వాటికి దూరంగా ఉన్నా. అప్పటినుంచి ఎంతో హ్యాపీగా ఉన్నా' అని తెలిపారు. కాగా, ప్రస్తుతం శివకార్తికేయన్ 'పరాశక్తి' అనే బయోపిక్‌లో నటిస్తున్నారు.

మురిపించని తగ్గింపు
సెన్సెక్స్ 198 పాయింట్లు డౌన్

ముంబై: సుదీర్ఘ విరామం అనంతరం ఆర్‌బీఐ రెపో రేటును పావు శాతం తగ్గించినప్పటికీ ఇన్వెస్టర్లు అంతగా మురిసిపోలేదు. బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ, పవర్ రంగాల షేర్లలో లాభాల స్వీకారానికి విదేశీ నిధుల తరలింపు జోడు కావడంతో తీవ్ర ఆటుపోట్లకు లోనైన ఈక్విటీ మార్కెట్ వరుసగా మూడో రోజు కూడా నష్టాల్లో ముగిసింది. శుక్రవారం ఇంట్రాడేలో 582.42 పాయింట్లు నష్టపోయి 77,475.74 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసిన సెన్సెక్స్ చివరికి నష్టాన్ని 197.97 పాయింట్లకు కుదించుకుని 77,860.19 వద్ద ముగిసింది. నిఫ్టీ 43.40 పాయింట్ల నష్టంతో 23,559.95 వద్ద క్లోజైంది.

ఎల్ఐసీ లాభం రూ.11,056 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) డిసెంబరుతో ముగిసిన తృతీయ త్రైమాసికంలో రూ.11,056 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.9,444 కోట్లు)తో పోల్చితే లాభం 17 శాతం వృద్ధి చెందింది. డిసెంబరు త్రైమాసికంలో వ్యయ నిష్పత్తి తగ్గటం ఎంతగానో కలిసి వచ్చిందని ఎల్ఐసీ పేర్కొంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో నికర ప్రీమియం ఆదాయం రూ.1,17,017 కోట్ల నుంచి రూ.1,06,891 కోట్లకు తగ్గింది. మరోవైపు మొత్తం ఆదాయం కూడా రూ.2,12,447 కోట్ల నుంచి రూ.2,01,994 కోట్లకు తగ్గింది. ఈ కాలంలో వ్యయాలు రూ.18,194 కోట్ల నుంచి రూ.14,416 కోట్లకు తగ్గాయి. వినియోగదారుల అవసరాలకు తగ్గట్టుగా ఉత్పత్తుల్లో మార్పులు చేయటంతో పాటు వ్యూహాత్మకంగా వ్యవహరించటం ఎంతగానో కలిసివచ్చిందని ఎల్ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి తెలిపారు.

24% తగ్గిన నవ లిమిటెడ్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నవ లిమిటెడ్ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 24 శాతం క్షీణించి రూ.353.30 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.465 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా 11.7 శాతం తగ్గి రూ.995 కోట్ల నుంచి రూ.878.10 కోట్లకు చేరుకుంది. త్రైమాసిక కాలంలో మాంబా ఎనర్జీ రూ.546.80 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.291.30 కోట్ల లాభాన్ని ఆర్జించింది. కాగా స్టాండ్అలోన్ ప్రాతిపదికన కంపెనీ రూ.295.8 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.47.4 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	475
వరంగల్	442	గోదావరి	443
చిత్తూరు	493	విశాఖపట్నం	455
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	93	విజయవాడ	109
వరంగల్	93	గుంటూరు	104
కరీంనగర్	93	ఒంగోలు	104
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	86
కర్నూలు	93	నెల్లూరు	91
విశాఖపట్నం	101	అనంతపురం	91
గోదావరి	109		


బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,550 ▲	79,350 ▲	1,07,000 ▲
విజయవాడ	87,500 ▲	80,500 ▼	97,500 ▼
విశాఖపట్నం	84,710 ▲	77,650 ▼	96,020 ▲
రాజమండ్రి	86,510 ▲	79,300 ▲	98,800 ▼
ప్రొద్దుటూరు	86,200 ▲	79,820 ▼	96,500 ▲
ముంబై	84,699 ▲	77,584 ▲	95,391 ▲

రుణగ్రహీతలకు రిలీఫ్

ఐదేళ్ల తర్వాత తొలిసారిగా కీలక వడ్డీ రేటు 0.25% తగ్గింపు



తగ్గనున్న గృహ, వాహన, వ్యక్తిగత రుణాల వడ్డీ రేట్లు ● ఈఎంఐల భారం కూడా..

- 6.25 శాతానికి తగ్గిన రెపో రేటు
- 2025-26 వృద్ధి అంచనా 6.7 శాతం
- ద్రవ్యోల్బణం 4.2 శాతానికి తగ్గొచ్చు..
- ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్ష నిర్ణయాలను ప్రకటించిన ఆర్‌బీఐ
- ఏప్రిల్ 7-9 తేదీల్లో తదుపరి సమీక్ష

ముంబై: రుణగ్రహీతలకు శుభవార్త. గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లతో పాటు ఇప్పటికే తీసుకున్న రెపో ప్రామాణిక రుణాలపై ఈఎంఐల భారం కూడా తగ్గనుంది. ఎందుకంటే, కీలక వడ్డీ (రెపో) రేటును 0.25 శాతం తగ్గిస్తున్నట్లు ఆర్‌బీఐ శుక్రవారం ప్రకటించింది. దాంతో రెపో రేటు 6.50 శాతం నుంచి 6.25 శాతానికి దిగివచ్చింది. రెపో రేటును తగ్గించడం ఐదేళ్ల (2020 మే) తర్వాత ఇదే తొలిసారి. రెండున్నరేళ్ల సుదీర్ఘ యథాతథ స్థితి తర్వాత రెపోను సవరించడం కూడా ఇదే మొదటిసారి. అంతేకాదు, ఆర్‌బీఐ కొత్త గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు చేపట్టాక నిర్వహించిన తొలి ద్రవ్యపరపతి సమీక్షలోనే రేటు తగ్గింపునకు శ్రీకారం చుట్టడం మరో విశేషం.

ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్షలో భాగంగా సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మూడు రోజులపాటు సమావేశమైంది. వృద్ధికి ఊతమిచ్చేందుకు వడ్డీ రేటును పావు శాతం తగ్గించాలని సభ్యులు ఏకగ్రీవంగా ఓటేశారు. పరపతి విధానంపై తటస్థ వైఖరిని మాత్రం అలాగే కొనసాగించాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. అత్తెసరు ఆదాయం, ధరాఘాతంతో సతమవుతున్న మధ్య తరగతి వర్గాలపై కేంద్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్లో వరాల జల్లు కురిపించింది. కొత్త పన్ను విధానాన్ని ఎంచుకునే వారికి రూ.12 లక్షల వరకు వార్షికాదాయంపై పన్ను ఊరట కల్పించింది. తాజాగా ఆర్‌బీఐ సైతం రుణగ్రహీతల కోసం వడ్డీ భారాన్ని తగ్గించింది. ఈ ఏడాది ఏప్రిల్ 7-9 తేదీల్లో తదుపరి సమీక్షను నిర్వహించనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది.

చాలాకాలంగా ఎదురుచూస్తున్న రుణగ్రహీతలకు రెపో తగ్గింపుతో కొంత ఉపశమనం లభించనుందని, ఆర్థిక వృద్ధికి సైతం ఈ నిర్ణయం దోహదపడనుందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఆర్‌బీఐ నిర్ణయాన్ని పారిశ్రామిక వర్గాలు స్వాగతించాయి. ముున్ముందు రెపో మరింత తగ్గేందుకు పునాదులు వేసిందన్నారు. పన్ను ఊరట ద్వారా వినియోగం పెంచేందుకు బడ్జెట్లో ప్రకటించిన చర్యలకు రెపో తగ్గింపు మరింత తోడ్పడనుందన్నారు. ఆర్థిక పునరుద్ధరణకు దోహదపడనుందన్నారు.

రెపో పావు శాతం తగ్గింపుతో రియల్టీ రంగానికి ప్రత్యక్ష ప్రయోజనం కొంతేనని.. గృహాలకు డిమాండ్ పుంజుకునేందుకు వడ్డీ రేట్లు మరింత తగ్గాల్సిన అవసరం ఉందని క్రెడాయ్ అభిప్రాయపడింది. వాహన రంగం మాత్రం సంతోషం వ్యక్తం చేసింది. టూవీలర్లు, చిన్న కార్ల విక్రయాలు పెరిగేందుకు తోడ్పడవచ్చని అభిప్రాయపడింది.

ధరలు తగ్గుముఖం

వచ్చే ఆర్థిక సంవత్సరంలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం సగటు 4.2 శాతానికి తగ్గవచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. 2024-25 ద్రవ్యోల్బణం అంచనాను మాత్రం యథాతథంగా 4.8 శాతంగా కొనసాగించింది. సరఫరా అవాంతరాలు ఎదురుకాని పక్షంలో, మెరుగైన ఖరీఫ్ దిగుబడితో ధరలు క్రమంగా తగ్గుముఖం పట్టవచ్చని ఆర్‌బీఐ గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ట్రంప్ సుంకాల దెబ్బకు అంతర్జాతీయ మార్కెట్లో కమోడిటీలు, ఇంధన ధరల పెరుగుదల అవకాశాలు, వరదలు, తుపాన్ల వంటి ప్రకృతి విపత్తులతో ధరలు మళ్లీ పెరిగే ప్రమాదం లేకపోలేదన్నారు.

7 శాతానికి పైగా వృద్ధి సాధ్యమే..

భారత్ 7 శాతానికి పైగా వృద్ధిని సాధించగలదని, మనం అందుకోసం ఆకాంక్షించాలని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా అన్నారు. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో జీడీపీ వృద్ధి రేటు 6.7 శాతానికి పెరగవచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. మెరుగైన రబీ దిగుబడితో పాటు పారిశ్రామికోత్పత్తిలో పునరుద్ధరణ ఇందుకు దోహదపడనున్నాయని మల్హోత్రా అన్నారు. అలాగే, ఈసారి బడ్జెట్లో ప్రకటించిన పన్ను ఊరటతో ప్రైవేటు వినియోగానికి ఊతం లభించనుందని, ఇది కూడా వృద్ధికి దోహదకంగా పనిచేయనుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో మాత్రం వృద్ధి రేటు 6.4 శాతానికి పరిమితం కావచ్చని ప్రభుత్వం ఈ మధ్యనే అంచనాలను విడుదల చేసింది.

బ్యాంకులకు ప్రత్యేక డొమైన్ నేమ్స్

దేశీయ ఆర్థిక సేవల రంగంలో భారీగా పెరిగిన డిజిటల్ మోసాలకు మోసాలకు చెక్ పెట్టేందుకు ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. భారత బ్యాంకులకు 'బ్యాంక్.ఇన్', నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలకు (ఎన్‌బీఎఫ్‌సీ) 'ఫిన్.ఇన్' ప్రత్యేక డొమైన్ నేమ్‌లను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ ఏప్రిల్ నుంచి బ్యాంకులకు బ్యాంక్.ఇన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం కానుందని, ఆ తర్వాత ఎన్‌బీఎఫ్‌సీలకు ఫిన్.ఇన్ డొమైన్ నేమ్‌లను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. కాగా, కార్డు లేకుండా ఆన్‌లైన్‌లో జరిపే అంతర్జాతీయ చెల్లింపుల్లో అదనపు ధ్రువీకరణను ప్రవేశపెట్టాలని కూడా ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. భారత్‌లో జారీ చేసిన కార్డులతో జరిపే అంతర్జాతీయ చెల్లింపులకు అదనపు ధ్రువీకరణ ఇప్పటికే అమలులో ఉంది.

జలాన్ కమిటీ సిఫారసులపై అంతర్గత సమీక్ష

ఆర్‌బీఐ మిగులు నిధుల బదిలీకి సంబంధించి ఎకనామికల్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్ (ఈసీఎఫ్)పై ఆర్‌బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ చేసిన సిఫారసులపై అంతర్గత సమీక్ష కొనసాగుతోందని మల్హోత్రా తెలిపారు. ప్రస్తుతం ఈ ఫ్రేమ్‌వర్క్‌లో ఆకస్మిక అవసరాలు, నష్టాల కోసం బ్యాలెన్స్‌షీట్‌లో గరిష్ఠంగా 6.5 శాతం వరకు నిల్వను కేటాయించవచ్చు. గత ఏడాది ఆర్‌బీఐ రికార్డు స్థాయిలో రూ.2.11 లక్షల కోట్ల మిగులు నిధులను ప్రభుత్వానికి బదిలీ చేసింది.

కేవలం ఈసారే పాలసీ సడలింపు!

ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా కేవలం ఈ సమావేశంలో ద్రవ్య పరపతి విధానాన్ని కాస్త సడలించడం జరిగిందని, తద్వారా రెపో రేటును 0.25 శాతం తగ్గించగలిగామని ఆర్‌బీఐ గవర్నర్ స్పష్టం చేశారు. ముున్ముందు సమీక్షల్లోనూ ఇదే వైఖరి ఉండబోదన్నారు. వృద్ధికి మద్దతిస్తూనే ద్రవ్యోల్బణాన్ని లక్ష్యం మేరకు నియంత్రించే దిశగా పరపతి విధాన వైఖరి ఉంటుందన్నారు. దీర్ఘకాలంపాటు ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి కట్టడి చేయాలని ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులు ఆందోళనకరం

రూపాయి విలువ క్షీణత కూడా ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెంచుతోందన్నారు. రూపాయి విలువ 5 శాతం క్షీణిస్తే, దిగుమతుల భారం పెరిగి ద్రవ్యోల్బణం 0.30 శాతం మేర పెరిగే అవకాశం ఉందన్నారు. అయితే, రూపాయి మారకం విలువలో హెచ్చుతగ్గుల కంటే అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులు ఆర్‌బీఐ పాలిట అతిపెద్ద ఆందోళనకర అంశంగా మారిందన్నారు. ఎందుకంటే, అంతర్జాతీయ అనిశ్చితులు ఆర్థిక వృద్ధి, పెట్టుబడి నిర్ణయాలు, వినియోగంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయన్నారు.

బడ్జెట్ భళా

వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ చాలా బాగుందని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా అన్నారు. బడ్జెట్ ప్రకటనలు ఆర్థిక వృద్ధికి ఊతమివ్వడంతోపాటు ఆర్‌బీఐ ద్రవ్యోల్బణ నియంత్రణ లక్ష్యానికి తోడ్పడేలా ఉన్నాయన్నారు. భారీ పన్ను ఊరటతో మధ్యతరగతి వర్గాల చేతుల్లోకి అదనంగా రూ.లక్ష కోట్లు అందుబాటులోకి రానున్నాయని.. తద్వారా మార్కెట్లో వినియోగం పెరగనుందన్నారు.

గృహ రుణాలపై తగ్గనున్న భారం

ఐదేళ్ల తర్వాత ఆర్‌బీఐ గృహ రుణాలు తీసుకునే వారికి శుభవార్త చెప్పింది. శుక్రవారం జరిగిన భేటీలో రెపో రేటును 6.5 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గించింది. దీంతో బ్యాంకులు కూడా గృహ, ఇతర రిటైల్ రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించనున్నాయి. రెపో రేటు తగ్గింపు ప్రభావం గృహ రుణాల ఈఎంఐలపై ఎలా ఉంటుందంటే? ప్రస్తుతం బ్యాంకులు మంచి పరపతి రేటింగ్ ఉన్న వ్యక్తులకు ఇచ్చే గృహ రుణాలపై కనీసం 9 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయి. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో ఇది 8.75 శాతానికి తగ్గనుంది. మంచి పరపతి రేటింగ్ ఉన్న ఒక వ్యక్తి 20 ఏళ్ల కాలానికి తాను తీసుకున్న రూ.30 లక్షల గృహ రుణంపై ప్రస్తుతం 9 శాతం వడ్డీ రేటు చొప్పున నెలకు రూ.26,992 ఈఎంఐగా చెల్లిస్తున్నారు. బ్యాంకులు ఈ వడ్డీ రేటును 8.75 శాతానికి కుదిస్తే ఈ ఈఎంఐ భారం రూ.26,551కు తగ్గనుంది. అంటే నెలకు చెల్లింపు భారం 1.78 శాతం (రూ.480) తగ్గనుంది.

ఏది బెటర్: ప్రస్తుతం గృహ రుణాలు తీసుకున్న వారి ముందు రెండు మార్గాలున్నాయి. అందులో ఒకటి తగ్గే వడ్డీ రేటుకు అనుగుణంగా ఈఎంఐల భారం తగ్గించుకోవడం. రెండోది ఈఎంఐ చెల్లింపు మొత్తాన్ని అలాగే ఉంచుకుని రుణ చెల్లింపు కాలపరిమితి తగ్గించుకోవడం. రెండో ఆప్షన్‌తో గృహ రుణం త్వరగా తీరిపోయి ఇల్లు పూర్తిగా సొంతమవుతుంది.

ఇది ఎలాగంటే: ఒక వ్యక్తి ఏడాది క్రితం 20 ఏళ్లలో చెల్లించేలా తొమ్మిది శాతం వడ్డీ రేటుతో రూ.50 లక్షల గృహ రుణం తీసుకున్నాడనుకుందాం. ఈ వడ్డీ రేటు ప్రకారం రుణ కాల పరిమితి తీరేసరికి అతడు చెల్లించాల్సిన ఈఎంఐల మొత్తం దాదాపు రూ.58 లక్షలు. ఇప్పుడు వడ్డీ రేటు అర శాతం తగ్గితే 20 ఏళ్లలో చెల్లించాల్సిన ఈఎంఐల మొత్తం రూ.50 లక్షలకు తగ్గుతుంది. పాత ఈఎంఐనే కొనసాగిస్తే చెల్లింపు కాలపరిమితి 240 నెలల నుంచి 222 నెలలకు తగ్గుతుంది. అదే వడ్డీ రేటు పావు శాతం మాత్రమే తగ్గి, పాత ఈఎంఐ కొనసాగిస్తే చెల్లింపుల కాలపరిమితి 240 నుంచి 230కి తగ్గుతుంది.

పన్ను ఆదాను కూడా కలిపితే: వారం రోజుల క్రితం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్లో వేతన జీవులకు రూ.12 లక్షల ఆదాయంపై జీరో ఆదాయపు పన్ను ప్రయోజనం కల్పించడంతో పాటు అద్దెల ద్వారా వచ్చే ఆదాయంపై టీడీఎస్ పరిమితులు పెంచారు. దీనికి తోడు గృహ రుణాలపై వడ్డీ వినహాయింపులు కూడా పెంచారు. ఆర్‌బీఐ రెపో రేటు కోతతో ఈ ప్రయోజనాలను కూడా జోడించినట్టయితే వారికి కలిగే లాభం మరింత అధికంగా ఉంటుంది.

రెండు అగ్రగామి బ్యాంకుల్లో ఈఎంఐల తగ్గింపు ఎంత ఉండొచ్చంటే..

బ్యాంకు	మొత్తం రుణం (రూ.)	కాలపరిమితి (సం.)	ప్రస్తుత వడ్డీరేటు (%)	ఈఎంఐ (రూ.)	కొత్త వడ్డీరేటు (%)	ఈఎంఐ (రూ.)
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	50 లక్షలు	30	8.75	39,335	8.5	38,446
	1 కోటి	30	8.75	78,670	8.5	76,891
ఎస్‌బీఐ బ్యాంక్	50 లక్షలు	30	9.55	42,225	9.3	41,315
	1 కోటి	30	9.55	84,450	9.3	82,630

ఆటో రుణాలపై ఈఎంఐ తగ్గుదల ఎంతంటే..	రుణం మొత్తం (రూ.)	9.4% వడ్డీపై ఈఎంఐ	9.15% వడ్డీపై ఈఎంఐ
	5 లక్షలు	10,477	10,416
	7 లక్షలు	14,667	14,582
	10 లక్షలు	20,953	20,831

బ్యాంకులు ఎప్పుడు అమలుపరుస్తాయి: ఆర్‌బీఐ రెపో తగ్గింపు చర్యకు స్పందిస్తూ బ్యాంకులు వడ్డీ రేటు తగ్గించడం అనేది ఆయా బ్యాంకులు అనుసరించే విధానాలపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా అయితే బ్యాంకులు కొత్త రెపో రేటుకు దీటుగా తమ రుణ, డిపాజిట్ రేట్లను సవరించేందుకు గరిష్ఠంగా రెండు వారాల వరకు సమయం పడుతుంది. రేట్ల కోత ప్రకటించిన అనంతరం బ్యాంకులు తమ లిక్విడిటీ స్థితి, నిధుల సమీకరణ వ్యయం, మార్కెట్లో పోటీ అన్నింటినీ మదింపు చేసుకుని వడ్డీ రేటు తగ్గింపు నిర్ణయం తీసుకుంటాయి.

వచ్చేసింది.. 'ముక్కోణం'

నేటి తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ x న్యూజిలాండ్ ఢీ — మ.2.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో..



ట్రోఫీతో కెప్టెన్లు శాంట్నర్, బవుమా, రిజ్వాన్

షెడ్యూల్
- ఫిబ్రవరి 8: పాకిస్థాన్xన్యూజిలాండ్, మ.2.30 నుంచి
- ఫిబ్రవరి 10: న్యూజిలాండ్xదక్షిణాఫ్రికా, ఉ.10 నుంచి
- ఫిబ్రవరి 12: పాకిస్థాన్xదక్షిణాఫ్రికా, మ.2.30 నుంచి
- ఫిబ్రవరి 14: ఫైనల్, మ.2.30 నుంచి

లాహోర్: హోరెత్తుతున్న టీ20 యుగంలో పూర్తిగా మసకబారిన ముక్కోణపు వన్డే సిరీస్‌కు మరోసారి రంగం సిద్ధమైంది. ఈనెల 19 నుంచి పాకిస్థాన్ ఆతిథ్యమిస్తున్న చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఈ ముక్కోణపు సిరీస్ జరుగుతుండడం ఒకింత ప్రాధాన్యతను సంతరించుకుంది. పాకిస్థాన్, న్యూజిలాండ్‌తోపాటు దక్షిణాఫ్రికా ఈ సిరీస్‌లో తలపడుతున్నాయి. మూడు జట్లు ఒక్కో మ్యాచ్‌లో తలపడతాయి. ఆపై ఫైనల్ ఉంటుంది. ఇక..శనివారం జరిగే ప్రారంభ మ్యాచ్‌లో పాకిస్థాన్-న్యూజిలాండ్ ఢీకొంటాయి. చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు జరిగే వేదికలైన లాహోర్, కరాచీల్లోనే ఈ సిరీస్ కూడా జరగనుంది. ముక్కోణపు సిరీస్‌కు పాకిస్థాన్, న్యూజిలాండ్ పూర్తిస్థాయి జట్లతో బరిలోకి దిగుతున్నాయి. కానీ ఎస్ఏటీ20 లీగ్, గాయాల బెడదతో బలహీనపడిన జట్టుతో సఫారీలు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. దక్షిణాఫ్రికా జట్టులో ఏకంగా ఆరుగురు అన్‌క్యాప్డ్ ఆటగాళ్లున్నారు. పాకిస్థాన్‌కు రిజ్వాన్, న్యూజిలాండ్‌కు శాంట్నర్, దక్షిణాఫ్రికా జట్టుకు బవుమా కెప్టెన్లుగా వ్యవహరిస్తున్నారు.

స్పోర్ట్స్



అజయ్.. ఆఖరి శతక అభివాదం

అంధుల క్రికెట్‌కు అజయ్ వీడ్కోలు

ఆఖరి మ్యాచ్‌లో శతకం బాదిన మాజీ కెప్టెన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అర్జున అవార్డు గ్రహీత, భారత అంధుల జట్టు మాజీ కెప్టెన్ ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 34 ఏళ్ల అజయ్ స్వస్థలం పల్నాడుజిల్లా మాచర్ల. అజయ్ క్రికెట్ కెరీర్‌లో వన్డే, టీ20ల్లో కలిపి 101 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించాడు. అజయ్ కెప్టెన్సీలో టీమిండియా 2016 ఆసియా కప్, 2017 టీ20 వరల్డ్‌కప్, 2018 వన్డే ప్రపంచకప్, 2022 టీ20 వరల్డ్‌కప్ సాధించింది. ఇక, 28 రాష్ట్రాలు పాల్గొన్న నగేష్ జాతీయ టీ20 క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం బెంగళూరు వేదికగా ఢిల్లీతో జరిగిన ఫైనల్లో ఆంధ్ర 67 పరుగుల తేడాతో నెగ్గి, ట్రోఫీ సొంతం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర 20 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 251 పరుగులు చేసింది. అజయ్ 45 బంతుల్లో 104 పరుగులతో తన చివరి మ్యాచ్‌లో సెంచరీ కొట్టి కెరీర్‌ను ఘనంగా ముగించాడు. ఛేదనలో ఢిల్లీ 9 వికెట్లకు 184 పరుగులే చేసి ఓడింది. 19 ఏళ్ల తన సుదీర్ఘ కెరీర్‌లో సహకరించిన కుటుంబ సభ్యులు, సహోద్యోగులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు అజయ్ కృతజ్ఞతలు తెలిపాడు.

సినిమా చూస్తుండగా.. ఫోనొచ్చింది



శ్రేయాస్ అయ్యర్

నాగ్‌పూర్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో విరాట్ కోహ్లీకి గాయం కావడంతో అనూహ్యంగా బరిలోకి దిగిన శ్రేయాస్ అదిరే ఆటతో ఇంగ్లండ్ బౌలర్లను చెడుగుడు ఆడాడు. హాఫ్ సెంచరీతో జట్టు విజయంలో కీలకమయ్యాడు. అయితే ఈ మ్యాచ్‌లో ఆడడం వెనుక ఓ ఆసక్తికర విషయాన్ని శ్రేయాస్ పంచుకున్నాడు. 'తొలి వన్డేలో ఎలాగూ చోటు దక్కదని తెలుసుకాబట్టి మ్యాచ్‌కు ముందు రోజు నేను హాయిగా సినిమా చూస్తున్నా. ఆ సమయంలో కెప్టెన్ రోహిత్ నుంచి ఫోనొచ్చింది. విరాట్‌కు మోకాలిలో వాపు వచ్చింది. నీకు మ్యాచ్ ఆడే అవకాశం రావచ్చు. సిద్ధంగా ఉండమని చెప్పాడు. అంతే.. వెంటనే నా గదికి వెళ్లి పడుకున్నా. అలా విరాట్ దూరం కావడంతోనే నాకు అవకాశం దక్కింది' అని శ్రేయాస్ తెలిపాడు.

ఆశ్చర్యమే..: పాంటింగ్

చాలా రోజులుగా శ్రేయాస్ అయ్యర్‌ను సెలెక్టర్లు జట్టు ఎంపికలో పరిగణనలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగించిందని ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అన్నాడు. గతేడాది ఆరంభం నుంచి వన్డేల్లో, 2023 చివర నుంచి టీ20ల్లోనూ శ్రేయా‌స్‌కు భారత జట్టులో చోటు దక్కలేదు. మరోవైపు శ్రేయాస్‌లాంటి సమర్థుడైన బ్యాటర్‌ను పక్కనబెట్టడం మానుకోవాలని మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా సూచించాడు. వన్డే వరల్డ్‌కప్‌లో నాలుగో నెంబర్‌లో ఆడి 500+ పరుగులు సాధించిన తొలి భారత ఆటగాడిగా శ్రేయాస్ నిలిచిన విషయం మరువరాదని గుర్తుచేశాడు.

రెండో వన్డేలో కోహ్లి ఆడతాడు

కోహ్లీ ఫిట్‌నెస్‌పై ఆందోళన అవసరం లేదని వైస్-కెప్టెన్ గిల్ స్పష్టంజేశాడు. మోకాలి వాపు నుంచి అతడు కోలుకున్నాడని, ఆదివారం కటక్‌లో జరిగే రెండో వన్డేలో ఆడతాడని ప్రకటించాడు.

స్మిత్ @36

- స్టీవ్, క్యారీ శతకాలు
- ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 330/3



స్టీవ్ స్మిత్ (120 బ్యాటింగ్)

గాలె: ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ (120 బ్యాటింగ్) టెస్టుల్లో 36వ శతకం పూర్తి చేశాడు. దీంతో ఈ ఫార్మాట్‌లో ఎక్కువ సెంచరీలు బాదిన జాబితాలో ద్రవిడ్, రూట్‌లతో కలిసి ఐదో స్థానంలో నిలిచాడు. సచిన్ (51) టాప్‌లో ఉన్నాడు. మరోవైపు అన్ని ఫార్మాట్లలో కలిపి స్మిత్‌కిది 48వ శతకం కాగా.. ఇందులో ద్రవిడ్, రోహిత్ సరసన నిలిచాడు. ఇక శ్రీలంకతో జరుగుతున్న ఈ రెండో టెస్టులో స్మిత్‌కు జతగా క్యారీ (139 బ్యాటింగ్) కూడా అజేయ శతకం బాదడంతో రెండో రోజు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 330/3 స్కోరుతో నిలిచింది. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 257 పరుగులకు ఆలౌటైంది.

హర్షప్రదకు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): తెలంగాణకు 38వ జాతీయ క్రీడల్లో తొలి రజత పతకం లభించింది. డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో శుక్రవారం ముగిసిన తైక్వాండో 73 కిలోల కియోర్గి విభాగం ఫైనల్లో చండీగఢ్ అమ్మాయి ఇతీషా దాస్ 2-0తో తెలంగాణ ప్లేయర్ హర్షప్రదను ఓడించింది. హర్షప్రదను తెలంగాణ తైక్వాండో సంఘం అధ్యక్షుడు డి.సతీష్ గౌడ్ అభినందించారు. పతకాల పట్టికలో తెలంగాణ ప్రస్తుతం ఒక స్వర్ణం సహా మొత్తం ఆరు పతకాలతో 28వ స్థానంలో ఉంది.

ఫేవరెట్ ముంబై

- హరియాణాతో క్వార్టర్స్
- నేటినుంచి రంజీట్రోఫీ

స్పోర్ట్స్ 18లో ఉ.9 నుంచి

కోల్‌కతా: రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లకు వేళైంది. మొత్తం.. నాలుగు మ్యాచ్‌లు దేశంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ప్రారంభం కానున్నాయి. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై..హరియాణాతో అమీతుమీ తేల్చుకోనుంది. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్, ఆల్‌రౌండర్ శివమ్ దూబే చేరికతో ముంబై అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. మేఘాలయతో గత మ్యాచ్‌లో సిద్దేష్, ఆకాష్, షామ్స్ ములానీ సెంచరీలు చేశారు. ఈ నేపథ్యంలో ఫేవరెట్‌గా బరిలో దిగుతున్న ముంబైని ఎదుర్కోవడం హరియాణాకు సవాలే. ఇక ఇతర మ్యాచ్‌ల్లో..రాజ్‌కోట్‌లో గుజరాత్-సౌరాష్ట్ర, నాగ్‌పూర్‌లో విదర్భ-తమిళనాడు, పుణెలో కేరళ-జమ్మూ కశ్మీర్ జట్లు తలపడతాయి.



సూర్య



GOVERNMENT OF GUJARAT



Future-ready, today

Invest in Gujarat's Thriving **Emerging Sector Ecosystem**

Gujarat is at the forefront of breakthroughs in emerging sectors, driven by progressive, business-friendly policies-from the Aatmanirbhar Gujarat Scheme and Renewable Energy Policy to the Semiconductor Policy and Waste Land Policy for Renewable Energy Projects. With world-class infrastructure and a visionary approach, the state ensures seamless growth and exceptional business performance.

Evolving Sectors in Gujarat



Gujarat: Shaping the Future of Rising Sectors

- **India's first** semiconductor fabrication facility foundation laid in Dholera.
- **Semiconductor ATMP and OSAT plants** coming up in Sanand.
- **C295 aircraft manufacturing** for the Indian Air Force under "Make in India" in Vadodara.
- **India's first Lithium-Ion Cell Giga-Factory** (20 GW) coming up in Ahmedabad.
- **India's first Solar Giga-Factory** coming up in Jamnagar.

Invest in Gujarat, Invest in the Future



రాజధాని అమరావతి లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ముమ్మరంగా సాగుతున్న ఎలక్ట్రికల్ పనులు.. ఇప్పటికే క్వార్టర్స్ చుట్టూ జంగిల్ క్లియరెన్స్ చేశారు. లోపల ప్లంబింగ్ పనులు కూడా జరుగుతున్నాయి.



రాష్ట్ర అతిథులుగా హైకోర్టు మాజీ సీజేలు

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులను రాష్ట్ర అతిథులుగా ప్రభుత్వం గుర్తించింది. ఇప్పటికే మాజీ సీజేలు ఏపీలో పర్యటించిన సమయంలో వారిని రాష్ట్ర అతిథులుగా పరిగణిస్తూ ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు వారు ఢిల్లీలో పర్యటించిన సమయంలో ఆంధ్రప్రదేశ్ అతిథులుగా గుర్తిస్తూ ఏపీ భవన్‌లో వసతి, ప్రయాణ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బీసీలకు కేటాయింపులు రూ.2లక్షల కోట్లకు పెంచాలి

» కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు బీసీ నేతల విజ్ఞప్తి



కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు వినతిపత్రం అందిస్తున్న బీసీ నాయకులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు కేటాయింపులు రూ.2 లక్షల కోట్లకు పెంచాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసేందుకు చొరవ తీసుకోవాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో బీసీ నేతలు శుక్రవారం పార్లమెంటు భవనంలో కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. జనగణనలో కులగణన చేయాలని కోరారు.

మస్తాన్‌సాయి మామూలోడు కాదు!

» గుంటూరులో గుట్టుగా జీవితం
» హైదరాబాద్ వెళ్లాక తీవ్రమైన నేరాలు
» డ్రగ్స్ పంపిణీ, నగ్న వీడియోలతో బ్లాక్‌మెయిల్
» తండ్రి స్థానిక మస్తాన్ దర్గా ట్రస్టీ

గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్న పేరు మస్తాన్‌సాయి. సొంతూరు గుంటూరులో అతడి గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. చిన్నప్పటి నుంచి ఎవరితోనూ పరిచయాలు లేవని స్థానికులు చెబుతున్నారు. హైదరాబాద్ వెళ్లాక డ్రగ్స్ పంపిణీ, యువతుల నగ్నవీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేయడం వృత్తిగా చేసుకున్నాడు. మస్తాన్‌సాయి తండ్రి... గుంటూరులో ఉన్న మస్తాన్ దర్గా ట్రస్టీ రావి రామ్మోహన్‌రావు. మస్తాన్ దర్గా ఎదురుగా ఉన్న ఆర్ అగ్రహారంలో రామ్మోహన్ రావు కుటుంబం నివాసం ఉంటోంది. గోప్యంగా జీవనం సాగిస్తుంటారని స్థానికులు అంటున్నారు. డ్రగ్స్ నగ్న వీడియోల కేసులో మస్తాన్‌సాయి వార్తల్లోకి ఎక్కడం గుంటూరు వాసులను కలవరానికి గురిచేసింది. సినీ నటులు రాజ్ తరుణ్, లావణ్య వ్యవహారంలో మొదటిసారిగా అతడి పేరు తెరపైకి వచ్చింది. ఆ తర్వాత గుంటూరులోని ఓ స్టార్ హోటల్లో లావణ్యపై మస్తాన్‌సాయి అత్యాచారానికి ఒడిగట్టినట్లు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. లావణ్య మీడియా ముందుకు రావడంతో కేసు వెలుగు చూసింది. గుంటూరుకు చెందిన వరలక్ష్మి టిఫిన్స్ నిర్వాహకుడు ప్రభాకర్‌రెడ్డి హైదరాబాద్‌లో డ్రగ్స్ కేసులో పట్టుబడగా అందులో మస్తాన్‌సాయి కీలకమని తేలింది. ఆ తర్వాత గుంటూరుకు చెందిన సుభాని హోటల్స్ నిర్వాహకులకు డ్రగ్స్ పంపిణీ చేస్తూ విజయవాడలో పట్టుబడిన పలువురిని విచారించగా, సూత్రధారి మస్తాన్‌సాయిగా పోలీసులు గుర్తించారు. అప్పటికే అతడు పరారీలో ఉండడంతో 4 నెలల పాటు పోలీసులు నిఘా ఉంచారు. ఎట్టకేలకు గుంటూరులోని మస్తాన్‌దర్గాలో మస్తాన్‌సాయి రహస్యంగా తలదాచుకున్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. ఈ ఘటనతో అతడు మస్తాన్ సాయి దర్గా ట్రస్టీ రామ్మోహన్ రావు కొడుకని ప్రజలకు తెలిసింది. హైదరాబాద్‌లో మస్తాన్‌సాయి బాధితురాలు లావణ్య పోలీసులకు ఇచ్చిన హార్డ్‌డిస్క్‌తో అతడి నైజం వెలుగు చూసింది. వందలాదిమంది యువతులను డ్రగ్స్‌కు బానిసలు చేసి, వారి నగ్న వీడియోలు చిత్రీకరించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికంగా మస్తాన్‌సాయి వ్యవహారం చర్చనీయాంశమైంది.

సిక్కోలు వ్యథే.. 'తండేల్' కథ!



పాకిస్థాన్‌లో బందీలుగా ఉన్న జిల్లా మత్స్యకారులు (ఫైల్)

» జిల్లాలో 104 మత్స్యకార గ్రామాలు
» స్థానికంగా ఉపాధి లేక దూరప్రాంతాలకు వలస
» 2018లో పాకిస్థాన్ బందీలుగా పలువురు జాలర్లు
» 13 నెలల పాటు జైల్లో నరకయాతన
» అదే ఇతివృత్తంగా సినిమా నిర్మాణం

(రణస్థలం - ఆంధ్రజ్యోతి)

కనుచూపు మేర సముద్రం! సరిహద్దు గీతలు కనిపించని జలాలు! ఆ కనిపించని గీతను వాళ్లు దాటారు! పాకిస్థాన్ చెరలో చిక్కారు! 13 నెలలపాటు జైళ్లలో మగ్గారు! ఈ యథార్థ వ్యథ.. 'తండేల్'గా వెండితెరపైకి ఎక్కింది! ఇది.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన అనేకమంది మత్స్యకారుల దయనీయ పరిస్థితికి అద్దంపట్టే కథ! స్థానిక మత్స్యకారులు ఇక్కడ చేపల వేట గిట్టుబాటుకాక.. ఏటా జూలై, ఆగస్టు నెలల్లో గుజరాత్‌లోని వీరావల్ ప్రాంతానికి వలస వెళతారు. ఫిబ్రవరి, మార్చిలో స్వస్థలాలకు చేరుతారు.

సముద్రమున్నా... ఉపాధి లేదు!

శ్రీకాకుళం జిల్లాలో 193 కిలోమీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకూ 104 మత్స్యకార గ్రామాలున్నాయి. జిల్లాలో ఫిషింగ్ హార్బర్లు కానీ, జెట్టీలు కానీ అందుబాటులో లేకపోవడంతో మత్స్యకారులు సంప్రదాయ వేటకే పరిమితమయ్యారు. ఇప్పటికీ నాటు పడవలపై ప్రమాదకర స్థితిలో వేట సాగిస్తున్నారు. స్థానికంగా వేట గిట్టుబాటుగాక జిల్లా నుంచి వేలాది మంది మత్స్యకారులు చెన్నై, ముంబై, కోల్‌కతా, పారాదీప్, వీరావల్(గుజరాత్) వంటి సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. బృందాలుగా వెళ్లి.. అక్కడున్న వ్యాపారుల వద్ద పనికి కుదురుతారు. అక్కడ ఉన్నన్ని రోజులు దాదాపుగా సముద్రానికే అంకితమవుతారు. ఇది ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నదే. వీరి సమస్యను పరిష్కరించి.. స్థానికంగా ఉపాధి కల్పించేలా గతంలో టీడీపీ హయాంలో భావనపాడు హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. టెండర్ల ప్రక్రియ సైతం పూర్తయింది. ఇంతలో వైసీపీ అధికారంలోకి రావడంతో హార్బర్ నిర్మాణానికి బ్రేకులు పడ్డాయి. తర్వాత మంచినీళ్లపేటలో జెట్టీ, బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి వైసీపీ నేతలు శంకుస్థాపన చేశారు. కానీ పనులు ప్రారంభించలేదు.

ఇదీ అసలు కథ..

2018లో కె.మత్స్యలేశం గ్రామం నుంచి మత్స్యకారులు గుజరాత్‌లోని వీరావల్‌కు వలస వెళ్లారు. ఆ ఏడాది నవంబరు 30న పొరబాటున పాకిస్థాన్ జలాల్లోకి ప్రవేశించారు. వెంటనే ఆ దేశ భద్రతా దళాలు వారిని నిర్బంధించాయి. పాక్ జైల్లో వారు 13 నెలలపాటు మగ్గిపోతూ అష్టకష్టాలు పడ్డారు. ఆ సమయంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అప్పటి విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్‌కు ఈ విషయం చెప్పడంతో 2020 జనవరి 6న మత్స్యకారులు విడుదలయ్యారు. ఇదే తండేల్ సినిమా.



తండేల్ అంటే..

'తండేల్' అనేది గుజరాతీ పదం. చేపల వేటకు వెళ్లే బోటులో మత్స్యకారులకు లీడర్‌గా వ్యవహరించే వారిని తండేల్ అని పిలుస్తారు. ఈ పదం శ్రీకాకుళం మత్స్యకారుల్లోనూ బాగా ప్రాచుర్యం పొందింది.

మా వెతలు తీరనివి...



శ్రీకాకుళం జిల్లాలోని 11 మండలాల్లో మత్స్యకార యువతకు సరైన ఉపాధి లేక సుదూర ప్రాంతాలకు వెళుతున్నారు. ప్రమాదాల్లో మరికొందరు చిక్కుకుంటున్నారు.

- సూరాడ చంద్రమోహన్, మత్స్యకార ఐక్యవేదిక అధ్యక్షుడు, శ్రీకాకుళం

ప్రాణాలపై ఆశలు వదులుకున్నాం!



వీరావల్ ప్రాంతంలో జెట్టీ నుంచి చేపల వేటకు వెళ్లాం. దాదాపు వేట పూర్తయింది. మరో అరగంటలో బయలుదేరుతామనగా.. మాకు చెందిన మూడు బోట్లు పొరపాటున పాకిస్థాన్ జలాల్లోకి చేరాయి. దీంతో అక్కడి కోస్టుగార్డులు గాల్లో కాల్పులు జరిపారు. దీంతో ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాం. ప్రాణాలపై ఆశలు వదులుకున్నాం. మమ్మల్ని జైల్లోకి తీసుకెళ్లేసరికి 300 మంది విదేశీ మత్స్యకారులు ఉన్నారు. జైల్లో నరకయాతన పడ్డాం.

- రామారావు, బోటు డ్రైవర్ (తండేల్), కె.మత్స్యలేశం.

13 నెలల నరకయాతన



నా భర్త రామారావు వీరావల్ ప్రాంతానికి ఉపాధి కోసం ప్రతి సంవత్సరం వెళ్లేవారు. బోటు డ్రైవర్‌గా పనిచేస్తుండేవారు. ఈ క్రమంలో పాకిస్థాన్ కోస్టుగార్డులకు నా భర్త చిక్కారు. అప్పుడు నేను నిండు గర్భిణిని. నా భర్తను తలచుకుని తల్లడిల్లిపోయేవాళ్లం. కుటుంబసభ్యులను ఓదార్చుతూ.. నాకు నేను ధైర్యం చెప్పుకుంటూ 13 నెలల పాటు నరకయాతన అనుభవించాం. - మాణిక్యమ్మ, కె.మత్స్యలేశం.

పెళ్లయిన రెండేళ్లకే..



స్థానికంగా వేట గిట్టుబాటు కాకపోవడంతో నా భర్త ఎర్రయ్య గుజరాత్‌లోని వీరావల్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ చేపల వేట సాగిస్తూ పాకిస్థాన్ కోస్టుగార్డులకు చిక్కారు. మా సమీప బంధువులు ఐదుగురు కూడా పట్టుబడ్డారు. మాకు వివాహం జరిగి అప్పటికి రెండేళ్లు అయింది. ఆ సమయంలో నా బాధ వర్ణనాతీతం. అటువంటి బాధ మరెవరికీ రాకూడదు. - శిరీష, కె.మత్స్యలేశం.

మిర్చి కొనుగోళ్లకు సహకరించండి

» కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌కు రామ్మోహన్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఏపీలో మిర్చి కొనుగోళ్లకు కేంద్రప్రభుత్వం సహకరించాలని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కేంద్ర పౌర విమానయానమంత్రి, టీడీపీ ఎంపీ రామ్మోహన్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం, టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి రామ్మోహన్‌నాయుడు కృషిభవన్‌లో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో మిర్చి రైతుల సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మిర్చి రైతుల సమస్యలను వివరిస్తూ సీఎం చంద్రబాబు రాసిన లేఖను శివరాజ్‌సింగ్ కు అందించారు. శివరాజ్‌సింగ్ సానుకూలంగా స్పందించారని రామ్మోహన్ తెలిపారు.

'ఆదర్శ గ్రామ' నిధులు విడుదల చేయండి

» కేంద్ర మంత్రికి మంత్రి డోలా విజ్ఞప్తి

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి రావాల్సిన ఆదర్శ గ్రామ పథకం నిధులు విడుదల చేయాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిని కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన డోలా పీఎం-అజయ్ ఆదర్శ గ్రామ పథకం కింద రాష్ట్రంలో ఎంపిక చేసిన 526 గ్రామాలకు రూ.110 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందించారు. వాటన్నింటికీ కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారని మంత్రి డోలా తెలిపారు.

ఎయిమ్స్‌ను.. 965 పడకలకు విస్తరించండి

» ఎయిమ్స్ డైరెక్టర్‌తో ఆరోగ్య మంత్రి సత్యకుమార్ భేటీ

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్‌ను దేశంలోనే అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం సహాయ సహకారాలందిస్తుందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం సచివాలయంలో ఎయిమ్స్ డైరెక్టర్ ఆచార్య అహంతెమ్ శాంతాసింగ్ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి మాట్లాడుతూ 2018లో ప్రారంభమైన వైద్యసంస్థకు గత ప్రభుత్వం మంచి నీటి సౌకర్యాన్ని కూడా కల్పించలేదన్నారు. 183 ఎకరాల్లో ఏర్పాటైన ఎయిమ్స్‌లో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు స్థలం లేనందున, కొలనుకొండలో 10 ఎకరాల స్థలాన్ని మంజూరు చేసేందుకు సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చినట్లు గుర్తు చేశారు. 965 పడకల ఆస్పత్రిగా మంజూరైన ఎయిమ్స్‌లో ప్రస్తుతం 650 పడకలున్నాయని, విస్తరణకు తగు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ శాంతాసింగ్‌కు మంత్రి సూచించారు.

టీటీడీ బోర్డును రద్దు చేయాలన్న పిటిషన్ కొట్టివేత

» కావాలంటే హైకోర్టుకు వెళ్లాలని పిటిషనర్‌కు సుప్రీం సూచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానాల(టీటీడీ) బోర్డును రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గత నెల 8న తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల పంపిణీ కేంద్రం వద్ద జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందిన ఘటనకు సంబంధించి ప్రస్తుత బోర్డును రద్దు చేసి కొత్త బోర్డును నియమించాలని కోరుతూ భారత చైతన్య యువజన పార్టీ(బీసీవైపీ) అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ గత నెల 17న రిట్ పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ముందుకు రాగా.. విచారణ జరిపేందుకు నిరాకరించింది. రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచిస్తూ వ్యాజ్యాన్ని కొట్టివేసింది.

అటవీ శాఖ టాస్క్‌ఫోర్స్‌కు డిప్యూటీ సీఎం అభినందనలు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టడంలో అటవీ శాఖ టాస్క్‌ఫోర్స్ చేస్తున్న కృషిని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశంసించారు. అన్నమయ్య జిల్లా, కర్ణాటకలోని హోస్కోట ప్రాంతాల్లో అక్రమ రవాణా చేస్తున్న 195 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, 8మందిని అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులను శుక్రవారం 'ఎక్స్' వేదికగా అభినందించారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. మున్సిపల్ శాఖలో మేనేజర్‌గా ఉన్న సీహెచ్ వెంకటేశ్వర్లను పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఏవీ రమేష్‌బాబును గూడూరు నగర పంచాయతీ కమిషనర్‌గా, ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న జి.వెంకట్రామిరెడ్డిని వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌గాను, కడప మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ పి.కిశోర్‌ను ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్‌గానూ నియమించారు.

అగ్రిగోల్డ్‌పై మళ్లీ ఆందోళన: ముప్పాళ్ల

ప్రభుత్వ స్వాధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులను కాపాడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. ఈ దిశగా నిర్దిష్టమైన చర్యలు చేపట్టకపోతే బాధితులందరినీ సమీకరించి మళ్లీ ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. గురువారం విజయవాడలో ఆయన మాట్లాడారు. రూ.7,000 కోట్ల డిపాజిట్లు వసూలు చేసిన తర్వాత అగ్రిగోల్డ్ కంపెనీని మూసివేశారని తెలిపారు. దీనిపై పెద్దఎత్తున ఆందోళన చేయగా ప్రభుత్వం స్పందించి ఆ సంస్థ నుంచి 23 వేల ఎకరాల భూములు స్వాధీనం చేసుకుందని వివరించారు

14 నుంచి కేంద్ర బడ్జెట్‌పై వామపక్షాల నిరసన

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలను తిరస్కరిస్తూ ఈనెల 14 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన నిర్వహించాలని 9 వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ రౌండ్ టేబుల్ సమావేశాలు, ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేపట్టాలని తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఆయా వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలు శుక్రవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

న్యాయ గ్రంథాల అనువాదకుడు పెండ్యాల కన్నుమూత



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): న్యాయశాస్త్ర గ్రంథాల అనువాదకుడు, రచయిత, వామపక్షవాది పెండ్యాల సత్యనారాయణ(72) ఇకలేరు. ఆయన రాజమండ్రిలోని తన కుమార్తె ఇంట్లో గురువారం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. సత్యనారాయణ స్వస్థలం గుంటూరు. ఆయనకు భార్య కుమార్తె ఉన్నారు. అత్యంత క్లిష్టమైన న్యాయ శాస్త్ర గ్రంథాలను వ్యవహారిక తెలుగులో అనువదించిన ఘనత పెండ్యాల సత్యనారాయణ సొంతం. న్యాయశాస్త్ర విద్యార్థులకు, న్యాయవాదులకు, పోలీస్ అకాడమీ వారికి ఆయన అనువాదాలు ఎంతగానో తోడ్పడ్డాయి. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ తదితర కొత్త చట్టాలను, భారత రాజ్యాంగాన్ని తెలుగులోకి అనువదించారు. పెండ్యాల చివరి కోరిక మేరకు ఆయన భౌతిక కాయాన్ని రాజమండ్రిలోని జీఎస్ఎల్ కళాశాలకు అప్పగించారు.

పిటిషన్ విస్తృత ధర్మాసనానికి వద్దు

» హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యానికి సుప్రీం నిరాకరించింది
» గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వినతి
» వంశీ ముందస్తు బెయిల్‌పై వాదనలు పూర్తి



అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో వైసీపీ నేత వల్లభనేని వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. దీంతో ఈ నెల 20న నిర్ణయం వెల్లడిస్తామని న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. వైసీపీ హయాంలో టీడీపీ కార్యాలయంపై మూకదాడి జరిగింది. దీనిపై ఆ పార్టీ నేతల ఫిర్యాదు మేరకు 2023లో గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి ఎమ్మెల్యే వంశీ పాత్ర కూడా ఉందని గుర్తించి ఆయనను కూడా నిందితుడిగా చేర్చారు. ఈ నేపథ్యంలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీనేత వల్లభనేని వంశీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. "ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసులు నమోదైన నేపథ్యంలో చట్ట నిబంధనల ప్రకారం దిగువకోర్టులోనే బెయిల్ పిటిషన్లు దాఖలు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని నిర్ధారిస్తూ ఇదే కేసులో పలువురు నిందితులు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను ఇదే కోర్టు గతంలో కొట్టివేసింది. ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ నిందితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. పిటిషనర్‌కు కూడా అవే ఉత్తర్వులు వర్తిస్తాయి. కేసును విస్తృత ధర్మాసనానికి పంపాలన్న పిటిషనర్ వాదన చెల్లుబాటు కాదు" అని పేర్కొన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది సత్యశ్రీ వాదనలు వినిపిస్తూ.. అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైనప్పుడు ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు వద్ద ముందస్తు బెయిల్ పిటిషన్ వేసుకోవాలని ఓ బెంచ్, చట్టం వర్తింపునకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లేనప్పుడు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు నేరుగా విచారించవచ్చని మరో బెంచ్ భిన్న ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసును విస్తృత ధర్మాసనానికి పంపాలని అనుబంధ పిటిషన్ వేశామన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై బీఎన్ఎస్ చట్టం వర్తించదు!

» సోషల్ మీడియా కేసులో సజ్జల న్యాయవాది వాదనలు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా పలువురు మంత్రులు, వారి కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో అనభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో శుక్రవారం హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వైసీపీ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ సజ్జల భార్గవ రెడ్డి, ఆ పార్టీ సానుభూతిపరులు పిటిషన్లు దాఖలు చేశారు. నిందితుల తరఫున సీనియర్ న్యాయవాదులు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, ఓ. మనోహర్ రెడ్డి, న్యాయవాది వై. నాగిరెడ్డి వాదనలు వినిపించారు. "పిటిషనర్లపై వ్యవస్థీకృత నేరం బీఎన్ఎస్ సెక్షన్ 111 కింద కేసులు పెట్టడం చెల్లుబాటు కాదు. గత ఏడాది జూలైలో బీఎన్ఎస్ యాక్ట్ అమల్లోకి వచ్చింది. అంతకు ముందు పెట్టిన పోస్టులకు కూడా బీఎన్ఎస్ సెక్షన్ 111 వర్తింపజేస్తున్నారు. ఎస్సీ ఎస్టీ చట్టం వర్తింపునకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లేవని కోర్టు సంతృప్తి చెందితే ఆ సెక్షన్ ఉన్నప్పటికీ ముందస్తు బెయిల్ పిటిషన్లపై కోర్టు విచారణ జరపొచ్చు. కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి వాంగ్మూలం ఆధారంగా ఇతరులను నిందితుడిగా చేర్చడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. ఎవిడెన్స్ యాక్ట్ ప్రకారం మేజిస్ట్రేట్ సమక్షంలో రికార్డు చేసిన వాంగ్మూలానికి మాత్రమే విలువ ఉంటుంది" అని పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లపై నమోదు చేసిన వివిధ కేసులు ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనన్నారు. ఈ కేసుల్లో సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ) ప్రకారం నోటీసులు ఇస్తామని పేర్కొంటూ సంబంధిత కేసుల వివరాలను కోర్టు ముందు ఉంచారు. అయితే, శుక్రవారం కోర్టు సమయం ముగియడంతో మరికొందరు పిటిషనర్లు, ప్రాసిక్యూషన్ తరఫు వాదనల కోసం న్యాయస్థానం విచారణను ఈ నెల 13కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. విజయ్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

పెద్దలను వదిలేసి... చిరుద్యోగులపై వేటు!

ఇంటర్న్‌షిప్ అక్రమాలపై ఉన్నత విద్యామండలి తీరు వివాదాస్పదం

» కంపెనీల ఎంపికలో కీలకంగా వ్యవహరించిన ముగ్గురు అధికారులు
» విమర్శలతో సమగ్ర విచారణకు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ ఇంటర్న్‌షిప్ అక్రమాల వ్యవహారంలో ఉన్నత విద్యామండలి తీరు తీవ్ర వివాదాస్పదమైంది. ఇంటర్న్‌షిప్‌ను అందించే కంపెనీల ఎంపికలో కీలకంగా వ్యవహరించిన ముఖ్య అధికారులను వదిలేసి.. చిరుద్యోగులపై వేటు వేయడం విమర్శలకు తావిస్తోంది. దీంతో తీవ్ర విమర్శల నేపథ్యంలో మండలి దిద్దుబాటు చర్యలకు దిగింది. అక్రమాల వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశించింది. విచారణాధికారిగా తణుకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌ను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. వారంలోగా నివేదిక ఇవ్వాలని అందులో ఆదేశించింది.

అసలేం జరిగిందంటే?

డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులు ఏటా తప్పనిసరిగా ఇంటర్న్‌షిప్‌లు చేయాలి. డిగ్రీ విద్యార్థులు మొదటి ఏడాది కమ్యూనిటీ ప్రాజెక్టు పేరుతో క్షేత్రస్థాయిలో వారికి నచ్చిన అంశంపై ఇంటర్న్‌షిప్ చేయాలి. మొదటి రెండేళ్లు రెండు నెలల పాటు, మూడో సంవత్సరం ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌లు చేయాలి. ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా వివిధ దశల్లో ఇంటర్న్‌షిప్‌లు పూర్తిచేయాలి. డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అందించేందుకు పలు కంపెనీలు ఉన్నత విద్యామండలి వద్దకు వెళ్తాయి. మండలి ఎంపిక చేసిన కంపెనీలు ఇంటర్న్‌షిప్ అందిస్తాయి. ఇందుకుగాను విద్యార్థుల నుంచి రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తాయి. రాష్ట్రంలో ఏటా 2 లక్షల మందికిపైగా డిగ్రీ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేయాలి. ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉన్నందున కంపెనీలు పోటీ పడతాయి. దీన్ని ఆసరాగా చేసుకొని ఉన్నత విద్యామండలిలోని కొందరు అధికారులు మామూళ్లకు తెరతీశారు. డబ్బులిచ్చిన కంపెనీలను ఎంపిక చేసేలా అక్రమాలు ప్రారంభించారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో.. వాస్తవమేనని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే అక్రమాలకు బాధ్యులను చేస్తూ మండలి వైస్ చైర్మన్ వద్ద పనిచేసే ఓ అటెండర్‌ను, కేపీఎంజీకి చెందిన మరో కింది స్థాయి ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు. కానీ అసలు వారి వెనుక ఎవరున్నారనేది వదిలేశారు. పది రోజుల తర్వాత ఇప్పుడు విచారణాధికారిని నియమించారు. కాగా, గత ప్రభుత్వం నుంచి పనిచేస్తున్న ఇద్దరు కీలక అధికారులు, మరో ముఖ్య అధికారి ఈ అక్రమాల వ్యవహారంలో ఉన్నట్లు తెలుస్తోంది. కంపెనీల ఎంపికలో వారే కీలకంగా వ్యవహరించి.. చివరికి ఆ నెపాన్ని చిరుద్యోగులపై నెట్టినట్లు ప్రచారం జరుగుతోంది.

వైసీపీ హయాంలో అన్నీ అక్రమాలే!

గత ప్రభుత్వంలో ఇంటర్న్‌షిప్‌ల పేరుతో భారీగా దోపిడీ చేశారు. ఆన్‌లైన్‌లో లక్షల మందికి ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్య శిక్షణ ఇచ్చామంటూ భారీగా నిధులు విడుదల చేశారు. ఈ క్రమంలో అసలు లేని ఆఫీసుకు రూ.51 లక్షలు విడుదల చేయడం అప్పట్లో అందరినీ షాక్‌కు గురిచేసింది. హైదరాబాద్‌కు చెందిన బ్లాక్‌బక్స్ అనే కంపెనీకి నామినేషన్ ఆధారంగా కాంట్రాక్టు అప్పగించారు. మండలి కార్యాలయం పక్కనే మంగళగిరిలో ఆఫీసు ఉన్నట్లుగా చూపించి రూ.51 లక్షలు ఆ కంపెనీకి ఇచ్చారు. విద్యార్థులకు కోడింగ్, ఇంగ్లి‌ష్‌పై శిక్షణ ఇచ్చినట్లు చూపించారు. దీనిపై విమర్శలు వచ్చినా ఎక్కడ శిక్షణ ఇచ్చారు? ఎంతమందికి ఇచ్చారు? అనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. అప్పట్లో మండలి ముఖ్య అధికారులకు ఇందులో భాగస్వామ్యం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. వారిలో కొందరు ఇప్పటికీ కొనసాగుతున్నా.. విచారణ చేపట్టడం లేదు.

ఆ జీతాలు వెనక్కివ్వండి

» 600 మంది డిగ్రీ కాంట్రాక్టు లెక్చరర్లకు నోటీసులు
» 2019 నాటి రెండు నెలల జీతం ఇప్పుడు రికవరీ
» ఒక్కో లెక్చరర్ కట్టాల్సిన మొత్తం 60 వేలు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం ఇచ్చిన 2 నెలల జీతాలను ఇప్పుడు తిరిగి చెల్లించాలని కళాశాల విద్యా శాఖ డిగ్రీ కాంట్రాక్టు లెక్చరర్లను ఆదేశించింది. అప్పట్లో అదనంగా చెల్లించారని, దానిని రికవరీ చేయాలని డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లను ఆదేశిస్తూ కళాశాల విద్యా శాఖ డైరెక్టర్ భరత్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. జీతాలు వెనక్కి ఇవ్వకపోతే ఇకపై చెల్లించాల్సిన జీతాల నుంచి రికవరీ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. అధికారుల నిర్ణయం కళాశాల విద్యాశాఖలో గందరగోళ వాతావరణం సృష్టిస్తోంది. 2019కు ముందు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లకు విద్యా సంవత్సరం వరకే జీతాలు ఇచ్చేవారు. అంటే.. సంవత్సరంలో పదిన్నర నెలల జీతాలు అందేవి. ఇంటర్ కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల తరహాలో పది రోజుల బ్రేక్‌తో మిగిలిన కాలానికి కూడా తమకు జీతాలు ఇవ్వాలని డిగ్రీ కాంట్రాక్టు లెక్చరర్లు కోరారు. వారి వినతిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం 2019 నవంబరులో 10 రోజులు మినహా మిగిలిన కాలానికి జీతాలు చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇంటర్ బోర్డుతో సమానంగా అదే సంవత్సరంలో ఏప్రిల్, మే నెలలకు చెల్లించారు. రాష్ట్రవ్యాప్తంగా 700 మంది కాంట్రాక్టు లెక్చరర్లు ఉంటే, సుమారు 600 మందికి ఆ ఏడాది ఏప్రిల్, మే నెలలకు సంబంధించి 51 రోజులకు జీతాలు అందాయి. ఆ విద్యా సంవత్సరంలో ఏప్రిల్, మే నెలలకు జీతాలు చెల్లించకూడదని, ఇచ్చినట్టయితే అదనంగా పరిగణించాలని తాజాగా కళాశాల విద్యా శాఖ స్పష్టం చేసింది. దీంతో ఒక్కొక్కరు రూ.60 వేల వరకు చెల్లించాల్సి రావడంతో కాంట్రాక్టు లెక్చరర్లు లబోదిబోమంటున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై మళ్లీ సమగ్ర నివేదిక

» సుప్రీంకోర్టుకు ఆంధ్రప్రదేశ్ నివేదన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై సమగ్ర నివేదిక సమర్పిస్తామని ఏపీప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి జేపీ వెంచర్స్‌కు వ్యతిరేకంగా జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్‌జీటీ) తీర్పు ఇచ్చింది. ఆ సంస్థకు రూ.18 కోట్ల జరిమానా విధించింది. ఈ తీర్పును 2023 మే 15న జేపీ వెంచర్స్ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై శుక్రవారం జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. సంస్థ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఏపీలో ఇసుక తవ్వకాలు ఆపేశామని తెలిపారు. ట్రైబ్యునల్ తమకు భారీ జరిమానా విధించిందన్నారు. ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా జోక్యం చేసుకుని.. కోర్టు ఆదేశాలతో రాష్ట్రంలో ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాలపై గతంలోనే నివేదిక అందజేశామని.. అయితే తాజాగా మరో సమగ్ర నివేదికను సమర్పించాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. ఆయన వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. తాజాగా తీసుకున్న నిర్ణయాలు, గత నివేదికలో పొందుపరచని అంశాలతో సమగ్ర నివేదిక అందించాలని రాష్ట్రాన్ని ఆదేశించింది. అలాగే కేంద్ర పర్యావరణ శాఖ గమనించిన అంశాలు, తీసుకున్న చర్యలతో అఫిడవిట్ వేయాలని ఆ శాఖనూ ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 7కు వాయిదా వేసింది.

28న రాష్ట్ర బడ్జెట్..!

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 24 నుంచి ప్రారంభం కానున్నాయి. అసెంబ్లీ సమావేశాలను 20 పనిదినాలు నిర్వహించాలని భావిస్తున్నారు. 28న 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్‌ను సభలో పెట్టే అవకాశం ఉంది. ఆ రోజు కుదరకపోతే మార్చి 3న పెడతారని సమాచారం.

విధ్వంసకుడే విధ్వంసంపై మాట్లాడుతున్నాడు: నిమ్మల

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు విధ్వంసం చేసినోడే ఇప్పుడు విధ్వంసం గురించి మాట్లాడుతుంటే విడ్డూరంగా ఉందని వైసీపీ అధ్యక్షుడు జగన్‌పై మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. పోలవరం ఎత్తు 41.15 మీటర్లకు, 115 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి పరిమితం చేసిన జగన్.. ఇప్పుడు కూటమి వచ్చాక ఎత్తు తగ్గించిందంటూ బుకాయిస్తున్నారని మండిపడ్డారు.

నీరు చెట్టు పనులపై విజిలెన్స్ కేసులు ఎత్తివేతపై ఇంజనీర్ల హర్షం

2014-19 మధ్యకాలంలో నీరు చెట్టు కింద 386 నీటివనరుల వద్ద చేపట్టిన 750పనులకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్న విజిలెన్స్ నివేదికను తోసిపుచ్చుతూ మంత్రివర్గం తీర్మానించడం పట్ల జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి నిమ్మలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

అబద్ధాలు, అసత్యాలే జగన్ అజెండా: పల్లా

అబద్ధాలు, అసత్యాలే జగన్‌రెడ్డి అజెండా అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. 'జగన్ పాలనలో ఒక్కరోజైనా ప్రజాస్వామ్య బద్ధంగా పాలన నడిపించలేదు. అధికారం కోల్పోయేసరికి నీతి, నిజాయతీ అన్నీ గుర్తుకొస్తున్నాయి. ప్రజా తీర్పును అవహాస్యం చేసేలా అసెంబ్లీకి రాననడం ఆయన నియంతృత్వాన్ని చాటుతుంది' అని అన్నారు.

జగన్ శవాలతో రాజకీయం చేస్తాడు: సంధ్యారాణి

దాచుకోవడం, దోచుకోవడం అంటే ఏమిటో చూపించడానికే జగన్ 2.0 జపం మొదలుపెట్టారని మంత్రి గుమ్మడి సంధ్యారాణి విమర్శించారు. 'జగన్ శవాలతో రాజకీయం చేస్తాడు. తల్లికి, చెల్లికి అన్యాయం చేసి, బాబాయి హత్యను గుండెపోటుగా చిత్రీకరించిన ఆయన విశ్వసనీయత గురించి మాట్లాడడం హాస్యాస్పదం' అని సంధ్యారాణి మండిపడ్డారు.

ఒక్క సీటైనా పొందేందుకు జగన్ కసరత్తు: బుద్దా

విజయవాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 2029 ఎన్నికలలో కనీసం ఒక్క సీటైనా పొందేందుకు జగన్ కసరత్తు చేస్తున్నాడని టీడీపీ నేత బుద్దా వెంకన్న అన్నారు. '8, 9 స్థానాల్లో నిలిచిన లోకేశ్, పవన్ కల్యాణ్ 1, 2 స్థానాల్లోకి రావడానికి కృషి చేస్తున్నారు. 11 సీట్లు ఉన్న జగన్ వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటైనా గెలిచేందుకు కృషి చేస్తున్నాడు' అని ఎద్దేవా చేశారు.

జగన్ అరాచకాలకు ఫలితమే 11 సీట్లు: కలిశెట్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ 1.0 పేరుతో చేసిన అరాచకాన్ని ప్రజలు తట్టుకోలేకే 151 సీట్ల నుంచి 11కు తీసుకొచ్చి పడేశారని, అయినా ఆయనలో మార్పు రాలేదని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎద్దేవా చేశారు. ఇప్పుడు 2.0 అంటూ కొత్త నాటకాన్ని మొదలెట్టారని విమర్శించారు. జగన్ అసెంబ్లీకి రాకుండా వారానికి ఒకసారి టూరిస్ట్‌లా బెంగళూరు నుంచి అమరావతి వచ్చి ప్రెస్‌మీట్లు పెట్టి ఆంధ్ర ప్రజలకు అబద్ధాలు వండి వారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏపీకి సాగరమాల కింద రూ.1240 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఏపీలో సాగర మాల పథకం కింద 12 ప్రాజెక్టులకు రూ.2,410 కోట్ల మేరకు కేంద్రం ఆర్థిక సాయం అందిస్తోందని రేవులు, షిప్పింగ్, జల మార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. విశాఖపట్నం రేవులో మౌలిక సదుపాయాల కల్పన, రేవు ఆధునీకరణ, తదితర ప్రాజెక్టులకు కూడా సహాయం అందిస్తున్నట్లు లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన వెల్లడించారు.



సచివాలయంలో సీఎం చంద్రబాబుతో సమావేశమైన నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరి


ఎయిమ్స్‌లో వివిధ విభాగాలను పరిశీలిస్తున్న నీతి ఆయోగ్ వైస్‌చైర్మన్ సుమన్ బేరీ

స్వర్ణాంధ్ర-2047కు సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

పలికారు. అనంతరం సచివాలయంలో బేరీ బృందం ఆయనతో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో అభివృద్ధికి ఉన్న అవకాశాలు, రాష్ట్ర ఆకాంక్షలపై చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ఇంటికొకరిని ఏఐ నిపుణులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఎంటర్‌ప్రెన్యూర్లను తీర్చిదిద్ది 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నెలకొల్పేందుకు ప్రణాళికాబద్ధంగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఏటా 15 శాతం వృద్ధిరేటు సాధించే దిశగా బలమైన ఆర్థిక వ్యవస్థను నెలకొల్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇది అనుకూలమైన సమయమని పేర్కొన్నారు. విభజన గాయాలు, గత ఐదేళ్లలో మూలధన వ్యయంపై నిర్లక్ష్యం లాంటి ఇబ్బందుల నుంచి గట్టెక్కి రాష్ట్రం బలపడేందుకు నీతి ఆయోగ్ సహకరించాలని కోరారు. హైదరాబాద్ స్థాయి నగరాన్ని పదేళ్ల క్రితమే వదులుకోవడం, పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడటం, గడిచిన ఐదేళ్లలో మౌలిక వసతుల కల్పన లేకపోవడం ఇబ్బందికరంగా పరిణమించాయని వివరించారు. పాలనాపరంగా ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా అభివృద్ధిలో ముందంజ వేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. దేశంలోనే మూడో అతిపెద్ద సముద్ర తీరం కలిగిన ఏపీలో పోర్టులు, హైవేలతో అతిపెద్ద కనెక్టివిటీ కలిగి ఉందని చెప్పారు. మూడు పారిశ్రామిక కారిడార్లతో తూర్పు ఆగ్నేయాసియాకు రాష్ట్రం గేట్‌వేగా ఉందని వివరించారు. పునరుత్పాదక విద్యుత్, డేటా టెక్నాలజీలో పెట్టుబడులు ఆకర్షించడం అత్యంత సానుకూల అంశాలుగా పేర్కొన్నారు. దేశంలోని నాలుగు గ్రోత్ హబ్‌లలో ఒకటిగా ఉన్న విశాఖ ఎకనమిక్ రీజియన్‌తో పాటు తిరుపతి, అమరావతిని రీజనల్ గ్రోత్ హబ్‌లుగా మలిచేందుకు సహకారం అందించాలని నీతి ఆయోగ్ బృందాన్ని సీఎం కోరారు.

పది ప్రధాన సూత్రాలకు ప్రాధాన్యం

విజన్-2047లోని పది ప్రధాన సూత్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఇండస్ట్రియల్ కారిడార్లు, స్కిల్లింగ్ హబ్‌లు, స్మార్ట్ సిటీలు, మౌలిక వసతుల బలోపేతంలో ఏపీ ప్రభుత్వం, నీతి ఆయోగ్ కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. నదుల అనుసంధానం, పీ4 విధానం ద్వారా పేదరిక నిర్మూలన అమలుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సీ పోర్టులు, ఎయిర్ పోర్టులు ఉన్న తిరుపతి, చెన్నై, నెల్లూరును ట్రై సిటీగా తీర్చిదిద్దితే ప్రగతి పరుగులు పెడుతుందని చంద్రబాబు అన్నారు. అన్ని రకాల రవాణా కనెక్టివిటీ ఉన్న ఈ మూడు నగరాల మధ్య అభివృద్ధికి అత్యద్భుత అవకాశాలు ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో తాను అభివృద్ధి చేసిన జీనోమ్ వ్యాలీలో ఇప్పుడు 700 కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని, అదే స్ఫూర్తితో రాష్ట్రంలోనూ అత్యుత్తమ పాలసీలు అమలు చేయాలనేది కూటమి ప్రభుత్వ విధానమని వివరించారు. ప్రజా రవాణా సంస్థలో ఉన్న 11వేల డీజిల్ బస్సుల స్థానంలో ఈవీ బస్సులు ప్రవేశపెట్టడంతో పాటు, అన్ని ఆర్టీసీ బస్టాండ్లపై రూఫ్ టాప్ సోలార్ పవర్ యూనిట్ల ఏర్పాటుచేసే యోచన ఉన్నట్లు చంద్రబాబు వెల్లడించారు.

ఎయిమ్స్ పురోగతిపై సమీక్ష

నీతి ఆయోగ్ వైస్‌చైర్మన్ సుమన్ బేరీ శుక్రవారం మంగళగిరి ఎయిమ్స్‌ను సందర్శించారు. ఎయిమ్స్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, సంస్థ సాధించిన పురోగతిని సమీక్షించారు. వైద్య విద్య, రోగుల సంరక్షణ సేవలపై ఆయనకు అధికారులు నివేదిక సమర్పించారు. ఓపీడీ నమోదు ప్రక్రియ, రోగులు వేచి ఉండే ప్రాంతాలు, రేడియేషన్, అంకాలజీ బ్లాకులను బేరీ పరిశీలించారు. మంగళగిరి ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అహంతెమ్ శాంతా సింగ్, అడ్మినిస్ట్రేషన్స్ డిప్యూటీ డైరెక్టర్ కల్నల్ శశికాంత్ తుమ్మా, అధికారులు పాల్గొన్నారు.

మీలాంటి నాయకుల వల్లే ప్రజల జీవితాలు మారతాయి

- చంద్రబాబును ప్రశంసించిన నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు

సీఎం చంద్రబాబుపై నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు సుమన్ బేరీ ప్రశంసలు కురిపించారు. 30ఏళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్ర గవర్నర్‌గా చేసిన రంగరాజన్‌తో కలిసి నాటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబును కలిసిన విషయాన్ని బేరీ గుర్తు చేసుకున్నారు. దేశంలో చాలామంది సీఎంలు ఉన్నా సంస్కరణలను అనుకూలంగా మార్చుకుని ప్రజలకు మేలు చేసిన నాయకుడు మీరేనని ప్రశంసించారు. వాజపేయి హయాంలో నాటి సంస్కరణలను అందిపుచ్చుకుని తీసుకొచ్చిన పాలసీలు ప్రజల జీవితాలను మార్చేశాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు అమలు చేసిన ప్రతి పాలసీ, ప్రతి సంస్కరణ తర్వాత కాలంలో దేశం పాటించిందని బేరీ వ్యాఖ్యానించారు. ఐటీకి ప్రోత్సాహంతో పాటు ఎయిర్‌పోర్టులు, ప్రైవేటు విద్యుత్తు ప్లాంట్లు, పీపీపీ పద్ధతిలో రోడ్ల వంటి అనేక ఆవిష్కరణలకు నాంది పలికారని ప్రశంసించారు. భవిష్యత్తు అవసరాలను గుర్తించి ఆలోచనలు, పాలసీలు అమలు చేసిన నాయకుల వల్లే ప్రజల జీవితాలు మారతాయని, సంస్కరణలు అందిపుచ్చుకున్న ఫలితాలు ఉమ్మడి ఏపీలో కనిపించాయని బేరీ పేర్కొన్నారు.

పాలనలో వేగం పెంచేందుకే ర్యాంకులు

- ఎవరినీ ఎక్కువ, తక్కువ చేయడానికి కాదు
- లక్ష్యాలను వేగంగా చేరుకోవాలంటే ప్రభుత్వంలో ప్రతి ఒక్కరూ కష్టపడాలి: సీఎం

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ టీమ్ స్పిరిట్‌తో పనితీరును సమీక్షించుకుని పనిచేయాలన్నదే తన ఆలోచన అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇందులో భాగంగానే ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రులకు ర్యాంకులు ఇచ్చామని.. ఈ ప్రక్రియ ఎవరినీ ఎక్కువ చేయడానికి కాదు.. ఎవరినీ తక్కువ చేయడానికి కాదని స్పష్టం చేశారు. ఎవరు ఏ స్థానంలో ఉన్నారో చెప్పడం ద్వారా తమతో తాము పోటీ పడడం.. ఒకరితో మరొకరు పోటీపడి పనిచేయడం.. పాలనలో వేగం పెంచడం తమ ఉద్దేశమని శుక్రవారం 'ఎక్స్'లో పెట్టిన సుదీర్ఘ పోస్టులో పేర్కొన్నారు. లక్ష్యాలను వేగంగా చేరుకోవాలంటే ప్రభుత్వంలో ఉన్న ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. టీమ్ వర్క్‌తో ఉత్తమ ఫలితాలు సాధించగలమని నమ్ముతానని తెలిపారు. 'పీపుల్ ఫస్ట్ విధానంతో నేను, కేబినెట్ సహచరులు పనిచేస్తున్నాం. గ్రామస్థాయిలో చిరుద్యోగి నుంచి సీఎం వరకు అంతా కష్టపడి పనిచేస్తేనే ప్రజల సమస్యలు, కష్టాలు తీర్చి.. సమస్యల సుడిలో ఉన్న రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టగలం. సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేస్తాం. ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తాం' అని సీఎం పునరుద్ఘాటించారు.

ఎన్డీయే వైస్ చైర్మన్ పదవిపై ఎలాంటి చర్చ జరగలేదు!

- మోదీ నాయకత్వానికి అందరి మద్దతు
- దేవగౌడ వ్యాఖ్యలను ఖండించిన నడ్డా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తర్వాత టీడీపీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఎన్డీయే వైస్ చైర్మన్ పదవి ఆశించారంటూ మాజీ ప్రధానిదేవగౌడ చేసిన వ్యాఖ్యలను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఖండించారు. ఎన్డీయే వైస్ చైర్మన్ గురించి ఎలాంటి చర్చ జరగలేదని.. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నానని తెలిపారు. ఎన్డీయేలోని నాయకులంతా మోదీ నాయకత్వాన్ని అంగీకరించారని చెప్పారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై దేవెగౌడ మాట్లాడారు. మోదీ నాయకత్వాన్ని కొనియాడుతూ చంద్రబాబు ప్రస్తావన తెచ్చారు. 'చంద్రబాబు ఎన్డీయే కూటమికి చైర్మన్ లేదా వైస్ చైర్మన్ కావాలని ఆశించారు. మోదీ అందుకు అంగీకరించలేదు. మోదీ ఈ దేశంలోనే అత్యంత సమర్థవంతమైన నేత" అని అన్నారు. దీనిపైనే నడ్డా శుక్రవారం స్పందించారు.

సాంకేతిక 'సాగు'

ఐదేళ్లలో 30% వృద్ధిరేటు లక్ష్యం

జిల్లాల్లో వ్యవసాయ సదస్సులు

- సాగు అనుబంధ శాఖల సమీక్షలో సీఎం

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): "వ్యవసాయంతో పాటు ఉద్యాన, ఆక్వా, పశు సంపదకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. సాగుకు సాంకేతికతను జోడించాలి. డ్రోన్స్, శాటిలైట్, సెన్సార్, డీప్‌టెక్ వినియోగించి వ్యవసాయ అనుబంధ రంగాల్లో వృద్ధి సాధించాలి" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తొలిదశలో 20% వృద్ధి రేటు తగ్గకుండా చూడాలని తెలిపారు. 'అగ్రివాచ్' సంస్థ ద్వారా గత 10-15 ఏళ్ల వివరాలను విశ్లేషించి, రానున్న ఐదేళ్లలో 30% వృద్ధి రేటు సాధించాలని నిర్దేశించారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చించిన అంశాలు, సీఎం ఆదేశాలను మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. "ఇటీవల అనంతపురంలో నిర్వహించిన హార్టీకల్చర్ సదస్సు తరహాలో ప్రతి జిల్లాలో శాఖల వారీగా సదస్సులు నిర్వహించనున్నాం. రైతులు, శాస్త్రవేత్తల నుంచి అభిప్రాయాలు తెలుసుకుంటాం. పండ్లు, పాలు, మాంస ఉత్పత్తిలో వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. డ్వాక్రా సంఘాలతో గడ్డి క్షేత్రాలను ఏర్పాటు చేయించనున్నాం" అని వివరించారు. మారిన ఆహార అలవాట్ల నేపథ్యంలో డిమాండ్‌కు తగ్గట్టు తృణధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేలా రైతుల్ని ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. డెల్టాలో వరి నారుమళ్లకు జూన్‌లోనే నీరు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల 120 రోజుల్లోనే తొలి పంట, 80 రోజుల్లో రెండో పంట చేతికి అందుతుందన్నారు. ఆయిల్‌పామ్, డ్రాగన్ ఫ్రూట్, అంతరపంటగా కోకో వంటి వాటిని ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 50 వేల ఎకరాలకు మైక్రో ఇరిగేషన్ పరికరాలు రాయితీపై అందిస్తామన్నారు. సేంద్రియ పద్ధతులు అనుసరించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గేలా రైతులను ప్రోత్సహిస్తామని మంత్రి చెప్పారు. నాణ్యమైన ధాన్యం పండించే రైతులను గుర్తించి.. బోనస్‌లు ఇవ్వాలని సీఎం ఆదేశించినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ఉద్యాన రైతులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి, అవసరమైతే రూ.200 కోట్లు ఖర్చు చేయడం ద్వారా డిమాండ్ తగ్గట్టు చిరుధాన్యాల ఉత్పత్తిని పెంచుతామన్నారు. ఈ పంటలకు మద్దతు ధరను రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుందని తెలిపారు. "బీసీల్లో గౌడలకు మద్యం దుకాణాలు, వడ్డెరలకు క్వారీలు ఇస్తున్నట్లే యాదవ, కురుబలకు గొర్రెలు, మేకల యూనిట్లు రాయితీపై ఇవ్వాలని నిర్ణయించాం. ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్‌లో చేపలు, రొయ్యల చెరువులకు లైసెన్స్ విధానాన్ని ప్రవేశ పెట్టనున్నాం" అని చెప్పారు.

ఉద్యోగులకు, విద్యార్థులకు పండగే!

వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశు వైద్య, విశ్వవిద్యాలయాల ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. ప్రస్తుతం వ్యవసాయ, పశువైద్య విద్యార్థులకు రూ.7 వేలు స్టైపెండ్ ఇస్తున్నట్లు తెలిపారు. అయితే, బీఎస్సీ, బీవీఎస్సీ విద్యార్థులకు దీనిని రూ.7 వేల నుంచి రూ.10,500లకు, పీజీ విద్యార్థులకు రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ.. గత 10-15 ఏళ్ల డేటా ఆధారంగా పంటల పరిస్థితిని అంచనా వేసి, అంతర్జాతీయ మార్కెట్‌లో రైతులకు మంచి ధర లభించేలా కృషి చేస్తామని చెప్పారు.

క్యారెక్టర్ ఖాళీ.. విలువలు సున్నా!



(మొదటి పేజీ తరువాయి)

తల్లిపైనే కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయసాయి రెడ్డికి ఇష్టంలేకపోయినా, ఆయనపై ఒత్తిడి తెచ్చి.. తనను తిట్టించారన్నారు. "జగన్ క్యారెక్టర్ ఖాళీ సీసాలాంటిది. ఆయన క్యారెక్టర్ సున్నా" అని తేల్చేశారు. శుక్రవారం బెంగళూరు నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న షర్మిల మీడియాతో మాట్లాడారు. "జగన్‌కు విశ్వసనీయత, విలువలు ఏమాత్రం లేవు. నీతులు చెబుతారు కానీ పాటించరు. వైఎస్ రాజశేఖర రెడ్డి పేరు చెప్పుకొని జగన్ అధికారంలోకి వచ్చారు. వైఎస్ ఆశయాలనే కాలరాశారు" అని విమర్శించారు. చిన్నాన్న వైఎస్ వివేకానంద రెడ్డిని చంపించింది అవినాశ్ రెడ్డే అని సీబీఐ చెప్పిన తర్వాత కూడా.. ఆయనను తన పక్కన కూర్చోబెట్టుకున్నారని ఆక్రోశించారు.

సాయిరెడ్డితో భేటీలో...

వైసీపీకి రాజీనామా చేసిన అనంతరం విజయసాయిరెడ్డి హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో షర్మిలతో భేటీ అయినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ఆమె ఇప్పుడు ధ్రువీకరించారు. సాయిరెడ్డితో జరిగిన సమావేశంలో చాలా విషయాలు చర్చకు వచ్చాయని షర్మిల చెప్పారు. "జగన్ సొంత తల్లి మీద కేసు పెట్టించారు. నిజాలు వెల్లడిస్తా.. ఆయన కుట్రను నేను బయటపెట్టాను. అయితే.. అవన్నీ అబద్ధాలని చెప్పాలంటూ సాయిరెడ్డిపై జగన్ ఒత్తిడి తెచ్చారు. ఆయనే స్వయంగా సాయిరెడ్డికి ఫోన్ చేసి... ప్రెస్‌మీట్ పెట్టాలన్నారు. అందుకు ఆయన నిరాకరించినా... జగన్ ఒప్పుకోలేదు. ఆస్తుల్లో ఇద్దరు బిడ్డలకూ సమానవాటా ఉందని మా తండ్రి జీవించి ఉన్నప్పుడే సాయిరెడ్డి చెప్పారు. తనను వదిలేయాలని సాయిరెడ్డి వేడుకోవడంతో వైవీ సుబ్బారెడ్డితో మాట్లాడించారు. ఆ తర్వాత మళ్లీ సాయిరెడ్డి మీద జగన్ ఒత్తిడి చేశారు. తనకు ఇష్టంలేదని, కుదరదని సాయిరెడ్డి చెప్పినా జగన్ వినిపించుకోలేదు. సాయిరెడ్డి మాట్లాడాల్సిన అంశాలన్నీ స్వయంగా జగన్ నోట్ ఇచ్చారట! ఏం మాట్లాడాలో 40 నిమిషాలు డిక్టేట్ చేశారట" అని షర్మిల వివరించారు. జగన్ నైజం ఏమిటో విజయసాయిరెడ్డి అర్థం చేసుకున్నారని... ఈ విషయాలను ఆయన చెబుతుంటే తనకు చాలా బాధేసిందని, కన్నీళ్లు వచ్చాయని అన్నారు.

ఇంత దిగజారడమా...

వైఎస్ కుమారుడై ఉండి ఇంతలా దిగజారాలా అని జగన్‌పై షర్మిల మండిపడ్డారు. "క్యారెక్టర్‌లేని జగన్... క్యారెక్టర్ మీద డైలాగులు చెబుతున్నారు. ఆ పదానికి అర్థం కూడా ఆయనకు తెలియదు. తనను వదిలేయాలని బతిమలాడిన సాయిరెడ్డిపై ఒత్తిడి చేయడమేనా క్యారెక్టర్?" అని నిలదీశారు. సొంత మేనల్లుడు, మేనకోడలి ఆస్తిని కాజేయాలని జగన్ చూశారని ఆరోపించారు. 'మీరు చేసిన కుట్రలేమిటో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఆస్తుల కోసం జగన్, ఆయన భార్య ఎంత దిగజారిపోయారో బైబిల్ ముందు కూర్చుని ఆలోచించాలి. అబద్ధాలు ఆడకూడదంటూనే జగన్ అబద్ధాలు చెబుతారు. అవే నిజాలని నమ్మించే ప్రయత్నం చేస్తారు" అంటూ జగన్‌పై ధ్వజమెత్తారు.

ఇదేనా క్రెడిబులిటీ...

వైఎస్ బీజేపీకి వ్యతిరేకమని... ఇప్పుడు అదే బీజేపీతో జగన్ అక్రమ సంబంధం పెట్టుకున్నారని షర్మిల అన్నారు. వైఎస్ జలయజ్ఞం ప్రాజెక్టులు మొదలు పెట్టాగా... వాటిని ఆరు నెలల్లో పూర్తి చేస్తానని జగన్ ప్రకటించారని గుర్తుచేశారు. క్రెడిబిలిటీ ఉంటే ప్రాజెక్టుల జగన్ ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. " నాసిరకం మద్యంతో ప్రజల జీవితాలతో ఆడుకున్నప్పుడు క్రెడిబిలిటీ ఏమైంది? రుషికొండను తొలచి రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టినప్పుడే ఆయన విశ్వసనీయత పోయింది. ఆయనకు క్రెడిబులిటీ లేదు. డబ్బు ఉందనే అహంకారం మాత్రం ఉంది" అని విమర్శించారు.

మార్ఫింగ్‌పై 9 గంటల విచారణ

ఒంగోలు పోలీసుల ముందుకు ఆర్జీవీ

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఫొటోలు మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమంలో పెట్టిన వ్యవహారంపై సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ శుక్రవారం ఒంగోలులో పోలీసు విచారణకు హాజరయ్యారు. మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో గతేడాది నవంబరులో ఆయనపై కేసు నమోదైన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు ఆయన ఒంగోలు రూరల్ స్టేషన్‌కు వచ్చి విచారణాధికారి సీఐ శ్రీకాంత్‌బాబు ఎదుట హాజరయ్యారు. కారులో ఆయన వెంట ఓ మహిళ, ఒక అసిస్టెంట్ కూడా వచ్చారు. ఆర్జీవీతో పాటు స్టేషన్‌లోకి వెళ్లేందుకు సదరు అసిస్టెంట్ ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. మహిళ కారులోనే ఉండిపోయారు. రాత్రి 9 గంటలకు విచారణ ముగిసింది. 9 గంటలపాటు ఆయన్ను ప్రశ్నించారు. మొదటి 5గంటల విచారణలో మూడుసార్లు టీ బ్రేక్ ఇచ్చారు. విచారణలో ఎక్కువ సమయం వర్మ సెల్‌ఫోన్‌పైనే సాగినట్లు తెలిసింది. ఆ ఫోన్‌ను పరిశీలించాలని విచారణాధికారి అడుగగా.. తాను తీసుకురాలేదని, హైదరాబాద్‌లోనే ఉంచి వచ్చినట్లు సమాధానం ఇచ్చారు. దీంతో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో సెల్ లొకేషన్ కనిపెట్టారు. ఆ సిగ్నల్ స్థానిక వైసీపీ కార్యాలయం వద్ద చూపడంతో పోలీసులు అక్కడకు వెళ్లగా వర్మ వచ్చిన కారు అక్కడే ఉంది. అక్కడ వెతికినా ఫోన్ దొరక్కపోవడంతో పోలీసులు వెనుదిరిగారు. వైసీపీ నాయకులతో ఉన్న సంబంధాలపై విచారణాధికారి ప్రశ్నించగా.. వారితో వ్యక్తిగత పరిచయాలు మాత్రమే ఉన్నాయని ఆర్జీవీ చెప్పినట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి స్నేహితుడు కాబట్టే కలిశానని సమాధానమిచ్చినట్లు తెలిసింది. ఫైబర్‌నెట్ నుంచి అందుకున్న రూ.2 కోట్లపై ప్రశ్నించగా నోరు విప్పలేదని సమాచారం. మరోసారి విచారణకు రావలసి ఉంటుందని విచారణాధికారి చెప్పినట్లు తెలిసింది. వచ్చేటప్పుడు సెల్‌ఫోన్‌తో రావాలని కోరినట్లు సమాచారం. కాగా.. వర్మకు సీఐడీ కూడా నోటీసులు ఇచ్చింది. ఈ నెల 10న గుంటూరు సీఐడీ కార్యాలయంలో విచారణకు రావాలంటూ ఒంగోలు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఆయనకు సీఐడీ సీఐ తిరుమలరావు నోటీసులు అందజేశారు. 2019లో ఆర్జీవీ 'కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' సినిమా తీశారు. అందులోని సన్నివేశాలతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటూ తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు వంశీకృష్ణ గత నవంబరు 29న సీఐడీ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.


మద్దిపాడు సమీపంలో ఆర్జీవీకి స్వాగతం పలుకుతున్న చెవిరెడ్డి, బూచేపల్లి, అన్నా రాంబాబు, దద్దాల నారాయణ తదితరులు

వర్మకు వైసీపీ నేతల స్వాగతం

పోలీసుల విచారణకు హాజరయ్యేందుకు వచ్చిన రామ్‌గోపాల్ వర్మకు మద్దిపాడులోని ఓ ప్రైవేటు హోటల్ వద్ద వైసీపీ నేతలు సాదరంగా స్వాగతం పలికారు. ఆయన్ను కలిసినవారిలో చెవిరెడ్డి భాస్కర రెడ్డి, వైసీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణతో పాటు పలువురు వైసీపీ నాయకులు ఉన్నారు. 'మీకు అండగా మేమున్నాం' అని వారు భరోసా ఇచ్చారు.

క్యారెక్టర్ ఉంది.. భయం లేదు!

- అందుకే ఎవరికీ లొంగలేదు: జగన్ వ్యాఖ్యలకు సాయిరెడ్డి కౌంటర్

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 'నాయకుడికి క్యారెక్టర్, క్రెడిబులిటీ ఉండాలి. సాయిరెడ్డికైనా, ఇంకెవరికైనా ఇదే వర్తిస్తుంది' అంటూ వైసీపీ అధ్యక్షుడు జగన్ చేసిన వ్యాఖ్యలకు ఆ పార్టీ మాజీ నేత విజయసాయిరెడ్డి కౌంటర్ ఇచ్చారు. 'నేను ప్రలోభాలకు లొంగలేదు. నాకు భయం లేదు' అని 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. "వ్యక్తిగత జీవితంలో కూడా విలువలు, విశ్వసనీయత, క్యారెక్టర్ ఉన్నవాడిని. అందుకే ఎవరికీ, ఎలాంటి ప్రలోభాలకీ లొంగలేదు. భయం అనేది నా అణువు అణువులోనూ లేదు. కాబట్టే రాజ్యసభ పదవి, పార్టీ పదవులు, రాజకీయాలనే వదులుకున్నా" అని తెలిపారు.

నేనేంటో ప్రజలకు తెలుసు: మోపిదేవి

"మేము ప్రలోభాలకు లొంగేవాళ్లం, భయపడేవాళ్లం అవునో, కాదో నా నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసు. అంతకంటే ముందు జగన్‌కు కూడా తెలుసు. నాకు కొత్తగా సర్టిఫికెట్ అవసరం లేదు" అని మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణ అన్నారు. ఒకవేళ భయపడే వాడినైతే జగన్‌తో పాటు కేసులో పెట్టినప్పుడే పారిపోయే వాడినన్నారు. "అన్నింటికీ తట్టుకుని ఆ రోజు నిలబడ్డా. ప్రలోభాలకు, ఒత్తిడికి లొంగి రాజకీయం చేయడం, రాజీనామాలు చేయడం అనే ఆరోపణలు అర్థ రహితం. భయపడే తత్వం నా రక్తంలోనే లేదు" మోపిదేవి తెలిపారు.

ఇప్పుడు అప్యాయత... తర్వాత అత్యాచారం!

- సాకే నిర్ణయం బాధాకరం: డొక్కా

వైసీపీలో విలువలు ఉండవు.. అది ఒక దుర్మార్గపు పార్టీ అని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ధ్వజమెత్తారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్ వైసీపీలో చేరడంపై ఆయన స్పందించారు. "పార్టీలో చేరేటప్పుడు అప్యాయంగా మాట్లాడతారు. ఆ తర్వాత రాజకీయంగా అత్యాచారం చేస్తారు. ఇప్పటికే ఆ పార్టీలో చేరిన 74మంది దళితుల విషయంలో అదే జరిగింది. అభ్యుదయ భావాలు కలిగిన శైలజానాథ్ దళిత వ్యతిరేక భావాలు కలిగిన వైసీపీలో చేరడం బాధాకరం" అని అన్నారు. వైసీపీ నేతలు మొదట మనిషిలా మాట్లాడతారని.. ఆ తర్వాత చంపి తినేస్తారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీలో ఉన్న ఆంధ్రా శశికళకు దళితులు అంటే అసలు పడదన్నారు. గతంలో తాను కూడా వైసీపీ వారి మాటలు విని ఆ పార్టీలో చేరి మోసపోయానని డొక్కా ఆవేదన వ్యక్తం చేశారు.

వైసీపీలోకి సాకే శైలజానాథ్

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ వైసీపీలో చేరారు. పార్టీ అధ్యక్షుడు తాడేపల్లి ప్యాలెస్‌లో శైలజానాథ్‌కు వైసీపీ కండువా కప్పి, ఆలింగనం చేసుకొని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆ సమయంలో ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తదితరులు ఉన్నారు. ఎన్నికలకు ముందే శైలజానాథ్ పార్టీ మారతారంటూ ప్రచారం జరిగింది. ఆ సమయంలో ప్రాంతీయ పార్టీల్లో చేరినా టికెట్ దక్కే పరిస్థితి లేకపోవడంతో మౌనంగా ఉండిపోయారు. ఇప్పుడు వైసీపీలో చేరారు.


సాకే శైలజానాథ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జగన్

మాజీ మంత్రి రజనీపై కేసు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీమంత్రి విడదల రజనీపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు నమోదైంది. ఆమెకు పీఏలుగా పనిచేసిన ఎస్.జయ ఫణీంద్ర, రామకృష్ణ, అప్పటి చిలకలూరిపేట అర్బన్ సీఐ వి.సూర్యనారాయణపై కూడా కేసు నమోదైంది. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన టీడీపీ దళిత నాయకుడు పిల్లి కోటి 2019లో పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి హోదాలో సోషల్‌మీడియాలో రజిని చట్ట వ్యతిరేక వ్యవహారాలకు సంబంధించి పోస్టులు పెట్టారు. అందుకు కోటిని ఐదు రోజులు పాటు చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో చిత్రహింసలకు గురిచేశారు. నాటి ఘటనపై పోలీసులకు ఆయన తాజాగా ఫిర్యాదు చేశారు.

రైలులో గర్భిణిపై అత్యాచారయత్నం

- ప్రతిఘటించడంతో కదిలే రైలు నుంచి తోసివేత
- చిత్తూరు జిల్లా యువతికి తీవ్ర గాయాలు
- తమిళనాడు యువకుడి అరెస్టు


నిందితుడు హేమరాజ్

చెన్నై, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రైలు బోగీలో ఒంటరిగా ఉన్న గర్భిణిపై అత్యాచారానికి ప్రయత్నించాడో యువకుడు. ఆమె ప్రతిఘటించి పెద్దగా కేకలు వేయడంతో... ఆమెపై దాడి చేసి కదిలే రైలు నుంచి కిందకి తోసేశాడు. ఈ ఘటనలో చిత్తూరు జిల్లాకు చెందిన మహిళ తీవ్రంగా గాయపడి, వేలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా, లైంగిక దాడికి ప్రయత్నించిన తమిళనాడుకు చెందిన హేమరాజ్‌ను జోలార్‌పేట రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడులోని తిరుప్పూరుకు చెందిన జమిన జోసెఫ్ భార్య నాలుగు నెలల గర్భవతి. చిత్తూరు సమీపంలోని మంగసముద్రం ఆమె పుట్టినిల్లు. గురువారం ఆ యువతి (36) కోయంబత్తూరు-తిరుపతి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో పుట్టింటికి బయల్దేరింది. వేకువజామున తిరుప్పూరులో మహిళా బోగీ ఎక్కగా... అందులో ఉన్న మరో నలుగురైదుగురు మహిళలు జోలార్‌పేట స్టేషన్ వచ్చేసరికి దిగిపోయారు. వేలూరు జిల్లా కేవీ కుప్పంకు చెందిన హేమరాజ్ (28) జోలార్‌పేటలో మహిళా బోగీ ఎక్కాడు. ఆ యువతి ఒంటరిగా ఉండటాన్ని గమనించి ఆమెపై అత్యాచారానికి ప్రయత్నించాడు. తీవ్రంగా ప్రతిఘటించిన ఆమె పెద్దగా కేకలు వేయడంతో.. ఆమెపై దాడిచేశాడు. అనంతరం కదిలే రైలు నుంచి బయటకు తోసేశాడు. కాళ్లు, చేతులు, తలకు బలమైన గాయాలై రైలు పట్టాల పక్కన అపస్మారక స్థితిలో పడివున్న ఆమెను రైల్వే సిబ్బంది గమనించి.. వేలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు జోలార్‌పేట స్టేషన్‌లో సీసీ కెమెరాల ఆధారంగా హేమరాజ్‌ను గుర్తించి.. శుక్రవారం ఉదయం అతడిని కేవీ కుప్పంలో అరెస్టు చేశారు.

కశ్మీర్‌లో ఏడుగురు చొరబాటుదారుల హతం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: నియంత్రణ రేఖను దాటివచ్చి భారత సైన్యానికి చెందిన ఫార్వర్డ్ పోస్టుపై దాడికి యత్నించిన ఏడుగురు చొరబాటుదారులను భద్రతా బలగాలు హతమార్చాయి. చనిపోయిన వారిలో ఇద్దరు ముగ్గురు పాక్ ఆర్మీకి చెందినవారిగా భావిస్తున్నట్లు సైనిక వర్గాలు తెలిపాయి. మిగిలినవారు అల్-బదర్ గ్రూప్ ఉగ్రవాదులు కావొచ్చని పేర్కొన్నాయి. జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడటానికి యత్నించారు. మెరుపువేగంతో స్పందించిన భారత సైన్యం వారిపై కాల్పులు జరిపి మట్టుబెట్టింది. ఈ చొరబాటు, దాడి యత్నం వెనుక పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీమ్(బీఏటీ) ఉందని భావిస్తున్నారు.

హయగ్రీవ కేసులో.. కదిలిన డొంక!


ఎండాడలో హయగ్రీవ స్థలంలో నిర్మాణాలు

మాజీ ఎంపీ ఎంవీవీ ఆస్తులు జప్తుచేసిన ఈడీ

- వృద్ధాశ్రమం కోసం కొన్న సర్కారు భూమిని నకిలీ డాక్యుమెంట్లతో లాక్కున్న ఎంవీవీ!
- ప్రభుత్వ భూమి సొంత అవసరాలకు
- తద్వారా ఆయన, మరో ముగ్గురికి రూ.87.64 కోట్లు లబ్ధి
- గత ఏడాది కేసుపెట్టిన హయగ్రీవ యజమాని
- దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- ఎంవీవీ ఇల్లు, కార్యాలయంలో సోదాలు
- కీలక పత్రాల ఆధారంగానే ఇప్పుడు చర్యలు



విశాఖపట్నం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తీగ లాగితే డొంక కదిలినట్టుగా హయగ్రీవ ఫార్మ్ అండ్ డెవలపర్స్ కేసులో కీలక వివరాలు వెలుగుచూశాయి. దీంతో ఆ సంస్థకు చెందిన రూ.44.75 కోట్ల స్థిర, చరాస్తులను జప్తు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం ప్రకటించింది. ఇందులో వైసీపీ నేత, విశాఖపట్నం మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు చెందిన ఆస్తులు కూడా ఉండడం గమనార్హం. వృద్ధులు, అనాథలకు ఆశ్రమం నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి తాను ఎండాడలో కొనుగోలు చేసిన 12.51 ఎకరాలను గద్దె బ్రహ్మాజీ, జి.వెంకటేశ్వరరావు (జీవీ), ఎంవీవీ సత్యనారాయణ.. సంతకాలు ఫోర్జరీ చేసి, నకిలీ డాక్యుమెంట్లతో స్వాధీనం చేసుకున్నారని హయగ్రీవ ఫార్మ్ అండ్ డెవలపర్స్ యజమాని చిలుకూరి జగదీశ్వరుడు విశాఖలోని ఆరిలోవ పోలీసు స్టేషన్‌లో గత ఏడాది కేసు పెట్టారు. దానిపై ఈడీ విచారణ చేపట్టింది. దర్యాప్తులో భాగంగా గత ఏడాది అక్టోబరులో ఎంవీవీ ఇల్లు, లాసన్స్‌బే కాలనీలోని కార్యాలయంలో సోదాలు నిర్వహించి కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. జగదీశ్వరుడు ప్రభుత్వం నుంచి ఆ భూమిని 2010లో రూ.5.63 కోట్లకు కొనుగోలు చేశారని, అయితే నాటి మార్కెట్ విలువ ప్రకారం ఆ ఆస్తి విలువ రూ.30.25 కోట్లు ఉంటుందని ఈడీ ఓ ప్రకటనలో పేర్కొంది. 'గద్దె బ్రహ్మాజీ, జి.వెంకటేశ్వరరావు, అప్పటి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ హయగ్రీవ సంస్థలో 2020లో భాగస్వాములుగా చేరారు. 2021-22 మధ్య దాదాపు 30 విక్రయ ఒప్పందాల (సేల్ డీడ్స్) ద్వారా ఆ భూమిని బ్రహ్మాజీ, జీవీ, ఎంవీవీ బిల్డర్స్ పేరు మీదకు జగదీశ్వరుడు బదిలీ చేశారు. ఆయన కూడా 2010-11, 2019లో ఎనిమిది మంది వేర్వేరు వ్యక్తులకు ఆ భూమిని విక్రయించడానికి ఒప్పందాలు చేసుకున్నారు. వాటి ద్వారా లబ్ధి కూడా పొందారు. ఇది 'ప్రొసీడ్స్ ఆఫ్ క్రైమ్' (పీవోసీ). జగదీశ్వరుడు, గద్దె బ్రహ్మాజీ, జీవీ, ఎంవీవీ సత్యనారాయణ రూ.87.64 కోట్లు లబ్ధి పొందారు. ఆ మొత్తాన్ని వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారు. ప్రభుత్వ భూమిని ఒక ఉద్దేశం కోసం తీసుకుని దుర్వినియోగం చేసి, అక్రమంగా లబ్ధి పొందినందుకు మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద కేసు నమోదు చేశాం. వారి రూ.44.75కోట్ల ఆస్తులు జప్తుచేశాం' అని వివరించింది. ఇందులో స్థిరాస్తుల విలువ రూ.42.03 కోట్లు, చరాస్తులు రూ.2.71 కోట్లు. ఎంవీవీ సత్యనారాయణకు చెందిన ఎంవీవీ బిల్డర్స్ ఆస్తులతో పాటు గద్దె బ్రహ్మాజీ భార్య, జగదీశ్వరుడి భార్య ఆస్తులు కూడా ఉన్నట్లు ఈడీ తెలిపింది.

అవినీతి అధికారికి అందలమా?

- ఆడిట్ విభాగం డైరెక్టర్‌గా హరిప్రకాశ్‌ను నియమించేందుకు ప్రయత్నాలు.. వైసీపీ హయాంలో తీవ్ర ఆరోపణలు
- విచారణ జరుపుతున్న విజిలెన్స్.. రిటైర్మెంట్‌కు ముందు కీలక పదవి?

అమరావతి, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ సర్కారులో తీవ్ర ఆరోపణలు వచ్చిన, విజిలెన్స్ విచారణ ఎదుర్కొంటున్న అధికారిని ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అందలం ఎక్కించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వైసీపీ హయాంలోనే ఆడిట్ విభాగం డైరెక్టర్ పదవి నుంచి తప్పించిన ఈ వివాదాస్పద వ్యక్తిని మళ్లీ అదే పోస్టులో నియమించేందుకు పావులు కదుపుతున్నారు. గతంలో ఎఫ్ఏసీ ప్రాతిపదికన స్టేట్ ఆడిట్ శాఖకు ఆర్ హరిప్రకాశ్ డైరెక్టర్‌గా పనిచేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయనపై తీవ్ర అవినీతి ఆరోపణలు వచ్చాయి. వివిధ జిల్లాల్లో అధికారుల బదిలీలు, పోస్టింగ్‌ల విషయంలో అడ్డగోలుగా వ్యవహరించినట్టు విమర్శలు ఉన్నాయి. లంచాలు తీసుకుని పోస్టింగ్‌లు కట్టబెట్టినట్టు ఆరోపణలు రావడంతో గుంటూరులోని విజిలెన్స్ విభాగం విచారణ జరుపుతోంది. హరిప్రకాశ్‌పై ఆరోపణలు చేసిన వారి నుంచి ఆధారాలు కూడా సేకరించింది. విచారణకు సహకరించాలని విజిలెన్స్ అధికారులు ఆయన్ను ఆదేశించారు. మరో నెలలో హరిప్రకాశ్ రిటైర్ కాబోతున్నారు. సాధారణంగా ఇలాంటి సమయంలో అధికారులకు కీలక పోస్టింగ్‌లు ఇవ్వరు. అయితే ఆయనకు ఆడిట్ విభాగం డైరెక్టర్‌గా ఉన్నత స్థాయి పదవి కట్టబెట్టే ప్రయత్నాలపై పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇందులో కొందరు అధికారుల పాత్ర ఉన్నట్టు సమాచారం. ఆయన నియామకానికి సంబంధించిన ఫైలు ప్రస్తుతం ఆర్థిక శాఖ వద్ద ఉన్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న పలువురు అధికారులను పక్కన పెడుతున్న కూటమి ప్రభుత్వం.. హరిప్రకాశ్ నియామకం విషయంలో పునరాలోచించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

టీడీఆర్ బాండ్లలో 10 కోట్ల అవినీతి

- జగన్ హయాంలోనే జారీ... డోర్ నంబర్లు మార్చి మెక్కేసిన అధికారులు
- గుంటూరులో విజిలెన్స్ విచారణ... నోటీసులు

(గుంటూరు సిటీ- ఆంధ్రజ్యోతి)

గుంటూరు నగర పాలక సంస్థ, పురపాలక సంఘాల్లో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇల్లు, స్థలాలు కోల్పోయిన వారికి జారీచేసిన 'టీడీఆర్ బాండ్స్' వ్యవహారంలో భారీ అవినీతి, అక్రమాలు జరిగినట్లు తెలిసింది. ఈ విషయాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్ధారించింది. జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లలో కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రభుత్వ ఖజానాకు గండికొట్టినట్లు గుర్తించారు. రోడ్డు అభివృద్ధి ప్రణాళిక(ఆర్‌డీపీ) లేకుండానే టీడీఆర్ బాండ్లు జారీ చేసినట్లు విచారణలో తేలింది. గుంటూరు, మంగళగిరి కార్పొరేషన్‌లతో పాటు, 10 మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 750 టీడీఆర్ బాండ్లు జారీఅయ్యాయి. మార్కెట్ విలువ తక్కువగా ఉన్న చోట ఎక్కువగా ఉన్నట్టు చూపించి ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూర్చేలా అధికారులు లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారని, ఈ క్రమంలో డోర్ నెంబర్లు సైతం మార్చేశారని విచారణాధికారులు గుర్తించారు. ఒక్క గుంటూరు ప్రాంతంలోనే రూ.5.85 కోట్ల వరకు ఖజానాకు నష్టం జరిగిందని గుర్తించారు. గుంటూరు, మంగళగిరి, చిలకలూరిపేట, చీరాలలో చాలా చోట్ల రోడ్డు అభివృద్ధి ప్రణాళికలు రూపొందించకుండానే ఇష్టం వచ్చినట్లు టీడీఆర్ బాండ్లు ఇచ్చేశారు. దీంతో రూ.10కోట్ల వరకు ఖజానాకు నష్టం వాటిల్లిందని తేలింది. 10 మంది టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ వ్యవహారంలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. వారికి విజిలెన్స్ అధికారులు నోటీసులు జారీ చేశారు. విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

పెద్దిరెడ్డి భూముల్లో కలెక్టర్ పరిశీలన

- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఫాం హౌస్‌కు అధికారులు
- ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో ప్రాధాన్యం

కల్లూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మంగళంపేట సమీప అటవీ ప్రాంతంలో ఉన్న మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్(జేసీ) విద్యాధరి, డీఎఫ్‌వో భరణి తదితరులు శుక్రవారం పలుదఫాలుగా పరిశీలించారు. పెద్దిరెడ్డి.. భూములు ఆక్రమించారంటూ వచ్చిన ఆరోపణల క్రమంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీంతో గత శుక్రవారం సదరు భూములున్న ప్రాంతాన్ని జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి పరిశీలించి సర్వే చేశారు. కానీ, వివరాలు వెల్లడించలేదు. వారం తర్వాత రెండోసారి జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ జయసింహ, ఎస్ఐ వెంకటేశ్వర్లు శుక్రవారం ఉదయం ఆ ప్రాంతానికి చేరుకున్నారు. కొద్ది సేపటికి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చేరుకుని అధికారులతో మాట్లాడారు. గంట తర్వాత కలెక్టర్, ఎస్పీ వెళ్లిపోగా మధ్యాహ్నానికి మిగిలిన అధికారులు అక్కడి నుంచి కల్లూరు జడ్పీ బంగళాకు చేరుకున్నారు. భోజనం తర్వాత మరోసారి వ్యవసాయ క్షేత్రం వద్దకు చేరుకుని మళ్లీ పరిశీలించారు. అయితే, ఈసారి కూడా ఎలాంటి వివరాలూ వెల్లడించలేదు. అధికారుల పరిశీలన నేపథ్యంలో పెద్దిరెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లే మార్గాన్ని పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. సుమారు 5 కిలో మీటర్ల పరిధిలో లోపలికి ఎవరినీ అనుమతించలేదు. ఈ పరిధిలో భూములున్న రైతులను సైతం అనుమతించకపోవడంతో వారు ఇబ్బంది పడ్డారు.

యూకే నుంచి కూతురు, అల్లుడిని రప్పించి..

తిరుమలలో దంపతుల ఆత్మహత్య

- విశ్రాంత భవనంలో ఫ్యాన్‌కు ఉరి.. కుటుంబ కలహాలతోనే అఘాయిత్యం!

తిరుమల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ఓ రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్, భార్యతో కలిసి శుక్రవారం తిరుమలలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. తిరుపతిలోని అబ్బన్నకాలనీకి చెందిన శ్రీనివాసులు నాయుడు మూడేళ్ల క్రితం హెడ్ కానిస్టేబుల్‌గా వీఆర్ఎస్ పొందారు. శ్రీవారి దర్శనం కోసం గురువారం భార్య అరుణ, తమ్ముడు రమేష్, మరదలితో కలిసి తిరుమలకు వచ్చారు. ఓ విశ్రాంతి భవనంలో గది తీసుకున్నారు. సాయంత్రం దర్శనం పూర్తికాగానే రమేష్ తన భార్యతో కలిసి తిరుగు ప్రయాణమయ్యారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులు శ్రీనివాసులు నాయుడు, అరుణకు ఎన్నిసార్లు ఫోను చేసినా తీయలేదు. అనుమానం వచ్చి తిరుపతిలో ఇంటి వద్ద ఉన్న కుమార్తె జయశ్రీ, అల్లుడు శ్రీకాంత్ శుక్రవారం మధ్యాహ్నం తిరుమలకు వచ్చారు. విజిలెన్స్, పోలీసుల సాయంతో తలుపులు తెరిచి చూడగా వారు ఉరికి వేలాడుతూ కనిపించారు. కాగా, యూకేలో ఉంటున్న కుమార్తె, అల్లుడిని పదిరోజుల క్రితమే ఇండియాకు రప్పించినట్టు తెలుస్తోంది. తమ చావుకు ఎవరూ కారణం కాదని రాసి ఉన్న సూసైడ్ నోట్ పోలీసులకు లభించినట్లు తెలిసింది. కుటుంబ కలహాల నేపథ్యంలోనే దంపతులు ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

వాట్సాప్ ద్వారా ఇంటర్ హాల్ టికెట్లు

- సెకెండియర్ ప్రాక్టికల్స్ విద్యార్థులు డౌన్‌లోడ్‌కు అవకాశం: బోర్డు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సెకెండియర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ హాల్‌టికెట్లను వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా శుక్రవారం తెలిపారు. అదేవిధంగా ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఫస్టియర్ హాల్ టికెట్ నంబరు లేదా ఆధార్, పుట్టిన తేదీలతో విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. వాట్సాప్ ద్వారా అయితే.. 9552300009 నంబరు ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు.

క్లీన్ ఎనర్జీలో పెట్టుబడులకు ఆమోదం

- అనంత, సత్యసాయి జిల్లాల్లో మూడు పవన విద్యుత్ ప్లాంట్లు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ రంగంలో రూ.10వేల కోట్ల పెట్టుబడులు.. 7.5 లక్షల మందికి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ఇంధనోత్పత్తి సంస్థలను ప్రోత్సహిస్తోంది. గురువారం మంత్రివర్గ సమావేశంలో క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. మూడు సంస్థల పెట్టుబడులకు అనుమతినిస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని అమల్లోకి తెస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో సీఎస్ కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వు జారీచేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఎలక్కుంట్ల, ముత్తవకుంట్ల, రామగిరి, నసనకోట గ్రామాల పరిధిలో 231 మెగావాట్ల పవన్‌విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కడప రెన్యువబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతిచ్చారు. అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, శెట్టూరు మండలాల పరిధిలో 178.20 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు స్థాపనకు మెస్సర్స్ అనంతపూర్ రెన్యువబుల్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేశారు. శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని మోటారు చింతలపల్లి (ఎంసీ పల్లి), కురాకులపల్లి, పేరూరు, కొండాపురం, మక్కినవారిపల్లి గ్రామాల్లో మెస్సర్స్ అస్సిరి రెన్యువబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 118.80 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు స్థాపనకు ఆమోదం తెలుపుతున్నట్లు ఇంధనశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

రూ. రెండున్నర కోట్ల యాపిల్ ఫోన్లు కొట్టేశారు

విజయవాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ దొంగలు బెజవాడలో బీభత్సం సృష్టించారు. ఎలక్ట్రానిక్ పరికరాల గోడౌన్‌లోకి చొరబడి ఐఫోన్లు, ట్యాబ్‌లు, యూఎస్‌బీ పరికరాలను దొంగిలించారు. అమెరికాకు చెందిన ఇన్‌గ్రాం మైక్రో ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ దేశంలో సెల్‌ఫోన్ల షోరూంలకు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు సరఫరా చేస్తోంది. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో ఉన్న గోడౌన్ వద్దకు ఈ నెల 5న అర్ధరాత్రి కారులో వచ్చిన ఆరుగురు ఆగంతకులు కట్టర్‌తో షట్టర్‌ను కత్తిరించి లోపలకు ప్రవేశించారు. సీసీ కెమెరాల్లో ముఖాలు కనిపించకుండా ప్రయత్నించినా వారి ఛాయాచిత్రాలు స్పష్టంగా రికార్డయ్యాయి. అట్టపెట్టెల్లో ఉన్న 271 యాపిల్ ప్రో, మ్యాక్స్ ఫోన్లు, రెండు ఐప్యాడ్స్, 75 ఇయర్ పాడ్స్, ఒక మౌస్, ఒక అడాప్టర్, పది లెనోవో ట్యాబ్‌లను దొంగిలించారు. పటమట పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు సీసీ కెమెరా ఫుటేజీలను బట్టి ఆ దొంగలు యూపీకి చెందినవారై ఉంటారని అంచనాకు వచ్చారు. చోరీ సొత్తు విలువ రూ.2.51 కోట్లు ఉంటుందని సీఐ వి.పవన్ కిశోర్ తెలిపారు. కాగా, నిందితులను బిహార్ రాష్ట్రంలోకి ప్రవేశిస్తుండగా, అక్కడి పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది.

20 కోట్లు ఇస్తామన్నారు!

- సీబీఐ అధికారికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలన్నారు
- వైఎస్ కుటుంబానికి అనుకూలంగా ఉండాలన్నారు
- వివేకా హత్య కేసు అప్రూవర్ దస్తగిరి వెల్లడి



కడప, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): యువతి కిడ్నాప్ కేసులో కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సమయంలో.. వివేకానందరెడ్డి హత్య కేసు నిందితుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి (ఏ-5) కుమారుడు దేవిరెడ్డి చైతన్యరెడ్డితో పాటు అప్పటి జైలు సూపరింటెండెంట్, జమ్మలమడుగు డీఎస్పీ, ఎర్రగుంట్ల సీఐ బెదిరించారని అప్రూవర్ దస్తగిరి చేసిన ఫిర్యాదుపై విచారణ మొదలైంది. విచారణాధికారిగా నియమితులైన రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్ శ్రీరామ్ శుక్రవారం అతడిని కడప సెంట్రల్ జైలుకు పిలిపించి మూడు గంటల పాటు ప్రశ్నించారు. దస్తగిరికి వరుసకు కూతురయ్యే యువతి ఓ ఎస్సీ యువకుడిని ప్రేమించింది. ఆ అమ్మాయి కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు దస్తగిరి ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చే ప్రయత్నం చేయగా.. అతడిపై ఎర్రగుంట్ల పోలీసు స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఆ కేసులో 2023 అక్టోబరు 31 నుంచి 2024 ఫిబ్రవరి వరకు దస్తగిరి కడప సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. ఆ సమయంలో ఎవరెవరు నిన్ను ఇబ్బంది పెట్టారు.. ఎలాంటి ప్రలోభాలకు గురిచేశారని రాహుల్ అతడిని అడిగినట్లు తెలిసింది. వివేకా హత్య కేసులో పలు వాస్తవాలు బయటకు చెప్పడంతో వైసీపీ నేతలు జీర్ణించుకోలేక తనను ఇబ్బంది పెడుతున్నారని అతడు బదులిచ్చినట్లు సమాచారం. 'వైద్యశిబిరం పేరిట డాక్టర్ దేవిరెడ్డి చైతన్యరెడ్డి 2023 నవంబరు 20న జైల్లో నేను ఉంటున్న ఎస్ఎస్ఆర్ బ్యారక్‌లోకి వచ్చాడు. నువ్వు అప్రూవర్‌గా మారి మమ్మల్ని ఇబ్బంది పాల్జేశావు. అప్పటి సీబీఐ అధికారి రామ్‌సింగ్‌కు వ్యతిరేకంగా.. ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డికి అనుకూలంగా సాక్ష్యం చెబితే రూ.20 కోట్లు ఇస్తామని ఆఫర్ చేశాడు. నేను ఒప్పుకోకపోవడంతో వెళ్లిపోయాడు. నువ్వు జైలు నుంచి బయటకు వస్తే చంపేస్తామని బెదిరించాడు' అని దస్తగిరి చెప్పినట్లు తెలిసింది. తాను ఉన్న బ్యారక్ ఎదురుగా సీసీ కెమెరాలున్నాయని, అయితే చైతన్యరెడ్డి వచ్చే సమయంలో వాటిని తొలగించారని చెప్పాడు. మూడు నెలల తర్వాత ఎందుకు బహిర్గతం చేశావని విచారణాధికారి ప్రశ్నించగా.. ఆ రోజే చెబితే బయట ఉన్న తన భార్య, పిల్లలకు ప్రాణహాని ఉంటుందని భయపడి చెప్పలేదన్నాడు. 'బెదిరింపుల విషయాన్ని నా భార్య మీడియా ముందు చెప్పడంతో అప్పటి జైలు సూపరింటెండెంట్ ప్రకాశ్ నాపై ఆగ్రహం వ్యక్తం చేసి జైల్లో ఇబ్బందులు పెట్టారు. నన్ను చీకటి గదిలో బంధించారు. నా భార్యకు మతిస్థిమితం లేక మీడియాతో మాట్లాడిందంటూ జైలు నుంచే లేఖ రాయాలని నాపై ఒత్తిడి తెచ్చారు' అని వివరించినట్లు సమాచారం. దస్తగిరి పులివెందుల పోలీసు స్టేషన్‌లో చేసిన ఫిర్యాదులోని ప్రతి అంశాన్నీ విచారణాధికారి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. కాగా.. అప్పటి కడప జైలు సూపరింటెండెంట్ ప్రకాశ్, చైతన్యరెడ్డి శనివారం విచారణకు వచ్చే అవకాశం ఉందని సమాచారం.

జగనే చంపించి నారాసుర రక్తచరిత్ర అన్నారు

తన చిన్నాన్నను జగనే చంపించి తన పత్రికలో నారాసుర రక్తచరిత్ర రాయించారంటూ దస్తగిరి ఆరోపించాడు. విచారణ అనంతరం గేటు బయట విలేకరులతో మాట్లాడాడు. వివేకా హత్య కేసులో త్వరగా నిగ్గుతేల్చాలని జగన్ ఎందుకు కోర్టును ఆశ్రయించలేదని ప్రశ్నించాడు. ఈ కేసు త్వరలోనే తేలుతుందని ఆశాభావం వ్యక్తంచేశాడు. జైల్లో తనను ఇబ్బంది పెట్టిన చైతన్యరెడ్డి, జైల్ సూపరింటెండెంట్ ప్రకాశ్, డీఎస్పీ నాగరాజు, సీఐ ఈశ్వరయ్యపై కేసు పెట్టానని. ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై దృష్టిపెట్టాలని కోరాడు.

ఆ డాక్టరే కీలకం!!

జగన్ హయాంలో వివేకానందరెడ్డి హత్య కేసు నిందితుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఇతరులు కడప సెంట్రల్ జైలులో ఉన్నప్పుడు.. అక్కడ ముగ్గురు డాక్టర్లు ఉన్నారు. వీరిలో ఓ డాక్టర్ డబ్బులకు కక్కుర్తి పడి రిమాండ్ ఖైదీలకు గులాంగిరీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన వివేకా హత్య కేసులో ఉన్న కొందరికి కొమ్ముకాసినట్లు చెబుతారు. ఆ కేసులో ఉన్న ఓ రిమాండ్ ఖైదీ తన బ్యారక్‌లో కంటే ఈ డాక్టర్ రూములోనే ఎక్కువ రిలాక్స్ అవుతూ సెటిల్‌మెంట్లు సైతం చేశారని చర్చ నడుస్తోంది. సెంట్రల్ జైలుకు వెళ్లే డాక్టర్లకు తనిఖీలు ఉండవంటారు. దీనిని అడ్డుపెట్టుకుని ఈ డాక్టర్ అడ్డగోలుగా వ్యవహరించాడనే ప్రచారం ఉంది. ఈయన చొరవతోనే వైద్యశిబిరం పేరిట చైతన్యరెడ్డి కడప సెంట్రల్ జైలుకు వచ్చి దస్తగిరిని బ్లాక్‌మెయిల్ చేశాడని అంటున్నారు.

మొబైల్ ఫోన్‌లోనే అన్ని ధ్రువపత్రాలు

- ఆర్టీజీఎస్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్



అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'భవిష్యత్‌లో పౌరులు తమ ధ్రువీకరణ పత్రాలను వేటినీ భౌతికంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. తమ ఫోన్లలోనే అన్ని పత్రాలనూ డిజిటల్ రూపేణా పొందుపర్చుకోవచ్చు. అందుకు వీలుగా డిజిలాకర్ సౌకర్యానికి ప్రభుత్వ సేవలన్నింటినీ అనుసంధానం చేస్తాం' అని ఐటీ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కార్యదర్శి కాటమనేని భాస్కర్ తెలిపారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల అనుసంధానం ప్రక్రియపై అన్ని శాఖల, విభాగ అధిపతులతో శుక్రవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ... "ఆర్టీజీఎస్ ఒక పెద్ద 'డేటా లేక్'ను ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వంలోని అన్ని శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని ఈ డేటా లేక్‌తో అనుసంధానం చేస్తాం. తద్వారా పౌరులకు డిజిటల్ సేవలను మరింత మెరుగ్గా అందించడానికి వీలవుతుంది. పౌరులకు అవసరమైన సేవలను అందించడమే కాకుండా చెల్లింపులు కూడా వాట్సప్ ద్వారా చేసే సదుపాయాన్ని కల్పిస్తున్నాం. వాట్సప్ గవర్నెన్స్‌ను తెలుగు, ఇంగ్లీషు భాషల్లో అందిస్తున్నాం. రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ప్రజల సౌకర్యార్థం తమిళం, ఒరియా, కన్నడ భాషల్లో కూడా అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి శాఖలోనూ ఒక 'చీఫ్ డేటా టెక్నికల్ ఆఫీసర్' (సీడీటీఓ)ను నియమించుకోవాలి. తమ వద్ద ఉన్న డేటాను ఆర్టీజీఎస్‌లోని డేటా లేక్‌తో పంచుకొనే ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలి" అని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్టీజీఎస్ సీఈవో దినేశ్‌కుమార్, డిప్యూటీ సీఈవో మాధురి తదితరులు పాల్గొన్నారు.

నిషేధ భూములకు విముక్తి

గత జగన్ సర్కారులో కన్నుపడ్డ భూములను అధికార పార్టీ నేతలు చెరపట్టారు. చేజిక్కించుకోవడం వీలుకాని భూములపై 'నిషేధం' విధించారు. చట్టాన్ని ఉపయోగించి నిషేధిత జాబితా 22(ఏ)లో చేర్పించారు. ఇలా పదులో, వందలో కాదు.. 38 వేల ఎకరాలపైనే ప్రైవేటు భూములను జాబితాలో చేర్పించారు. వారు సామాన్యులు, రైతులు, రాజకీయ ప్రత్యర్థులు, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలే బాధితులు.

బాధితుల కష్టాలను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ప్రభుత్వ ప్రయోజనాలతో సంబంధం లేనివి, అన్యాయంగా 22(ఏ)లో చేర్చిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. దీనిపై రెవెన్యూ శాఖ కసరత్తు చేస్తోంది. త్వరలో మార్గదర్శకాలు జారీ చేయనున్నారు.

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాల ప్రైవేటు భూములను చట్టప్రకారం 22(ఏ) నుంచి బయటపడేయటానికి రెవెన్యూశాఖ కసరత్తు మొదలు పెట్టింది. త్వరలో దీనిపై ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే వేలాది రైతుల భూములు నిషేధిత జాబితా నుంచి విముక్తి పొందనున్నాయి.

వేలాది ఫిర్యాదులు

రైతులు ప్రాణసమానంగా భావించే భూములను సర్కారే చెరపడితే? వాటిని నిషేధిత జాబితాలో చేరిస్తే? రైతుల పరిస్థితి ఏమిటి? న్యాయం పోరాటం చేయగల స్తోమత ఉన్నవారు కోర్టులకెళతారు. శక్తి లేని వారయితే రాజకీయంగా దారిలోకి వస్తారు. గత జగన్ ప్రభుత్వంలో జరిగిన భూ కథ ఇదే. 'భూములను కాపాడుతాం. వాటికి శాశ్వత హక్కు కల్పిస్తాం. ఇదే జగనన్న భూరక్ష పథకం' అంటూ ఆర్భాటం చేసిన వైసీపీ సర్కారులో అధికార పార్టీ నేతలు రెచ్చిపోయారు. నాడు వైసీపీ నేతలే అనధికారిక రెవెన్యూ పెద్దలుగా చెలామణి కావడంతో ప్రైవేటు భూములు సైతం నిషేధిత జాబితాలో చేర్చారు. ఏకంగా 38 వేల ఎకరాలను 22(ఏ) జాబితాలో చేర్పించారు. జగన్ సర్కారు ఘోర పరాజయానికి ఇది కూడా ప్రధాన కారణం. కూటమి ప్రభుత్వం వచ్చాక వేలాది ఫిర్యాదులు వస్తున్నాయి. తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ సమస్యను నిశితంగా పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

జగన్ జమానాలో వైసీపీ నేతలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం రిజిస్ట్రేషన్ చట్టంలోని 22 (ఏ)1(ఏ) సెక్షన్‌ను అడ్డగోలుగా వాడుకున్నారు. గ్రామాలు, పట్టణాల్లో మాట వినని సామాన్యులు, రాజకీయ ప్రత్యర్థులు, ఇతర పార్టీల కార్యకర్తలను అదిరించి, బెదిరించి లొంగదీసుకునేందుకు నిషేధిత జాబితాను దుర్వినియోగం చేశారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పేరిట సర్కారు భూముల సర్వే చేసింది. సర్వే అనంతరం భూముల రికార్డులు, సరిహద్దులు, ఇతర వివరాలు మారిపోయాయి. దీన్ని అడ్డం పెట్టుకొని వైసీపీ నేతలు తమకు గిట్టనివారి భూములను అన్యాయంగా నిషేధిత జాబితాలో పెట్టించి వేధించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 38 వేల ఎకరాల భూమిని 22(ఏ)1(ఏ)లో చేర్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక భూముల సమస్యలపై ఇటు రెవెన్యూ శాఖకు, అటు రాజకీయ పార్టీలకు వచ్చిన ఫిర్యాదుల్లో నిషేధిత జాబితాకు సంబంధించినవే. ఈ ఫిర్యాదుల మేరకు భూముల డేటా పరిశీలించగా, ఎక్కువగా 90 శాతం ప్రైవేటు భూములను నిషేధిత జాబితా అందులోనూ ఈ కేటగిరిలో చేర్చినవే ఉన్నాయి. నిజానికి ప్రభుత్వ ఆసక్తి ఉన్న భూములంటే.. సరిహద్దు, యాజమాన్య హక్కు, ఇతర లావాదేవీల కారణంగా వివాదం ఉన్న భూములు. వీటిపై క్రయ, విక్రయాలను నిషేధించేందుకే ఈ కేటగిరిలో చేరుస్తారు. ఇందులో ప్రైవేటు భూములు అందులోనూ పట్టాలున్నవి అసలు చేర్చడానికే వీల్లేదు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులకు ఇది తెలియని విషయం కాదు. అయినా వైసీపీ నేతల ఒత్తిళ్లతో సామాన్యుల భూములను అక్రమంగా, అన్యాయంగా నిషేధిత జాబితాలో చేర్చారు. ఇదీ 22(ఏ) ఉద్దేశం (బాక్స్‌లో) రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చట్టం-1908 అమల్లో ఉంది. దీంట్లో 22(ఏ)1(ఏ) అనే సెక్షన్ ఉంది. దీన్నే రెవెన్యూ పరిభాషలో నిషేధిత జాబితా అంటారు. ప్రభుత్వం, దాని అనుబంధ సంస్థల భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు నిషేధిత జాబితాలో చేరుస్తారు. ఒక్కసారి ఈ జాబితాలో చేర్చిన భూమి ఇక రిజిస్ట్రేషన్ కాదు. కాబట్టి ఎవరూ 22(ఏ)లో ఉన్న భూములను కొని రిజిస్ట్రేషన్ చేసుకోలేరు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి అనుబంధ సంస్థల సొంత భూములు, వాటి ప్రయోజనాలతో సంబంధం ఉన్న భూములను 22(ఏ)(1)లో చేరుస్తారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

పది రకాల కూరగాయలు

ఆహారంతో ఆరోగ్యం

మూల పత్ర కరీరాగ్ర ఫల కాండాధిరూఢకా!
త్వక్ పుష్పం కవకంచేతి శాకం దశవిదం స్మృతమ్!

ఆహారంలో శాకాలది అంటే కూరగాయలది ప్రధాన భాగస్వామ్యం. కూరగాయలు మొత్తం పది రకాలున్నాయి. దుంపకూరలు, ఆకుకూరలు, చిగుర్లు, పండ్లు, కాయలు, కాడలు, మొలకలు, బెరళ్లు, పూలు, పుట్టగొడుగులు... ఇలా పది రకాలుగా ఉన్న శాకాల్ని మనం తరచూ వండుకుంటూ ఉండాలి. ధాన్యాన్ని నానబెట్టి ఉంచితే మొలకలొస్తాయి. మొలకెత్తిన ధాన్యం కూరగాయగా మారిపోయి, అదనపు పోషకాలిస్తుంది. వరిధాన్యం, పప్పు ధాన్యం, కూరగాయలు, నెయ్యి, నూనె సుగంధ ద్రవ్యాలు కలబోసినదే నిజమైన భోజనం. మాంసాహారులు మాంస ద్రవ్యాలను వీటికి అదనంగా చేర్చుకోవచ్చు. చిక్కుడులాంటి గింజలు కూడా అదనపు రుచినిస్తాయి.

పురుగు మందుల తాకిడి లేని కూరగాయలను ఎంచుకుని, జీర్ణశక్తిని అనుసరించి కూరగాయల్ని తగిన రీతుల్లో వండుకోవాలి. శరీరానికి సరిపడేవాటినే ఎంచుకోవాలి. ఎక్కువ పోషకాలుండి తక్కువ ధరకు తేలికగా దొరికేవాటిని తెచ్చుకోవడం మేలు. కూరగాయలనేవి ఆరోగ్యవంతులకే కాదు, అనారోగ్యంతో బాధపడేవారికీ, పిల్లలకూ అందరికీ ఉపయోగించేవిగా ఉండాలి. శరీరానికి ఎలాంటి ఇబ్బందీ కలిగించనిదే ఆరోగ్యదాయక శాకం.



పైన చెప్పిన పది రకాల కూరగాయల్ని తరచూ మార్చి మార్చి తింటూ ఉండాలని ఆయుర్వేద గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఒకే రకం కూరగాయని విడవకుండా తింటే అస్థిభేదక (ఎముకలు దెబ్బతినటం), నేత్రశక్తి నాశక (కంటి చూపు మందగించటం), రక్తశుక్రనాశక (రక్త కణాల్ని, పురుషుల్లో జీవ కణాల్ని నశింపచేయటం), ప్రజ్ఞాక్షయం (మేధశక్తిని హరించడం), పాలిత్యకారక (జుట్టు నెరిసిపోవడం), స్మరణ శక్తి నాశక (జ్ఞాపకశక్తిని నశింప చేయడం) అని 'బావప్రకాశ' అనే ఆయుర్వేద గ్రంథం వివరించింది. కాబట్టి, ఒకే రకం కూరగాయలు కాకుండా ఒక రోజు దుంపకూర, ఒకరోజు ఆకుకూర, ఒకరోజు కాయగూర... ఇలా పది రకాల్నీ మార్చిమార్చి తినాలనేది సూచన. ఒక ఇంటి నిర్మాణానికి ఇసుక, సిమెంటు ఇటుక అన్నీ కావాలి. కేవలం ఇసుకతోనో ఇటుకతోనో నిర్మాణం సాగదు. ఆహారం అయినా అంతే! పది రకాల శాకాలలో ఏదో ఒకటి రోజూ అన్నంలో ఉండేలా ఆహార ప్రణాళిక ఉండాలి! కేరెట్, ముల్లంగి, కీరా, టమోటాలాంటి శాకాల్ని వండకపోయినా తేలికగానే అరుగుతాయి. తక్కిన కూరగాయల్ని సుపక్వంగా అంటే చక్కగా వండుకొని తినటమే మంచిది.

శాకాహారుల భోజనం పేరుకే గానీ, అందులో శాకాల పాత్ర తక్కువగా ఉంటోంది. చింతపండు లేదా మసాలా గ్రేవీలు ఎక్కువగా, కూర తక్కువగా ఉండేలా వండుకుంటున్నారు. గరిటెడు సొరకాయ పులుసు కూరలో రెండో మూడో సొరకాయ ముక్కలుంటే, మిగతాదంతా పులుసు ఉంటోంది. ఆ రెండు ముక్కలతోనే శాకాహారం అంటే సరిపోదు. కూర ఎక్కువగా, అన్నం తక్కువగా తినగలిగేలా వండుకోవాలి. శాకములు 50 శాతం, పప్పు ధాన్యాలు 25 శాతం, అన్నం 25 శాతం ఉండేట్లు తింటే మధుమేహం, బీపీ సహా ఏ జబ్బులూ రాకుండా ఉంటాయి. కూర, పప్పు, పచ్చళ్లను అతిగా చింతపండు రసం కలిపి, లేదా అల్లం వెల్లుల్లి పేస్టు కలపివండటంవలనే మన ఆహారం శాకములు లేని శాకాహారంగా మారిపోతోంది.

● గంగరాజు అరుణాదేవి

ఇంటి తోట పెంచాలంటే..!

చాలామంది ఇంటి పరిసరాల్లో చిన్నపాటి తోటను పెంచుకోవాలని అనుకుంటారు. పూలు, కూరగాయల మొక్కలతో కూడిన అందమైన తోటను సృష్టించడానికి నిపుణులు అందిస్తున్న సూచనలు ఇవే..

- మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే ఎక్కువసేపు సూర్యకాంతి నిలుస్తూ ధారాళంగా గాలి వీచే ప్రదేశాన్ని ఎంపిక చేసుకోవాలి. ఇంటి వెనక, బాల్కనీ, విద్దెలు తోట పెంపకానికి అనువుగా ఉంటాయి.
- తోట కోసం కేటాయించిన స్థలాన్ని దృష్టిలో ఉంచుకుని తోట విస్తరణలో భాగంగా పళ్ల మొక్కలు, ఔషధ మూలికలు పెంచవచ్చు.
- తోట పెంచడానికి అవసరమైన మట్టి, సేంద్రియ ఎరువులు, విత్తనాలు, నీళ్ల పిచికారీ చేసే డబ్బాలు, ఆవుపేడ, మట్టితో తయారు చేసిన కుండీలు, నీటి సదుపాయం తదితరాలను సమకూర్చుకోవాలి. వంటగది వ్యర్థాలు, పళ్ల తొక్కలు, ఎండిన ఆకులతో కంపోస్ట్ తయారు చేసుకోవచ్చు.
- మొక్కలు పెరుగుతున్నప్పుడు ప్రాథమిక సంరక్షణ అత్యవసరం. అదనంగా పెరిగిన కొమ్మలను కత్తిరించాలి. ఎండిన ఆకులను ఎప్పటికప్పుడు తీసివేయాలి. తెగుళ్ల సోకకుండా రసాయనాలకు బదులు వేపనూనెని నీళ్లలో కలిపి పిచికారీ చేయాలి.
- మొక్కలకు రోజూ కనీసం నాలుగు గంటలు ఎండ తగిలేలా చూసుకోవాలి. అంత వేడి అవసరం లేని మొక్కలకు ఎండ తగలకుండా చుట్టూ పరదా కట్టాలి. మొక్క స్వభావాన్నిబట్టి నీరు పోయాలి.



వంటిల్లు

కాలీఫ్లవర్‌తో కొత్తగా...

కాలిఫ్లవర్ అంటే ఇష్టపడనివారు ఉండరు. దీంతో మంచూరియా, పకోడీ లాంటి స్నాక్ ఐటమ్స్ మాత్రమే కాదు... రుచికరమైన కూరలు కూడా చేసుకోవచ్చు. అలాంటి కొన్ని కూరల తయారీ మీ కోసం...



ఆలూ గోబీ మసాలా



కావాల్సిన పదార్థాలు

- ఉడికించిన ఆలుగడ్డ ముక్కలు- ఒక కప్పు, ఉడికించిన కాలీఫ్లవర్ ముక్కలు- ఒక కప్పు, ఉడికించిన పచ్చి బఠానీలు- అర కప్పు, నూనె- మూడు చెంచాలు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, టమాటా ముక్కలు- ఒక కప్పు, జీలకర్ర- ఒక చెంచా, అల్లం తరుగు- రెండు చెంచాలు, వెల్లుల్లి తరుగు- ఒక చెంచా, ధనియాల పొడి- ఒక చెంచా, కారం- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, ఆమ్‌చూర్- ఒక చెంచా, ఇంగువ- తగినంత, ఉప్పు- తగినంత, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

జాగ్రత్తలు

- ఆలుగడ్డ ముక్కలు, కాలీఫ్లవర్ ముక్కలు వేసిన తరవాత అవి చిదమకుండా జాగ్రత్తగా కలపాలి.
- కూర గ్రేవీలా రావాలనుకుంటే చివరలో కమ్మని పెరుగు కలుపుకోవచ్చు.

తయారీ విధానం

- స్టవ్ మీద గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఇంగువ, జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, పసుపు, అల్లం తరుగు, వెల్లుల్లి తరుగు వేసి బాగా వేపాలి. తరవాత టమాటా ముక్కలు, ఉప్పు వేసి కలిపి మూతపెట్టి మగ్గనివ్వాలి. మిశ్రమం నుంచి నూనె పైకి తేలుతున్నప్పుడు ఆలుగడ్డ ముక్కలు, కాలీఫ్లవర్ ముక్కలు, బఠానీలు వేసి కలపాలి. ఒక నిమిషం తరవాత కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్ వేసి కలిపి మూతపెట్టి పది నిమిషాలు మగ్గించాలి. తరవాత కొత్తిమీర చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ కూరని పిల్లలు ఇష్టంగా తింటారు.

కాలీఫ్లవర్ చికెన్ కర్రీ

కావాల్సిన పదార్థాలు

- బోన్‌లెస్ చికెన్ ముక్కలు- అర కేజీ, కాలీఫ్లవర్- అరకేజీ, పెద్ద సైజు ఉల్లిపాయలు- రెండు, పచ్చిమిరపకాయలు- మూడు, టమాటాలు- రెండు, తరిగిన అల్లం- రెండు చెంచాలు, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, గరం మసాలా పొడి- రెండు చెంచాలు, పసుపు- పావు చెంచా, కారం- అర చెంచా, ధనియాల పొడి- ఒక చెంచా, నూనె- మూడు చెంచాలు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని, తరిగిన కొత్తిమీర- రెండు చెంచాలు



జాగ్రత్తలు

- కాలీఫ్లవర్ కొనేముందు బాగా తెల్లగా గట్టిగా ఉన్నదాన్ని ఎంచుకోవాలి.
- ఈ వంటకం రుచిని పెంచడానికి చికెన్ ముక్కలు ఉడికేటప్పుడు పావు కప్పు కొబ్బరిపాలు చేర్చుకోవచ్చు.
- చికెన్ ముక్కలు తొందరగా మెత్తబడతాయి. అవి ఉడుకుతున్నప్పుడు మధ్య మధ్యలో మూత తీసి చూసుకుంటూ ఉండాలి. మరీ ఎక్కువగా ఉడికితే కూర అంత రుచిగా ఉండదు.

తయారీ విధానం

- ముందుగా చికెన్ ముక్కలు, కాలీఫ్లవర్‌లను మంచినీళ్లతో శుభ్రంగా కడగాలి. కాలీఫ్లవర్‌ను పువ్వుల మాదిరి కోయాలి. పచ్చిమిరపకాయలు, టమాటాలు, ఉల్లిగడ్డలను కూడా చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. వెల్లుల్లి రెబ్బలను పొట్టు తీసి కచ్చాపచ్చాగా దంచి ఉంచుకోవాలి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ముందుగా ఉల్లిపాయ ముక్కలు వేసి అయిదు నిమిషాలు వేగనివ్వాలి. తరవాత పచ్చిమిరపకాయ ముక్కలు, పసుపు, అల్లం తరుగు, వెల్లుల్లి మిశ్రమం వేసి కలపాలి. అవి రెండు నిమిషాలు వేగాక టమాటా ముక్కలు, ఉప్పు, కారం, గరం మసాలా, చికెన్ ముక్కలు వేసి కలిపి గిన్నెమీద మూత పెట్టి మగ్గనివ్వాలి. చికెన్ ముక్కలు కొద్దిగా మెత్తబడిన తరవాత కాలీఫ్లవర్ ముక్కలు వేసి కలిపి కొన్ని నీళ్లు చల్లి మూతపెట్టాలి. పది నిమిషాల తరవాత ధనియాల పొడి కలపాలి. చివరలో కొత్తిమీర చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ కూర వేడి అన్నం, చపాతీల్లోకి బాగుంటుంది.

కాలీఫ్లవర్ మసాలా బుర్జీ

కావాల్సిన పదార్థాలు: కాలీఫ్లవర్- పావు కేజీ, పచ్చి బఠానీలు- ఒక కప్పు, నూనె- మూడు చెంచాలు, లవంగాలు- అయిదు, యాలకులు- మూడు, దాల్చిన చెక్క- చిన్న ముక్క, జీలకర్ర- అర చెంచా, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, టమాటాలు- మూడు, పచ్చిమిరపకాయలు- రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, కారం- రెండు చెంచాలు, ధనియాల పొడి- ఒక చెంచా, కసూరీ మేతీ- ఒక చెంచా, గరం మసాలా పొడి- అర చెంచా, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, నీళ్లు- ఒక కప్పు

తయారీ విధానం: ముందుగా కాలీఫ్లవర్‌ను పెద్ద ముక్కలుగా విడదీయాలి. వీటికి కాడ ఉండేలా చూసుకోవాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి రెండు గ్లాసుల నీళ్లు పోసి అర చెంచా ఉప్పు, చిటికెడు పసుపు వేసి బాగా మరిగించి దించాలి. ఇందులో కాలీఫ్లవర్ ముక్కలు వేసి అయిదు నిమిషాలు ఉంచాలి. తరవాత ముక్కలను పళ్లెంలోకి తీసి చల్లారనివ్వాలి. పచ్చి బఠానీలను కూడా నీళ్లు పోసి సగం వరకు ఉడకనివ్వాలి.

- లావుపాటి పెద్ద రంధ్రాలు ఉన్న గ్రేటర్ సహాయంతో కాలీఫ్లవర్ ముక్కలను తురిమి బుర్జీని సిద్ధం చేసుకోవాలి. టమాటాలను ముక్కలుగా కోసి మెత్తగా గ్రైండ్ చేసి పెట్టుకోవాలి.
- స్టవ్ మీద మూకుడు పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఇందులో లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, జీలకర్ర వేసి దోరగా వేపాలి. తరవాత ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి అయిదు నిమిషాలు వేగనివ్వాలి. తరవాత టమాటా పేస్టు, ఉప్పు, పచ్చి బఠానీలు, పచ్చిమిరపకాయ ముక్కలు వేసి బాగా కలపాలి. మిశ్రమం నుంచి నూనె తేలే వరకు వేగనివ్వాలి. తరవాత ఇందులో పసుపు, కారం, ధనియాల పొడి వేసి కలిపి రెండు నిమిషాలు సన్నని మంట మీద ఉంచాలి. తరవాత కాలీఫ్లవర్ బుర్జీని కూడా వేసి బాగా కలిపి ఒక కప్పు నీళ్లు పోసి మూత పెట్టి ఆరు నిమిషాలు ఉడికించాలి. గిన్నెలో మిశ్రమం దగ్గరకు వచ్చాక కసూరి మేతీ, గరం మసాలా పొడి, కొత్తిమీర తరగు వేసి కలిపి రెండు నిమిషాలు ఉంచి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ మసాల బుర్జీని వేడి అన్నంలో కలుపుకుని తింటే చాలా రుచిగా ఉంటుంది.



జాగ్రత్తలు

- కూరలో బఠానీలు మెత్తగా ఉండాలనుకుంటే ముందుగానే ఎక్కువసేపు ఉడికించుకోవాలి. ఫ్రోజెన్ బఠానీలు తెచ్చుకుంటే వాటిని నేరుగా వాడుకోవచ్చు.
- కూరలో ఒక చెంచా పెరుగు కలిపితే దాని రుచి పెరుగుతుంది.

స్వయంకృషి

పర్యావరణహితంగా ఉపాధి మార్గంగా

స్వశక్తితో ఎదగాలన్న తపన ఆమెను కుదురుగా కూర్చోనివ్వలేదు. ఆ తపనతోనే లక్షల రూపాయలు తెచ్చిపెట్టే కొలువు వదిలేసి... భర్త, సోదరుడితో కలిసి అంకుర సంస్థను నెలకొల్పారు. ఆహార పదార్థాల కోసం ప్లాస్టిక్ రహిత కంటైనర్ల తయారీతో... పర్యావరణహిత ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఐదున్నరేళ్లలో కంపెనీని ఐదు కోట్లకు పైబడిన టర్నోవర్‌కు తీసుకువెళ్లి... తనలాంటి ఎంతోమంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ధన్విత సత్యానంద్ కథ ఇది.



"చదువుకొనే రోజుల్లో నాకంటూ ప్రత్యేకమైన లక్ష్యాలేవీ లేవు. మంచి మార్కులు తెచ్చుకోవాలి. అందరు అమ్మాయిల్లా మంచి ఉద్యోగంలో స్థిరపడాలి. ఇవే నా కోరికలు. కానీ ఒక్కసారి కొలువులో కుదురుకున్నాక... నా గురించి నేను ఆలోచించడం మొదలుపెట్టాను. అప్పుడే అర్థమైంది... ఇది కాదు నేను కోరుకున్న జీవితం అని. నాకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలి. కష్టపడి పని చేసి మరికొంతమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కోరుకున్నా. ఇదే విషయం మావారు శ్రీనిధి రాఘవన్, నా సోదరుడు భరత్ సత్యానంద్‌లకు చెప్పాను. వారూ అందుకు మద్దతునిచ్చారు. అలా ముగ్గురం కలిసి పలు బిజినెస్‌లు చేసి, చివరకు 'ఏకాజ్ స్టార్టప్'ను నెలకొల్పాం. ఈ కంపెనీ ద్వారా మేం కోరుకున్నట్టే మరికొందరికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వగలుగుతున్నాం. దీని వెనుక ఎన్నో ఏళ్ల శ్రమ, త్యాగాలు ఉన్నాయి. కర్ణాటక టుమ్కూరు జిల్లా మధుగిరి మాది. పాఠశాల విద్యాభ్యాసం తరువాత డిగ్రీ కోసం బెంగళూరుకు వచ్చాను. 2007లో 'మహవీర్ జైన్ కాలేజీ' నుంచి బీఎస్సీ డిగ్రీ, 2010లో పూణె 'సింబియోసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ' నుంచి 'ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేషన్'లో పీజీ పట్టాలు అందుకున్నాను. పీజీ అవ్వగానే బెంగళూరు 'ఆడెన్ పబ్లిక్ స్కూల్‌'లో అడ్మినిస్ట్రేటివ్ కోఆర్డినేటర్‌గా చేరడంతో నా ఉద్యోగ జీవితం ప్రారంభమైంది.

ఉద్యోగాలు మారినా...

స్కూల్లో ఎక్కువ కాలం పని చేయలేకపోయాను. ఏడాది తిరక్కుండానే ఓ ఫైనాన్షియల్ కంపెనీలో రెండేళ్లకు పైగా సేవలు అందించాను. కార్పొరేట్ కొలువు, దానికి తగిన జీతం... అన్నీ బానే ఉన్నాయి. జీవితం సంతోషంగానే సాగిపోతోంది. కానీ ఏదో వెలితి. రాఘవన్, భరత్‌లదీ అదే పరిస్థితి. ఐటీ కంపెనీల్లో మంచి హోదాల్లో ఉన్నారు. కానీ రొటీన్ పని... ఒక మూస పద్ధతికి అలవాటుపడిపోయాం. మాకు అలా ఉండడం నచ్చలేదు. ఉద్యోగాలు మారినా సంతృప్తి లేకపోవడంతో ముగ్గురం రాజీనామా చేసేశాం. సొంతంగా ఏదైనా వ్యాపారం మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నాం. అలా 2015లో బెంగళూరులోనే 'కార్టియర్ హోటల్స్' పేరుతో ఫోర్ స్టార్ హోటల్ ఒకటి ప్రారంభించాం. అయితే అందులో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి.

అప్పుడే తెలిసింది...

ఆతిథ్య, ఆహార రంగాల్లో ముడిసరుకు సేకరించడం, వినియోగించడం మధ్యన అంతరంవల్ల ఎంతో సమయం, వనరులు వృథా అవడాన్ని గమనించాం. సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సమస్యకు పరిష్కారం చూపాలనుకున్నాం. ఈ ఆలోచనతోనే మా రెండో వెంచర్... 'అగ్రెన్స్ సొల్యూషన్స్' సంస్థను నెలకొల్పాం. ముడిసరుకు కొనుగోలులో వృథాను సాధ్యమైనంత తగ్గించడంపై దృష్టి పెట్టాం. చీజ్, బటర్ తదితర 450 రకాల ఉత్పత్తులను సరఫరా చేసేవాళ్లం. అదే సమయంలో కొవిడ్ విజృంభించడంవల్ల డిమాండ్ తగ్గి, నష్టాలు పెరిగాయి. అవి భరించలేక, సంస్థను పక్కన పెట్టేశాం. అయితే దిగులు పడలేదు. మరో వినూత్న ఆలోచనతో 2020 చివర్లో 'ఏకాజ్ బయోవేర్'ను ప్రారంభించాం. ఆహార పరిశ్రమకు ప్యాకింగ్ కంటైనర్లను సరఫరా చేసే సంస్థ ఇది.

పర్యావరణ హితం...

మన దగ్గర ప్లాస్టిక్ నిషేధం అంటున్నారు కానీ... అది పూర్తి స్థాయిలో అమలు కావడంలేదు. దానివల్ల భూమికి భారం పెరిగిపోతోంది. పర్యావరణానికి ఎనలేని నష్టం వాటిల్లుతోంది. వీటిని దృష్టిలో పెట్టుకొని బయోడీగ్రేడబుల్ ప్యాకింగ్ మెటీరియల్స్ తీసుకువస్తున్నాం. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పేపర్‌తో కప్స్, బౌల్స్, డబ్బాలు తయారు చేస్తున్నాం. ఫుడ్ డెలివరీ సమయంలో ఇవి లీకవుతాయనే సందేహాలు మా కస్టమర్ల నుంచి ఉత్పన్నమయ్యాయి. అయితే మేం రూపొందించేవాటికి ఆ సమస్య లేదు. దీని కోసం కంటైనర్లకు ప్రత్యేక కోటింగ్ వేస్తాం. వాడి పడేసిన ఆరు నెలల్లో ఇవి మట్టిలో కలిసిపోతాయి. మా ఉత్పత్తులు 'సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ' (సిపెట్) ధృవీకరించినవి."

ఐదు కోట్లు దాటిన ఆదాయం...


మా సంస్థ నెలకొల్పి ఐదేళ్లు పూర్తయింది. ఆరంభంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా, క్రమంగా అనుభవం గడించి, సమష్టి కృషితో నిలదొక్కుకున్నాం. ప్యాకింగ్ కంటైనర్ల తయారీకి ప్రత్యేక మిషన్లు ఏర్పాటు చేశాం. ఒక్కో మిషన్ నిమిషానికి నలభై నుంచి నలభై ఐదు డబ్బాలు ఉత్పత్తి చేస్తుంది. 50 ఎంఎల్ నుంచి 1000 ఎంఎల్ వరకు కాగితం డబ్బాలు సరఫరా చేస్తున్నాం. ఇప్పటివరకు కప్స్, బౌల్స్, కంటైనర్లు, మూతలు, బాక్స్ తదితర అన్నీ కలిపి నాలుగు కోట్ల యూనిట్స్ విక్రయించాం. 5.2 కోట్ల రూపాయల వార్షిక ఆదాయాన్ని రాబట్టగలిగాం. అన్నిటికంటే ముఖ్యంగా నాలుగు లక్షల కిలోల ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించగలిగాం. తద్వారా ఆహార పరిశ్రమ ద్వారా వెలువడుతున్న కాలుష్యాన్ని కొంతవరకు అరికట్టగలిగాం. అందుకే ఈ ప్రయాణం మాకు లాభాలనే కాదు, ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని ఇస్తోంది.

మేకప్

వేడి వాతావరణంలో చెక్కుచెదరకుండా

ఎండ వేడి పెరుగుతోంది. కాబట్టి చలి కాలం మేకప్ సాధనాలకు స్వస్తి చెప్పి, వేసవికి తగిన వాటిని ఎంచుకోవాలి. అందుకోసం...

- **ప్రైమర్:** గాల్లోని తేమ వల్ల చర్మరంధ్రాలు అవసరానికి మించి పనిచేస్తూ స్వేదాన్నీ, చర్మపు సహజనూనె... సీబమ్‌నూ స్రవిస్తూ ఉంటాయి. దాంతో వేసవి మేకప్‌తో ముఖం జిడ్డుగా మారిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే, ముఖానికి ప్రైమర్ పూసుకోవాలి. మరీ ముఖ్యంగా ముక్కు, నుదురు, చుబుకాలకు ప్రైమర్ అప్లై చేసుకోవాలి.
- **పౌడర్:** మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలంటే చివర్లో పౌడర్‌తో సెట్ చేసుకోవాలి. ఫౌండేషన్ లేదా కన్సీలర్ పూసుకున్న తర్వాత, ముఖం మీద ముడతలు పడే వీలున్న ప్రదేశాల్లో తప్పనిసరిగా లూజ్ పౌడర్ ఉపయోగించాలి. బేకింగ్ అనే ఈ ప్రక్రియ వల్ల బేస్ మేకప్ ముఖానికి అంటుకుపోయి, ఎక్కువ కాలం చెదిరిపోకుండా నిలుస్తుంది.



- **ఫౌండేషన్:** వేడికి మేకప్ కరిగిపోకుండా ఉండాలంటే, తేలికపాటి ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. ఫేస్ టింట్ కూడా వాడుకోవచ్చు. లైట్ వెయిట్ ఆకృతి కలిగి ఉండే ఫౌండేషన్ ఎంచుకున్నా, ఫేస్ టింట్‌ను ఎంచుకున్నా వీలైనంత పరిమితంగానే వాడుకోవాలి.
- **మస్కారా:** ఈ కాలంలో వాటర్‌ప్రూఫ్ మస్కారా వాడుకోవాలి. అలాగే కనురెప్పల కోసం సింగిల్ మెటాలిక్ ఐషాడోలనే ఎంచుకోవాలి. ఎండలో, ఉక్కపోతలో ఎక్కువ సమయం గడపవలసిన సందర్భాల్లో కారిపోకుండా ఉండే వాటర్‌ప్రూఫ్ ఉత్పత్తులనే ఎంచుకోవాలి.
- **లిప్ టింట్:** టింట్ వల్ల పెదవులు సహజసిద్ధ మెరుపును సంతరించుకుంటాయి. టింట్ లేకపోతే, పౌడర్ బ్లష్, లిప్ బామ్‌లను సమపాళ్లలో కలుపుకుని లిప్ టింట్‌గా వాడుకోవచ్చు. బ్లష్ లేకపోతే దానికి బదులుగా లిప్ లైనర్ లేదా క్రీమీ లిప్‌స్టిక్‌ను కూడా వాడుకోవచ్చు.

లైటు పురుగులతో ఇబ్బందా..!

సాయంత్రం పూట ఇంట్లో బల్బులు వెలగగానే వాటి చుట్టూ రకరకాల పురుగులు, కీటకాలు చేరుతుంటాయి. కిటికీలు, తలుపులు మూసినప్పటికీ ఏదోవిధంగా ఇంట్లోకి చొరబడుతూనే ఉంటాయి. వీటి వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. వీటిని నివారించడానికి రసాయనాలతో కూడిన స్ప్రేలు, కాయిల్స్ ఉపయోగించడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో ఉండే వాటితోనే కొన్ని చిట్కాలు పాటించి ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు.

- వేపనూనె వాసన ఘాటుగా ఉంటుంది. ఈ వాసన కీటకాలకు నచ్చదు. ఒక స్ప్రే బాటిల్ తీసుకుని అందులో నాలుగు చెంచాల వేపనూనె వేసి బాటిల్ నిండుగా నీరు పోసి బాగా కలపాలి. వెంటిలేటర్లు, కిటికీ ఊచలు, ఇంటి తలుపుల వద్ద ఈ నీటిని పిచికారీ చేస్తే పురుగులు లోపలికి రావు. వేపనూనెకు బదులు లావెండర్ నూనె లేదా పిప్పరమెంట్ నూనె ఉపయోగించుకోవచ్చు.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో ఒక గ్లాసు నీళ్లు పోయాలి. అందులో పన్నెండు వెల్లుల్లి రెబ్బలను బాగా దంచి వేసి మరిగించాలి. ఈ నీళ్లు కొద్దిగా చల్లారాక స్ప్రే బాటిల్‌లో పోసి పురుగులు, దోమలు వచ్చే ప్రదేశాల్లో పిచికారీ చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.



- ఒక గ్లాసు నీళ్లలో పది హారతి కర్పూరం బిళ్లలు వేసి కరిగించాలి. ఈ నీళ్లను స్ప్రే బాటిల్‌లో పోసి ఇంట్లోని అన్ని మూలల్లో పిచికారీ చేయాలి. కర్పూరం వాసనకు దోమలు, ఈగలు, ఇతర లైటు పురుగులు ఇంట్లో నుంచి పారిపోతాయి. గది మూలల్లో మట్టి ప్రమిదలు ఉంచి వాటిలో ఒకటి లేదా రెండు హారతి కర్పూరం బిళ్లలు వేసి వెలిగించినా మంచి ప్రయోజనం ఉంటుంది.
- అయిదు లవంగాలను కొద్దిగా వేడిచేసి మెత్తగా నూరి ఒక గ్లాసు నీళ్లలో కలపాలి. ఈ నీటిని ఇంటి గడప ముందు, కిటికీ తలుపుల వద్ద చల్లితే లవంగాల ఘాటుకి పురుగులు లోపలికి రావు.
- ఒక స్ప్రే బాటిల్‌లో కొన్ని నీళ్లు, రెండు చెంచాల బేకింగ్ సోడా, నాలుగు చెంచాల నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ ద్రావణాన్ని ఇంట్లో ట్యూబ్‌లైట్లు, బల్బుల చుట్టూ పిచికారీ చేస్తే పురుగులు దూరంగా వెళ్లిపోతాయి.